PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 44 సంచిక : 261 | విజయవాడ, గురువారం 24 ఏప్రిల్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Thursday 24 April 2025 | Rs

రాయనపాడు రైల్వేస్టేషన్ ఆధునీకరణ
- రూ.12.13 కోట్లతో అభివృద్ధి
- 58 శాతం పనులు పూర్తి

3



దూసుకొస్తున్న ముంబయి
- వరుసగా నాల్గో గెలుపుతో మూడో స్థానంలోకి
- సన్‌రైజర్స్‌పై ఏడు వికెట్ల తేడాతో విజయం

6

టెన్త్‌లో బాలికలదే హవా
- మొత్తం 81.14శాతం మంది పాస్ • గతేడాదితో పోల్చితే తగ్గిన ఉత్తీర్ణత
- మన్యం ఫస్ట్, అల్లూరి లాస్ట్ • మే 19 నుంచి సప్లమెంటరీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పదో తరగతి ఫలితాల్లో బాలికల హవా కొనసాగింది. బాలురు కంటే 5.78శాతం అదనంగా ఉత్తీర్ణత సాధించారు. పదో తరగతి-2025 ఫలితాలను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎక్స్ ద్వారా బుధవారం విడుదల చేశారు. మార్చి 17 నుంచి ఏప్రిల్ 1వ తేది వరకు జరిగిన ఈ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా 6,19,286 మంది దరఖాస్తు చేసుకోగా 6,14,459 మంది హాజరయ్యారు. హాజరైన వారిలో 4,98,585(81.14శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు.బాలికలు 3,01,202 మంది హాజరవ్వగా, 253,278(84.09శాతం0 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలురు 3,13,257 మంది హాజరవ్వగా 2,45,307(78.31శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం 5.55శాతం తగ్గింది. గత సంవత్సరం 86.69శాతం ఉత్తీర్ణత నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా 11,819 మంది పాఠశాలల నుంచి విద్యార్థులు పరీక్షలకు హాజరవ్వగా, 1680 పాఠశాలల్లో 100శాతం, 19 పాఠశాలల్లో సున్నా శాతం ఉత్తీర్ణత నమోదయ్యాయి. 95.55 శాతంతో పార్వతీపురం మన్యం జిల్లా తొలి స్థానం సాధించగా, 50.73శాతంతో అల్లూరి సీతారామరాజు జిల్లా చివరి స్థానంలో నిలిచింది. యాజమాన్యం వారీగా ఎపి రెసిడెన్షియల్ 95.02శాతంతో తొలిస్థానం కైవసం చేసుకున్నాయి. ఆ తరువాత 95శాతంతో బిసి సంక్షేమ పాఠశాలలు రెండో స్థానంలో నిలిచాయి. హాజరైన వారిలో 65.36శాతం మంది మొదటి క్లాస్‌లో పాసయ్యారు. రెండో లాంగ్వేజ్‌లో అత్యధికంగా 99.51శాతం మంది ఉత్తీర్ణత సాధించగా, అత్యల్పంగా మ్యాథ్స్‌లో 86.92శాతం సాదించారు. హిందీ మీడియంలో 100శాతం ఉత్తీర్ణత సాధించారు. తెలుగు మీడియంలో 58.59శాతం, ఇంగ్లీష్‌లో 83.15శాతం, ఉర్దూలో 70.71శాతం, కన్నడలో 58.25శాతం, తమిళంలో 77.08శాతం, ఒడియాలో 90.23శాతం చొప్పున పాసయ్యారు. సబ్జెక్టు వారీ మెమోరాండం షీట్లు నాలుగు రోజుల్లో అందుబాటులోకి రానున్నాయి. పాఠశాలల నుంచి కొంత సమాచారం రావాల్సి ఉండటంతో కొంతమంది ఫలితాలను విడుదల చేయలేదు.






600కి 600 మార్కులు సాధించిన నేహాంజని

సప్లమెంటరీ పరీక్షలు

సప్లమెంటరీ పరీక్షలు మే 19వ తేది నుంచి 28వ తేది వరకు నిర్వహిస్తామని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కెవి శ్రీనివాసులు రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఈ నెల 24 నుంచి 30వ తేది వరకు ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. అపరాధ రుసుంతో మే 18వ తేది వరకు చెల్లించే అవకాశం ఉంది. ప్రశ్న పత్రాల రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం ఈ నెల 24వ తేది ఉదయం 10 నుంచి మే 1వ తేది ఉదయం 11 గంటల వరకు www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రీ కౌంటింగ్ కోసం రూ.500లు, రీ వెరిఫికేషన్ కోసం రూ.1000లు చొప్పున చెల్లించాలని తెలిపారు.



శ్రీనగర్‌లోని దాల్‌లేక్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న స్థానికులు

స్తంభించిన కాశ్మీరం
- పహల్గాం దాడిపై ప్రజా నిరసన • 35ఏళ్ళలో తొలిసారి స్వచ్ఛందంగా

శ్రీనగర్/న్యూఢిల్లీ : జమ్మూ కాశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లా పహల్గాంలోని బైసరన్ ప్రాంతంలో పర్యాటకులపై జరిగిన ఉగ్ర దాడిని నిరసిస్తూ ప్రజలు స్వచ్ఛందంగా బుధవారం బంద్ పాటించారు. దీంతో కాశ్మీర్ లోయలో జనజీవనం స్తంభించింది. దుకాణాలు, వ్యాపార సంస్థలు, పెట్రోల్ బంకులు, విద్యా సంస్థలు మూతపడ్డాయి. కాగా కాశ్మీర్ లోయలో ఉగ్రవాద దాడులకు వ్యతిరేకంగా ప్రజా జీవనం స్తంభించిపోవడం గత 35ఏళ్ళలో ఇదే మొదటిసారి. ఉగ్రవాదులు మంగళవారం జరిపిన దాడిలో 28 మంది ప్రాణాలు కోల్పోగా పలువురు గాయపడిన విషయం తెలిసిందే.శ్రీనగర్‌లోనూ, లోయలోని ఇతర ప్రాంతాలలోనూ ప్రభుత్వ వాహనాలు నామమాత్రంగానే కన్పించాయి. ప్రైవేటు వాహనాలు మాత్రం మామూలుగానే తిరిగాయి. ప్రైవేటు పాఠశాలలను మూసివేయగా ప్రభుత్వ పాఠశాలలు తెరిచే ఉన్నాయి. కాశ్మీర్ వాణిజ్య పరిశ్రమల మండలి (కేసీసీఐ), కాశ్మీర్ వ్యాపారులు-ఉత్పత్తిదారుల సమాఖ్య (కేటీఎంఎఫ్), మత సంస్థ ముత్తాహిదా మజ్లిస్ ఉలేమా (ఎంఎంయూ), జమ్మూకాశ్మీర్‌కు చెందిన గ్రాండ్ ముఫ్తి నసీరుల్ ఇస్లాం సంయుక్తంగా బంద్‌కు పిలుపునిచ్చాయి. 'ఇలాంటి హింసాత్మక చర్యలు ఆమోదయోగ్యం కావు. మన సమాజంలో వీటికి స్థానం లేదు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా అందరూ సంఘటితం కావాలి. శాంతియుత, సామరస్యపూర్వకమైన సమాజం కోసం కృషి చేయాలి." అని గ్రాండ్ ముఫ్తి ఒక ప్రకటనలో కోరారు.

జమ్మూ ప్రాంతంలో కూడా బంద్‌కు పూర్తి మద్దతు లభించింది. జమ్మూ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ, జమ్మూ బార్ అసోసియేషన్ పూర్తి బంద్‌కు పిలుపునిచ్చాయి. జమ్మూ నగరంలోనూ, ఇతర ప్రధాన ప్రాంతాలలోనూ బంద్ దృశ్యాలు కన్పించాయి. బంద్‌కు రాజకీయ పార్టీలు, నేతలు మద్దతు తెలిపారు. బాధితులకు సంఘీభావం ప్రకటించారు.

లోయ అంతటా భద్రతను కట్టుదిట్టం చేశారు. ముఖ్యంగా కీలక పర్యాటక ప్రదేశాల వద్ద అదనపు దళాలను మోహరించారు. నిత్యావసరాలను విక్రయించే దుకాణాలను మాత్రమే అనుమతించారు. లోయలోని అన్ని జిల్లా కేంద్రాలలోనూ బంద్ ప్రభావం బాగా కన్పించింది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రజలు, రాజకీయ పార్టీలు, మత సంస్థలు, పౌర సమాజ గ్రూపులు సంఘటితమై ఈ విధంగా బలమైన సందేశాన్ని పంపడం ఇటీవలి కాలంలో చాలా అరుదైన విషయం.

కేంద్రం సమగ్ర దర్యాప్తు చేయాలి
- పహల్గాం దాడిని తీవ్రంగా ఖండించిన సిపిఎం

న్యూఢిల్లీ : జమ్మూ కాశ్మీర్‌లో కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతున్న పర్యాటకులపై విచక్షణారహితంగా కాల్పులు జరిపి 28మంది పర్యాటకులను పొట్టన బెట్టుకున్న తీవ్రవాదుల దుశ్చర్యను సిపిఎం పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపాన్ని తెలియజేస్తూ వారి కుటుంబాలకు సానుభూతి తెలిపింది. ఈ దాడిలో అనేకమంది తీవ్రంగా గాయపడ్డారని, వారు త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నట్లు పేర్కొంది. ఇంతటి దారుణానికి పాల్పడిన కిరాతకులను పట్టుకుని శిక్షించాలని సిపిఎం పేర్కొంది. అక్కడ పోలీసులు, భద్రతా దళాలు కేంద్ర ప్రభుత్వ అధీనంలో వున్నాయి. ఈ దాడికి పాల్పడిన వారిని పట్టుకోవడానికి కేంద్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోవాలని కోరింది. ఇటువంటి దారుణమైన నేరాలకు పాల్పడేవారు దేశానికి, ముఖ్యంగా కాశ్మీర్ ప్రజలకు శత్రువులని పేర్కొంది. పర్యాటకులతో రద్దీగా వుండే ప్రాంతాల్లో సరైన భద్రత లేకపోవడంతో సహా దాడికి సంబంధించిన పలు కోణాల్లో తక్షణమే సమగ్ర దర్యాప్తు చేపట్టాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని పేర్కొంది. ఈ విషాద సమయంలో ఉగ్రవాద, ఛాందసవాద శక్తులకు వ్యతిరేకంగా దేశ ప్రజలకు సిపిఎం బాసటగా నిలబడుతుందని పేర్కొంది.

సింధు జలాల ఒప్పందం నిలిపివేత
- పాక్‌పౌరులు 48గంటల్లోగా దేశాన్ని వీడాలి
- అత్తారి చెక్‌పోస్టు మూసివేస్తాం
- పహల్గాం దాడి నేపథ్యంలో భారత్ సంచలన నిర్ణయాలు
- ప్రధాని నేతృత్వంలో భద్రతా కేబినెట్ కమిటీ భేటీ

7

దిగివస్తోన్న అమెరికా
- చైనాపై సుంకాలను తగ్గిస్తామన్న ట్రంప్
- బీజింగ్‌తో స్నేహపూర్వక సంబంధాలకు ఓకే
- త్వరలోనే రష్యా, ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు

7

గాజాలో డయాలసిస్ రోగుల అవస్థలు
- వైద్యం సరిగా అందక వందలాదిమంది రోగులు మృతి

తిరిగి కేటాయింపులు అవసరం లేదు
- ఇప్పటికే ప్రాజెక్టువారీ నీటి కేటాయింపులు
- కేంద్ర ప్రభుత్వ నోటిఫికేషన్‌ను సవాల్ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య ఇప్పటికే కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టుల వారీ కేటాయింపులు జరిగాయని, మళ్లీ నీటి కేటాయింపులపై కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ అనవసరమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా పేర్కొన్నారు. కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టుల వారీ ఎపి, తెలంగాణ మధ్య జలాలను కృష్ణా ట్రిబ్యునల్ కేటాయించింది. అయితే ఎపి, తెలంగాణ మధ్య నీటి పంపకంపై పరిశీలించాలని 2023 అక్టోబర్ 6న కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యతిరేకించింది. ఈ నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. బుధవారం ఈ పిటిషన్‌పై న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటేశ్వరసింగ్‌తో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున జైదీప్ గుప్తా వాదనలు వినిపించారు. కృష్ణా నదీ జలాలు, వాటి పంపకాలు, ట్రిబ్యునల్ తీర్పులను వివరించారు. ఇప్పటికే కృష్ణా ట్రిబ్యునల్ రెండు రాష్ట్రాల మధ్య ప్రాజెక్టుల వారీ నీటి కేటాయింపులు చేసిందని, మళ్లీ నీటి కేటాయింపులు అవసరం లేదని పేర్కొన్నారు. ఈ సమయంలో న్యాయవాది జైదీప్ గుప్తాతో జస్టిస్ సూర్యకాంత్ ల్యాప్‌టాప్‌ల వాడకం గురించి తేలికైన విషయమని అన్నారు. దీంతో జైదీప్ గుప్తా ఆర్టిఫియల్ ఇంటెజెన్స్ (ఎఐ) టెక్నాలజీ సహాయంతో కృష్ణా నదికి ఉపనదులు వంటి వాటి గురించి సులభంగా ప్రశ్నించవచ్చని అన్నారు. దీనికి స్పందించిన జస్టిస్ సూర్యకాంత్, 'నేను అలా చేయను. అలా చేయడం నాకు చాలా భయంగా ఉంటుంది. మనం దేనిపైనైనా ఆధారపడటం ప్రారంభిస్తే, మనం దానికి అలవాటు పడటం మానవ స్వభావం. అప్పుడు ప్రతి ప్రశ్నకు అలానే ఆధారపడతాం. ఎఐ మానవ నిర్మిత యంత్రమే అని మనం గుర్తుంచుకోవాలి. ఎఐ చాలా తీవ్రమైన పక్షపాతంతో ఉంటుంది' అని వ్యాఖ్యానించారు. గురువారం కూడా ఈ విచారణను కొనసాగనుంది. ఎపి ప్రభుత్వం వాదనలు వినిపించనుంది.


'ఉండి' కూల్చివేతలపై చర్యలు
- ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్
- రఘురామకృష్ణరాజు అరాచక, రాక్షస పద్ధతులు
- భూస్వాములకు ఊడిగం చేస్తూ పేదల ఇళ్లు కూల్చివేత
- యుపిని మించిన బుల్డోజర్ సంస్కృతి



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉండి నియోజకవర్గంలో పేదల ఇళ్లను అన్యాయంగా కూల్చివేయడంపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని, ప్రోత్సహించిన స్థానిక ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజు అరాచకాలను నియంత్రించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. విజయవాడ బాలోత్సవ భవన్లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి బలరాం, రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావుతో కలిసి శ్రీనివాసరావు మాట్లాడారు. అధికారంలోకి వస్తే పేదలకు ఇళ్లపట్టాలిస్తామని వాగ్దానం చేసిన టిడిపి నాయకులు ఇప్పుడు అన్యాయంగా ఇళ్లను కూల్చివేస్తున్నారని అన్నారు. ఉండి నియోజకవర్గంలో ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజు ప్రోద్బలంతో 800 కుటుంబాలను రోడ్డుపాలు చేశారని, మరో 600 ఇళ్లను కూల్చివేసేందుకు సిద్ధమయ్యారని తెలిపారు. బ్రిటీష్ కాలం నాటి 1905 చట్టం ప్రకారం కూల్చివేతల నోటీసులు ఇచ్చారని, అన్ని చట్టాలనూ మారుస్తున్న ప్రభుత్వం పేదల ఇళ్ల కూల్చివేతలకు వచ్చేప్పటికి పాత చట్టాలను అమలు చేయడం అన్యాయమని తెలిపారు. పాలకోడేరులో అల్లూరి సీతారామరాజు పేరు పెట్టుకున్న కాలనీని లేకుండా చేశారని, గతంలో బ్రిటీష్‌వాళ్లు అల్లూరి సీతారామరాజును దారుణంగా కాల్చిచంపితే ఆయన పేరుతో ఉన్న కాలనీని కూల్చివేయడం ద్వారా ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజు మరోసారి అల్లూరిని హత్య చేశారని అన్నారు. పేదలు ఇళ్లు కూల్చిన వెనుక భాగంలో 15 ఎకరాలు భూస్వాములు అక్రమంగా సాగు చేసుకుంటున్నారని, వాళ్ల జోలికి మాత్రం వెళ్లడం లేదన్నారు. వారికి కూడా నోటీసులిచ్చి భూములు స్వాధీనం చేసుకొని స్థానిక పేదలకు పంచాలని అన్నారు. పేదల ఇళ్లపక్కన కాల్వగట్లపై ఉన్న కొబ్బరి చెట్లనూ పెత్తందారులే అనుభవిస్తున్నారని తెలిపారు. కాలుష్యం అని చెబుతున్నారని, ఇళ్లలో వ్యర్థాలతో కాలుష్యం కంటే అక్కడ రొయ్యల పరిశ్రమల నుండి వచ్చే కాలుష్యమే అధికమని తెలిపారు. వాటిపై ఎందుకు చర్యలు తీసుకోరని ప్రశ్నించారు. పేదలు తమ గోడు చెప్పుకునేందుకు ఎమ్మెల్యే ఇంటికి వెళితే చీత్కరించి పంపించేశారని, డిప్యూటీ స్పీకర్‌గా రఘురామ కృష్ణరాజు అనర్హుడని అన్నారు. రాక్షస పాలన చేస్తున్న ఆయన అరాచకాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని, గతంలో బ్యాంకులకు వేలకోట్లు ఎగ్గొట్టిన కేసులు అనేకం ఉన్నాయని, మిగతా 7లో

ప్రచండ భానుడు
- నంద్యాల జిల్లా గోనవరంలో అత్యధికంగా 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా సూరీడు ప్రచండ భానుడుగా మారడంతో ప్రజలు తల్లడిల్లిపోతున్నారు. ఎండలతోపాటు పెద్దయెత్తున వడగాడ్పులు వీస్తున్నాయి. రాష్ట్రంలో అత్యధికంగా బుధవారం నంద్యాల జిల్లా గోనవరంలో 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈ నెలలో ప్రస్తుతం నమోదైన ఉష్ణోగ్రతే అత్యధికమని ఈ మేరకు ఆ సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా గొల్లవిడిపిలో 43.8 డిగ్రీలు, వైఎస్‌ఆర్ జిల్లా మద్దూరులో 43.6 డిగ్రీలు, కర్నూలు జిల్లా తోవిలో 42.9 డిగ్రీలు, పల్నాడు జిల్లా నర్మలపాడులో 42.8 డిగ్రీలు, నెల్లూరు జిల్లా ఉదయగిరిలో 42.5 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అంతేకాకుండా వైఎస్‌ఆర్ జిల్లాలో 28 ప్రాంతాలు, నంద్యాలలో 22, ప్రకాశంలో 17, పల్నాడు 14, కర్నూలు 10, ఇతర చోట్లతో కలుపుకుని 135 ప్రాంతాల్లో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు కూర్మనాథ్ తెలిపారు. గురువారం 30 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, మరో 29 మండలాల్లో వడగాడ్పులు ప్రభావం చూపే అవకాశం ఉందని పేర్కొన్నారు. తీవ్ర వడగాడ్పులు వీచే మండలాల్లో శ్రీకాకుళం జిల్లాలో 6, విజయనగరం జిల్లాలో 15, పార్వతీపురం మన్యం జిల్లాలో 9 మండలాలు ఉన్నాయి. ఈ నెల 25న 17 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, మరో 16 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందన్నారు.

భారత వృద్ధి అంచనాలకు ప్రపంచ బ్యాంక్ కోత
- 6.7 శాతం నుంచి 6.3 శాతానికి పరిమితమవుతుందని అంచనా

న్యూఢిల్లీ : భారత వృద్ధి రేటు అంచనాలకు ప్రపంచ బ్యాంక్ కోత పెట్టింది. దేశంలో మూలధన వ్యయాల తగ్గుదలకు తోడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో బలహీనత, అమెరికా విధాన అనిశ్చితి నేపథ్యంలో భారత జిడిపి 0.4 శాతం తగ్గి 6.3 శాతానికి పరిమితం కావొచ్చని విశ్లేషించింది. ఇంతక్రితం ఈ అంచనా 6.7 శాతంగా ఉంది. భారత్‌లో ప్రయివేటు పెట్టుబడులు, ప్రభుత్వ మూలధన వ్యయాలు నెమ్మదించడం వల్ల గడిచిన 2024-25లోనూ వృద్ధి నిరాశపర్చిందని ప్రపంచ బ్యాంక్ తెలిపింది. ప్రభుత్వం తన లక్ష్యాలను చేరుకోలేదని వెల్లడించింది. గడిచిన 2024-25లో జిడిపి 6.5 శాతానికి మందగించనుందని విశ్లేషించింది. ఇంతక్రితం రోజు అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) కూడా భారత జిడిపి అంచనాలకు కోత పెట్టిన విషయం తెలిసిందే. ప్రస్తుత 2025-26లో వృద్ధి 6.2 శాతానికి పరిమితం కావొచ్చని.. ఇంతక్రితం 6.5 శాతం అంచనాతో పోల్చితే 0.3 శాతం తగ్గనుందని ఐఎంఎఫ్ పేర్కొంది.


ఉగ్రవాదాన్ని నిరోధించాలి
చంద్రమౌళి భౌతికకాయానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నివాళి



చంద్రమౌళి భౌతికకాయం వద్ద నివాళి అర్పిస్తున్న చంద్రబాబు

ప్రజాశక్తి- గాజువాక (విశాఖపట్నం)

ఉగ్రవాదాన్ని నిరోధించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. జమ్మూకాశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లా పహల్గాంలో మంగళవారం జరిగిన ఉగ్ర దాడిలో విశాఖలోని బీచ్ రోడ్డు ప్రాంతానికి చెందిన రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి చంద్రమౌళి మృతి చెందడంతో ఆయన భౌతికకాయాన్ని బుధవారం రాత్రి విశాఖ ఎయిర్‌పోర్టుకు తీసుకొచ్చారు. అక్కడ ఏర్పాటు చేసిన నివాళి కార్యక్రమానికి చంద్రబాబు హాజరయ్యారు. చంద్రమౌళి భౌతికకాయం వద్ద పూలు జల్లి, జాతీయ జెండాను కప్పి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ కాశ్మీర్‌లో జరిగిన కాల్పుల్లో రాష్ట్రానికి చెందిన ఇద్దరు మృతి చెందారని తెలిపారు. వారిలో విశాఖకు చెందిన చంద్రమౌళి ఒకరిని చెప్పారు. పథకం ప్రకారమే ఉగ్రవాదులు ఈ దాడికి దిగారన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తేవాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని తెలిపారు. బాధిత కుటుంబాలు నిలదొక్కుకోవడానికి అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రం, రాష్ట్రం సమన్వయంతో వ్యవహరించి భద్రతను పెంచుతామన్నారు. రాష్ట్రంలో సముద్రతీరం ఎక్కువగా ఉన్నందున మరింత భద్రత అవసరమని తెలిపారు. కాశ్మీర్ సుందర ప్రదేశమని, దాన్ని దెబ్బతీయడానికే ఉగ్రవాదులు ఈ కుట్ర చేశారని అన్నారు. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడాల్సిన అవసరముందని తెలిపారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత, ఎమ్మెల్యేలు గణబాబు, పంచకర్ల రమేష్‌బాబు, విష్ణుకుమార్ రాజు పాల్గొన్నారు.



కరువు మండలాల్లోని విద్యార్థులకు వేసవి సెలవుల్లో మధ్యాహ్న భోజనం

ప్రజాశక్తి-అమరావతి

కరువు మండల ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో చదివే విద్యార్థులకు ఈ వేసవి సెలవుల్లోనూ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తామని హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం తెలియజేసింది. ప్రభుత్వ హామీని చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం రికార్డుల్లో నమోదు చేసింది. కరువు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో విద్యను అభ్యసించే విద్యార్థులకు వేసవి సెలవుల్లో కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలుకు ఉత్తర్వులివ్వాలంటూ న్యాయవాది తాండవ యోగేష్ వేసిన పిల్ పరిష్కారమైనట్లుగా ప్రకటించింది.

ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేయాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో రైతులు సంక్షోభంలో ఉన్నారని, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లేక తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మరోవైపు అమెరికా నుండి వ్యవసాయ ఉత్పత్తుల తయారీ దిగుమతికి ట్యాక్స్ తగ్గించాలని అమెరికా ఉపాధ్యక్షులు జెడి వాన్స్ ప్రధానిని కోరారని, అదే జరిగితే దేశంలో ఆహార ఉత్పత్తి రంగం పూర్తిగా దెబ్బతినిపోతుందని తెలిపారు. అమెరికా ఒత్తిళ్లకు మోడీ తలూపుతున్నారని అన్నారు. అమెరికా ఉత్పత్తులపై ట్యాక్స్ తగ్గిస్తే దేశం మొత్తం అమెరికా వస్తువులతో నిండిపోతుందని పేర్కొన్నారు. డబ్ల్యుటిఒ ఒప్పందం ప్రకారం 100 శాతం ట్యాక్స్ విధించేందుకు అవకాశం ఉన్నా 36 శాతమే విధిస్తున్నారని, దీన్ని కూడా 10 శాతానికి తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం స్పందించి ట్యాక్స్‌ను కొనసాగించాలని కోరారు. వ్యవసాయ ధరలను స్థిరీకరించేందుకు నిధిని ఏర్పాటు చేయాలని, గిట్టుబాటు ధరలు కల్పించడానికి తక్షణం కేబినెట్ సబ్‌కమిటీ వేయాలని కోరారు.

పిఠాపురం బహిష్కృతులకు పరిహారం

పిఠాపురం నియోజకవర్గంలో దళితులను సాంఘిక బహిష్కరణకు గురిచేసిన పెత్తందార్లపై కేసులు పెట్టాలని, బాధితులకు పరిహారం ఇప్పించాలని శ్రీనివాసరావు కోరారు. చనిపోయిన దళిత యువకుడి కుటుంబానికి పరిహారం ఇవ్వాలని, వారిపై దాడి చేసి కక్షగట్టి వారిని వెలివేశారని తెలిపారు. పిఠాపురం ఎమ్మెల్యేగా ఉన్న జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ దీనిపై స్పందించలేదని అన్నారు. అధికారం లేనప్పుడు దళితులపై దాడులు జరిగితే ఊరుకోనని వీరాలు పలికి అధికారంలోకి రాగానే కనీసం స్పందించడం లేదని అన్నారు. దీనిపై ఆయన వైఖరి ఏమిటో చెప్పాలని, వెంటనే దళితులను పరామర్శించి ధైర్యం చెప్పాలని కోరారు.

మోడీ, అమిత్ షా వల్లే ఉగ్రవాదం

కాశ్మీర్‌లో ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా అనుసరిస్తున్న విధానం వల్లే ఉగ్రవాదం పెరుగుతోందని తెలిపారు. ప్రజలను వదిలేసి భూభాగం కోసం ప్రయత్నాలు చేయడంతో పాకిస్తాన్ ఉగ్రవాదులు యథేచ్ఛగా చొరబడి హత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. రక్షణ బాధ్యతలు తీసుకోవాల్సింది కేంద్రం, అమిత్ షా రాష్ట్రాల్లో ప్రభుత్వాలను కూల్చేపనిలో ఉంటే ఉగ్రవాదులు మాత్రం యథేచ్ఛగా కాల్పులు జరుపుతున్నారని అన్నారు. 370 ఆర్టికల్ రద్దు ద్వారా ఉగ్రవాదాన్ని నాశనం చేస్తామని చెప్పారని, ఆచరణలో పెరిగిందని పేర్కొన్నారు. వరుసగా మిలటరీపైనా, అధికారులపైనా కాల్పులు జరుపుతున్న ఉగ్రవాదులు, నేడు అమాయక పర్యాటకులపై కాల్పులకు తెగబడ్డారని అన్నారు. మిలటరీ దుస్తుల్లో వచ్చారని చెబుతున్నారు, అంత బహిరంగంగా చొరబాట్లు జరుగుతుంటే ప్రభుత్వం ఏమి చేస్తోందని ప్రశ్నించారు. ఉగ్రవాద విస్తరణకు మోడీ, అమిత్ షా విధానాలే కారణమని విమర్శించారు.

అమరావతి నిర్మాణ బాధ్యత కేంద్రం తీసుకోవాలి

అమరావతి నిర్మాణ బాధ్యతను కేంద్రం తీసుకోవాలని, ఇప్పటి వరకూ నిర్మాణం జరగకపోవడానికి కేంద్రం, ప్రధాని మోడీ కారణమని శ్రీనివాసరావు తెలిపారు. గతంలో వచ్చి శంకుస్థాపన చేసి మట్టినీరు ఇచ్చి వెళ్లారని అన్నారు. ఇప్పుడు మరోసారి శంకుస్థాపనకు వస్తున్నారని, ఇప్పుడన్నా కేంద్రం బాధ్యత తీసుకోవాలని కోరారు.

అమరావతిని అప్పులు చేసి నిర్మించాల్సిన అవసరం ఏముందని, ఎంతవరకు అవసరమో అంత నిర్మిస్తే సరిపోతుందని పేర్కొన్నారు. అనంతరం వచ్చే పెట్టుబడిదారులు వారి అవసరాల మేరకు అభివృద్ధి చేసుకుంటారని తెలిపారు. ఆర్థికంగా ఇబ్బంది ఉన్న సమయంలో రూ.వేలకోట్లు అప్పులు చేసి నిర్మాణాలు చేపడితే ఆ భారం ప్రజలపైనే పడుతుందని పేర్కొన్నారు.



పుస్తకావిష్కరణలో వి. శ్రీనివాసరావు, ఎంవిఎస్ శర్మ, బి. బలరాం, వొరప్రసాద్, కె.లక్ష్మయ్య

సోషలిజమే ప్రత్యామ్నాయం

పుస్తకాల ఆవిష్కరణలో వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సోషలిజమే పెట్టుబడిదారీ వ్యవస్థకు సరైన ప్రత్యామ్నాయమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు పేర్కొన్నారు. అసమానతలు లేని ఉన్నత సమాజం సోషలిజంతోనే సాధ్యమని తెలిపారు. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురించిన లెనిన్ ముఖ్యమైన మూడు గ్రంథాలను ఆయన బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. లెనిన్ రచించిన ఏం చేయాలి, ఒక అడుగు ముందుకి, రెండడుగులు వెనక్కి, ప్రజాతంత్ర విప్లవంలో సోషల్ డెమోక్రసీ రెండు ఎత్తుగడలు.. ఈ మూడు గ్రంథాలు విజ్ఞానం, వికాసంతోపాటు ఉద్యమాన్ని తీసుకెళ్తాయని చెప్పారు. లెనిన్ పుస్తకాలను అధ్యయనం చేయాల్సిన ఆవశ్యకత గతం కంటే పెరిగిందన్నారు. బూర్జువా పార్టీలకు, విప్లవోద్యమ పార్టీలకు, ట్రేడ్ యూనియన్లకు తేడా వివరిస్తూ, పార్టీ నిర్మించడం, పనిచేయడం సూచించేందుకు 'ఏం చేయాలి' అనే పుస్తకాన్ని రచించారన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభంలో పడటం, ఈ వ్యవస్థలో జీవించలేమని స్థితికి ప్రజలు రావడం, ఆ ప్రజలను సంఘటితం చేసేందుకు బలమైన కమ్యూనిస్టు పార్టీ ఉంటే అక్కడ విప్లవోద్యమం వస్తుందని తెలిపారు. సామ్రాజ్యవాదంలో ఇప్పుడున్న దశ ప్రపంచీకరణగా పేర్కొన్నారు. మూడున్నర దశాబ్దాల పెట్టుబడిదారీ వ్యవస్థను ఒక దశకు తీసుకెళ్లిన ప్రపంచీకరణ ఈ రోజు దానికదే ఆటంకంగా మారిందన్నారు. రాష్ట్రంలో 1.45 లక్షల ఎకరాలు గతేడాది ఎపిఐఐసికి సేకరించిందని తెలిపారు. ఇప్పటికే ఏ పరిశ్రమలకూ 44 వేల ఎకరాలను కేటాయించలేదన్నారు. కేటాయించిన లక్ష ఎకరాల్లో 80 వేల ఎకరాల్లో పరిశ్రమలు పెట్టలేదన్నారు. పెట్టిన పరిశ్రమల్లో స్థానికులకు కేవలం 2 శాతం ఉద్యోగాలు కల్పించారని చెప్పారు. దేశంలో రూ.16 లక్షల కోట్ల బ్యాంక్ రుణాలను కార్పొరేట్లు చెల్లించలేదని, గతేడాది రూ.3 లక్షల కోట్లు పన్నులు ఎగవేశారని తెలిపారు. ఈ డబ్బు ఉంటే పేదలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న విధంగా పి4 విధానంలో ఎవరి దయా దాక్షిణ్యాలు, దత్తతలపై ఆధారపడాల్సిన పరిస్థితి పేదలకు ఉండదని చెప్పారు. పెట్టుబడిదారులు పేదరికాన్ని నిర్మూలించిన సంఘటనలు చరిత్రలోనే లేవన్నారు. దేశంలో ప్రజలకు కొనుగోలు శక్తి తగ్గిపోయిందని, ఫలితంగా ఉత్పత్తులు ఎక్కువవుతున్నా నిల్వచేసుకుంటున్నారని తెలిపారు. ఈ సమస్యలకు పరిష్కారం సోషలిజమేనని అన్నారు. 200 ఏళ్లలో అమెరికా సాధించిన ప్రగతి 30 ఏళ్లలో చైనా సాధించిందని, ఇందుకు కారణం అక్కడ ప్రభుత్వ రంగం బలమైనదిగా ఉండడమేనని తెలిపారు. దేశంలో ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేయడం, కార్పొరేట్ శక్తుల చేతుల్లో భూములు పెట్టడం వల్ల సంక్షోభానికి కారణంగా పేర్కొన్నారు. ప్రజాశక్తి బుక్ హౌస్ సంపాదకులు ఎంవిఎస్ శర్మ మాట్లాడుతూ.. లెనిన్ రచనలు రష్యన్ భాష నుంచి ఆంగ్లంలోకి, ఆంగ్లం నుంచి తెలుగులోకి అనువదించబడ్డాయని, ఈ కారణంగా తెలుగులో కంటే ఇంగ్లీష్‌లో చదవడమే సులువనే భావన ఉందని తెలిపారు. భగత్‌సింగ్ ఉరితీయబడటానికి కొన్ని గంటల ముందు కూడా రాజ్యం-విప్లవం పుస్తకాన్ని చదివినట్లు చెప్పారు. యువతకు ఈ సిద్ధాంతాల గురించి తెలుసుకోవాల్సిన అవసరాన్ని వారికి వివరించాలని సూచించారు. రష్యాలో విప్లవాన్ని తీసుకురావడం, ఈ క్రమంలో ఎదురైన సమస్యల గురించి, వాటి పరిష్కారం వంటి ఇతివృత్తాలను లెనిన్ పుస్తకాలు వెలికితీసేవని తెలిపారు. లెనిన్ ఏ పుస్తకమైనా రష్యాలో నెలకొన్న పరిస్థితులకు సమాధానంగా రాశారని చెప్పారు. 4 వేల ఏళ్ల నాటి వేదాలకు కాలం చెల్లిందని, 200 ఏళ్ల కిందటి మార్క్సిజానికి కాలం చెల్లిందంటున్నారని, సరైంది కాదన్నారు. కార్మికులకు విప్లవం గురించి వివరించడమే కమ్యూనిస్టుల పని అని, కార్మికులకు సొంత పార్టీ అవసరం అనేది లెనిన్ స్పష్టంగా చెప్పారన్నారు. విప్లవోద్యమంలో సిద్ధాంత, నిర్మాణ, సమాజాన్ని మార్చడానికి అవసరమైన పోరాటాలు కలిసి ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి బుక్ హౌస్ వర్కింగ్ ఎడిటర్ వొర ప్రసాద్ అధ్యక్షత వహించగా, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి బలరాం, జనరల్ మేనేజర్ కె లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అజయ్‌జైన్

2029 నాటికి ప్రతి ఒక్కరికీ శాశ్వత ఇల్లు

- 2026 మార్చి నాటికి 7.36 లక్షల ఇళ్లు
- గృహ నిర్మాణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ 2029 నాటికి శాశ్వత గృహాలు అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని గృహ నిర్మాణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ పేర్కొన్నారు. విజయవాడ ఆటోనగర్‌లో రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ప్రధాన కార్యాలయంలో బుధవారం మల్టీ స్టేక్ హోల్డర్ హ్యాబిటాట్ ఫర్ హ్యూమానిటీ ఇండియా సహకారంతో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పిఎంఎవై) కింద అమలవుతున్న పథకాలను వేగవంతం చేసే అంశంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్‌జైన్ మాట్లాడుతూ.. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న 7.32 లక్షల ఇళ్ల నిర్మాణాలను 2026 మార్చి నాటికి పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. ఇంటి స్థలాలు లేని అర్హులైన లబ్ధిదారులకు గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు భూమి ఉచితంగా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇళ్లపై సోలార్ రూఫ్ టాప్ కోసం పిఎం సూర్యఘర్‌తో కలిసి గృహాలకు శక్తి సామర్థ్య ఉపకరణాలను అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని అజయ్‌జైన్ వివరించారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఎమ్‌డి ఎం శివప్రసాద్, హ్యాబిటాట్ ఫర్ హ్యూమానిటీ ఇండియా జాతీయ డైరెక్టర్ ఆనంద్ బోలిమేరా, డైరెక్టర్ జెబాకుమార్, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చీఫ్ ఇంజినీర్ పద్మనాభయ్య, ఎస్ఇ జయరామాచారి, కృష్ణయ్య పాల్గొన్నారు.



శిల్ప అంత్యక్రియలు నిర్వహిస్తున్న చిన్న కుమార్తె నవ్య

'ప్రజాశక్తి' ఫొటోగ్రాఫర్ రమణకు సతీవియోగం

- పలువురు నివాళి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



శిల్ప (ఫైల్)

'ప్రజాశక్తి' స్టేట్ బ్యూరోలో న్యూస్ ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్న తిప్పసముద్రం వెంకట రమణ భార్య శిల్ప (33) మరణించారు. అనారోగ్య కారణాలతో కొన్ని రోజులుగా మంగళగిరి ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఆమె బుధవారం తుదిశ్వాస విడిచారు. రమణ-శిల్ప దంపతులకు భవ్య, నవ్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శిల్ప మృతదేహాన్ని ఎయిమ్స్ నుంచి ముందుగా తాడేపల్లిలోని ప్రజాశక్తి కార్యాలయానికి, అక్కడి నుంచి విజయవాడలోని ఆమె ఇంటివద్దకు, అనంతరం సిపిఎం రాష్ట్ర కార్యాలయానికి సందర్శనార్థం తరలించారు. శిల్ప భౌతికకాయానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు పి మధు, ప్రజాశక్తి సంపాదకులు బి తులసీదాస్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, వి ఉమామహేశ్వరరావు, బి బలరాం, కె సుబ్బరావమ్మ, రాష్ట్ర కమిటీ సభ్యులు కె ధనలక్ష్మి, ఎం సూర్యారావు, కె ఉమామహేశ్వరరావు, డి కాశీనాథ్, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు, ప్రజాశక్తి సిజిఎం వై అచ్యుతరావు, సంపాదకవర్గ సలహాదారు ఎంవిఎస్ శర్మ, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు ప్రసాద్, పోలారి, వివిధ ప్రజా సంఘాల నాయకులు, ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులు సందర్శించి నివాళులర్పించారు. శిల్పా మృతి పట్ల, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం, యుటిఎఫ్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఐద్వా, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్, ఎపిడబ్ల్యూజెఎఫ్ వేర్వేరు ప్రకటనల్లో సంతాపాలు ప్రకటించాయి.

ముగిసిన అంత్యక్రియలు

శిల్ప అంత్యక్రియలు తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాలోని ఆమె స్వగ్రామం ఆరెకోడులో ముగిశాయి. ఆమె భౌతికకాయాన్ని సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు సందర్శించి నివాళులర్పించారు. శిల్ప చితికి ఆమె చిన్న కుమార్తె నవ్య నిప్పంటించారు. ప్రజాశక్తి న్యూస్ ఎడిటర్ రాజగోపాల్ శర్మ, జనరల్ మేనేజర్ కె హరికిషోర్, నవ తెలంగాణ మఫిషియల్ ఇన్‌ఛార్జి వేణుమాధవ్, స్టేట్ బ్యూరో చీఫ్ బివిఎన్ పద్మరాజు, నవతెలంగాణ ఫొటోగ్రాఫర్ కె నరహరి, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నాయకులు, తదితరులు అంత్యక్రియల్లో పాల్గొని నివాళులర్పించారు.

ప్రాధాన్యత క్రమంలో సమస్యల పరిష్కారం

- మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - బుట్టాయగూడెం (ఏలూరు జిల్లా)

ఏజెన్సీలో సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఏలూరు జిల్లా బుట్టాయగూడెంలో ఆయన బుధవారం పర్యటించారు. తొలుత కెఆర్‌పురం ఐటిడిఎలో కొత్త అంబులెన్స్‌ను పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుతో కలిసి ప్రారంభించారు. అనంతరం పులిరామన్నగూడెంలో గిరిజన వెదురు హస్తకళల ప్రదర్శన తయారీ కేంద్రాన్ని సందర్శించారు. గిరిజనులు తయారు చేసిన వెదురు హస్త కళలను పరిశీలించారు. తయారీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామస్తులతో ముఖాముఖి నిర్వహించారు. గ్రామానికి బస్సు సర్వీసు లేదని గ్రామస్తులు తెలపగా వారం రోజుల్లో బస్సు సర్వీసు ప్రారంభమవుతుందని హామీ ఇచ్చారు. ఏడు కిలోమీటర్ల దూరంలో కన్నాపురం నుంచి తాగునీరు తెచ్చుకుంటున్నామని చెప్పడంతో తక్షణమే ట్యాంకర్ ద్వారా తాగునీరు అందించాలని ఐటిడిఎ పిఒను మంత్రి ఆదేశించారు. మొదటి విడత ఉచిత గ్యాస్ సిలిండర్ సొమ్ము 284 మంది లబ్ధిదారులకుగాను 103 మంది ఖాతాల్లోనే జమైందని గ్రామస్తులు తెలపగా మంత్రి మనోహర్ సంబంధిత అధికారులపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మళ్లీ ఇటువంటి సమస్యలు పునరావృతమైతే చర్యలకు వెనుకాడబోనని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎపి ట్రైకార్ చైర్మన్ బోరగం శ్రీనివాసులు, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఐటిడిఎ పిఒ రాములు నాయక్, డిడిఎంహెచ్ఒ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

డీ అడిక్షన్ కేంద్రాల వివరాలివ్వండి

ప్రజాశక్తి-అమరావతి

మద్యపానం వల్ల జరిగే నష్టాలు, దుష్ప్రభావాల గురించి ప్రజలకు ఏ విధంగా అవగాహన కలిగిస్తున్నారో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ప్రచార కార్యక్రమాలు ఏమిటో, వాటికి ఎంత బడ్జెట్ కేటాయింపు చేశారో వంటి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలంది. మద్యపానాన్ని మాన్పించేందుకు ఉద్దేశించిన డీ అడిక్షన్ కేంద్రాల వివరాలు కూడా ఇవ్వాలంది. మద్యం అమ్మకాలపై వ్యక్తిగతంగా పరిమితి విధించాలని, ఆధార్ లింక్ చేయాలంటూ విశాఖ నుంచి డాక్టర్ షిరిన్ రహ్మాన్ వేసిన పిల్‌పై విచారణ జులై 16కు వాయిదా వేసింది.

రెండు రోజుల్లో జంత వధశాల మూసివేత : హైకోర్టు ఆదేశం

కాకినాడ జిల్లా, పిఠాపురం మున్సిపాల్టీలో జన నివాసాల మధ్య జంతు వధశాలను రెండు రోజుల్లో మూసివేయాలని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్‌కు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. జంతు వధశాలను ఎత్తివేసేలా ఆదేశాలివ్వాలంటూ యానిమల్ రెస్క్యూ ఆర్గనైజేషన్ కార్యదర్శి సూరాబత్తుల గోపాలరావు పిల్ తరపున సీనియర్ న్యాయవాది కె శ్రీనివాసమూర్తి వాదించారు. ఏవిధమైన అనుమతులు లేకపోయినప్పటికీ మున్సిపాల్టీయే జంతు వధశాలను నిర్వహిస్తోందన్నారు.

ఎస్ఎస్‌సి ఫలితాల్లో శ్రీచైతన్య విజయభేరి

ప్రజాశక్తి - విజయవాడ

పదవ తరగతి పరీక్షా ఫలితాలలో అత్యధికంగా 599 మార్కులు సాధించి విజయకేతనం ఎగురవేశామని శ్రీచైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ తెలిపారు. 598 ఆ పైన మార్కులను సాధించిన వారిలో నలుగురున్నారన్నారు.

597 ఆ పైన మార్కులను సాధించిన వారిలో 28 మంది, 596 ఆ పైన మార్కులు మార్కులు సాధించిన విద్యార్థులు 81 మంది, 595 ఆ పైన మార్కులను సాధించిన విద్యార్థులు 156 మంది, 590 ఆ పైన మార్కులను సాధించిన విద్యార్థులు 1091 మంది ఉన్నారని వెల్లడించారు. 580 ఆ పైన మార్కులను సాధించిన వారిలో 3836 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. అధిక బ్రాంచ్‌లు నూటికి నూరు శాతం ఫలితాలు సాధించాయన్నారు. ఇంతటి అనితర సాధ్యమైన విజయానికి కారణమైన విద్యార్థులకు, తల్లిదండ్రులకు, అధ్యాపక బృందానికి శ్రీ చైతన్య విద్యాసంస్థల మరో డైరెక్టర్ నాగేంద్ర అభినందనలు తెలిపారు.

ఒకేసారి పాసైన తండ్రీ కుమార్తె

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో చిత్తూరు జిల్లా రొంపిచర్ల మండలానికి చెందిన తండ్రి కుమార్తె ఒకేసారి ఉత్తీర్ణత సాధించారు. 1995-96 సంవత్సరంలో బి.షబ్బీర్ పది పరీక్షలు రాసి ఫెయిల్ అయ్యారు. తర్వాత కుటుంబ పరిస్థితుల దృష్ట్యా చదువు మానేసి రోజువారి పనులకు వెళ్లేవారు. బతుకు జీవనంలో ఇబ్బందులు గమనించిన షబ్బీర్... పదవ తరగతి పాస్ కావాలని నిశ్చయించుకుని కుమార్తెతో పాటు పరీక్ష రాశారు. బి.షబ్బీర్‌కు 319 మార్కులు రాగా కుమార్తె బి.సమీనాకు 309 మార్కులు సాధించారు.

పోలీస్ కస్టడీలో గోరంట్ల మాధవ్

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

టిడిపి కార్యకర్త చేబ్రోలు కిరణ్‌పై దాడి చేసిన, పోలీసులు విధులకు ఆటంకం కలిగించిన కేసుల్లో అరెస్టయిన మాజీ ఎంపి గోరంట్ల మాధవ్‌ను గుంటూరు పోలీసులు తమ కస్టడీలోకి తీసుకుని విచారించారు. కోర్టు ఆదేశాల మేరకు గోరంట్ల మాధవ్‌ను రాజమండ్రి జైలు నుంచి పోలీసులు బుధవారం గుంటూరుకు తీసుకువచ్చారు. తొలుత గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం నల్లపాడు పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఇటీవల పోలీసుల అదుపులో ఉన్న చేబ్రోలు కిరణ్‌పై జరిగిన దాడి ఘటన నేపథ్యంలో పోలీసు అధికారులు ఆయనను విచారించారు.

పోలీసు వాహనంలో కిరణ్ వస్తున్న విషయం ఎవరైనా మాధవ్‌కు సమాచారం ఇచ్చారా? కిరణ్‌పై దాడి యత్నం వెనుక ఎవరి ప్రమేయమైనా ఉందా? అన్న కోణంలో గోరంట్ల మాధవ్‌ను పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది. గురువారం కూడా విచారణ కొనసాగనుంది.

'వక్ఫ్' చట్ట సవరణకు వ్యతిరేకంగా మహిళల ర్యాలీ

ప్రజాశక్తి - కడప అర్బన్

వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా కడప నగర పురవీధులు దద్దరిల్లాయి. వక్ఫ్ చట్టంలో చేసిన సవరణలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ మహిళలు పెద్ద ఎత్తున బుధవారం ర్యాలీ నిర్వహించారు. వక్ఫ్ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ర్యాలీ నగరంలోని అల్మాస్‌పేట సర్కిల్ నుంచి ప్రారంభమై మట్టి పెద్దపులి వీధి, వన్‌టౌన్ సర్కిల్, గోకుల్ సర్కిల్ మీదుగా ఏడు రోడ్ల సర్కిల్ వరకు సాగింది. కేంద్ర ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూ వక్ఫ్ నల్ల చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని నినాదాలు చేశారు. ఎండను సైతం లెక్కచేయకుండా పెద్ద ఎత్తున మహిళలు ర్యాలీలో పాల్గొన్నారు.

అనంతరం నిర్వహించిన సభలో వక్ఫ్ పరిరక్షణ కమిటీ జిల్లా కన్వీనర్ రిజ్వానా, సిపిఐ జిల్లా కమిటీ సభ్యులు భాగ్యమ్మ, వైసిపి మహిళా భాగం నాయకులు మరియం, ఎస్‌డిపిఐ నాయకులు సోఫియా ఖానం, సాజియా, పీస్ స్కూల్ జుబైదా ప్రసంగించారు. రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక నల్ల చట్టాలను తీసుకొచ్చి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. బాబ్రీ మసీదు విధ్వంసం నుంచి ట్రిపుల్ తలాక్, హిజాబ్, ఇప్పుడు వక్ఫ్ సవరణ బిల్లును తీసుకొచ్చి ముస్లిములను అనేక రకాలుగా ఇబ్బందులు



ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

పెడుతున్నారని తెలిపారు. వక్ఫ్ భూములను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకే మోడీ ప్రభుత్వం కుట్రపూరితంగా వక్ఫ్ చట్ట సవరణ చేసిందని తెలిపారు. టిడిపి కూటమి ప్రభుత్వం ముస్లిముల ద్రోహి అని విమర్శించారు. వక్ఫ్ చట్ట సవరణకు అనుకూలంగా పార్లమెంటులో టిడిపి ఓటు వేయడం దారుణమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంలో బిజెపితో తెగతెంపులు చేసుకుని బయటపడినప్పుడే భవిష్యత్తు ఉంటుందని హెచ్చరించారు.

ప్రభుత్వాఫీసుల్లో మౌలిక సదుపాయాలపై హైకోర్టు విస్మయం

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్ర సమాచార కమిషన్ ఆఫీసుకు వచ్చేవారి కోసం ఒక్క మరుగుదొడ్డి కూడా లేకపోవడంపై హైకోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఆఫీసుకు వచ్చే మహిళలు, పిల్లలు, పెద్దల పరిస్థితి ఏమిటని ప్రశ్నించింది. ప్రభుత్వాఫీసుల్లో కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంపై విస్మయం వ్యక్తం చేసింది.

తక్షణమే మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చర్యలు తీసుకోవాలంది. లేనిపక్షంలో ఆ ఆఫీసును వేరే చోటుకు మార్చాలంది. చర్యలు తీసుకోని పక్షంలో సిఎస్ వ్యక్తిగత హాజరీకి ఉత్తర్వులు ఇస్తామని చెప్పింది. విచారణను ఈ నెల 30కు వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర సమాచార కమిషన్ కార్యాలయంలో కనీస మౌలిక సౌకర్యాలు లేవని, మరుగుదొడ్డి సౌకర్యం కూడా లేదంటూ రంగారెడ్డి జిల్లాకు చెందిన బి కాంత్రికుమార్ పిల్ దాఖలు చేశారు. న్యాయవాది ఉప్పులూరి అభినవ్ కృష్ణ వాదిస్తూ, మరుగుదొడ్డి లేకపోవడంపై భవనం యజమానితో వివాదం కొనసాగుతోందన్నారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది సింగమనేని ప్రణతి ప్రతివాదన చేస్తూ, మరుగుదొడ్డి విషయమై భవన యజమానితో వివాదం ఉందన్నారు. గడువు ఇస్తే వివరాలు అందజేస్తామని చెప్పడంతో హైకోర్టు పైవిధంగా ఆగ్రహం వ్యక్తం చేసింది.

నలుగురు టెన్త్ విద్యార్థుల ఆత్మహత్య

ప్రజాశక్తి - యంత్రాంగం

పది పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయని, ఉత్తీర్ణత సాధించలేకపోయామన్న మనస్తాపంతో నలుగురు విద్యార్థులు మృతి చెందారు. దీంతో, వారి కుటుంబసభ్యులు తీవ్రవేదనకు గురవుతున్నారు. మార్కులు ఒక్కటే ప్రామాణికం కాదని, బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని పలువురు ఉపాధ్యాయులు, అధికారులు కోరుతున్నారు. బుధవారం పదో తరగతి పరీక్ష ఫలితాలు వెలువడిన విషయం తెలిసిందే. విద్యార్థుల తల్లిదండ్రులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు...



విష్ణువర్ధన్ (ఫైల్)

శ్రీకాకుళంలోని బలగకు చెందిన గురుగుబెల్లి వేణుగోపాలరావు (రోహిత్)కు పది ఫలితాల్లో 393 మార్కులు రావడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబసభ్యులు గమనించి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మండలం మర్రిపాడు కాలనీకి చెందిన చల్లా మోహన్ కుమారుడు చల్లా విష్ణు వర్ధన్ (19) గత మూడు సంవత్సరాలుగా పదవ తరగతి పరీక్షలు రాస్తున్నారు. ఈ ఏడాది కూడా ఉత్తీర్ణత సాధించకపోవడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. కృష్ణా జిల్లా బంటుమిల్లి మండలం అర్జావానిగూడెం గ్రామానికి చెందిన గోవాడ రామకృష్ణ కుమారుడు అనిల్‌కుమార్ (బిట్టు)(16) పెదతుమ్మిడి హైస్కూలులో గత ఏడాది పదో తరగతి పరీక్షలు రాసినా ఉత్తీర్ణత సాధించలేదు. ఈ ఏడాది విడుదలైన ఫలితాల్లో కూడా ఉత్తీర్ణత సాధించలేకపోవడంతో ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. పరీక్ష తప్పుతానేమనన్న భయంతో విజయనగరం జిల్లా రామభద్రపురం మండల పరిధిలోని కొట్టక్కి గ్రామానికి చెందిన కర్రి దుర్గాప్రసాద్ (15) మంగళవారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే సాలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బుధవారం వెలువడిన ఫలితాల్లో సైన్సు సబ్జెక్టు తప్పారు. జీవనోపాధి కోసం బాలుడి తల్లిదండ్రులు చెన్నై వెళ్లిపోగా అమ్మమ్మ ఇంటివద్ద ఉంటూ దుర్గాప్రసాద్ చదువుకుంటున్నారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

బాలసంజీవని యాప్‌లో మార్పులు

- అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అంగన్‌వాడీలకు ఇబ్బందికరమైన బాలసంజీవని యాప్‌లో మార్పులు చేయాలని ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశం విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో బుధవారం జరిగింది. సంజీవని యాప్‌లను 7 నెలల నుంచి మూడేళ్లలోపు పిల్లలకు ఫొటో క్యాప్చర్ తీసేయాలని యూనియన్ ప్రధాన కార్యదర్శి కె సుబ్బరావమ్మ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ప్రీస్కూల్ పిల్లలకు ఫొటో ఆధారంగా రేషన్ ఇవ్వాలనే నిబంధనలు తొలగించాలని, వర్కర్, హెల్పర్, మినీవర్కర్లకు ఫేస్‌యాప్ ఇన్, ఔట్ లొకేషన్ తీసివేయాలని, లబ్ధిదారులకు అందిస్తున్న సరుకులన్నీ ఒకేసారి వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సమావేశం కోరింది. సెంటర్ నిర్వహణకు ట్యాబ్ ఇవ్వాలని, మే నుంచి అంగన్‌వాడీ సెంటర్లకు వేసవి సెలవులు ప్రకటించాలనే ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సమస్యలపై అన్ని స్థాయిల్లో ఐసిడిఎస్ ఉన్నతాధికారులకు, పిడి, సిడిపిఒలకు వినతిపత్రాలు ఇవ్వాలని నిర్ణయించింది. లబ్ధిదారులకు ఓటిపిని రద్దు చేసి వారితోనే వినతిపత్రాలు ఇప్పించాలని తీర్మానించింది. అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, మినీల జిఓ వెంటనే ఇవ్వాలని పేర్కొంది. సమస్యల పరిష్కారం కోసం మే 20న రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేయాలని నిర్ణయించింది.

బానిసలుగా చేసే ప్రయత్నం : సిహెచ్ నర్సింగరావు

కేంద్ర ప్రభుత్వం.. కార్మికులను యాజమానులకు కట్టుబానిసలుగా చేసేందుకు ప్రయత్నిస్తోందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు విమర్శించారు. రక్తం చిందించి కార్మికులు 8 గంటల పని హక్కును సాధించుకున్నారని తెలిపారు.

దీనిని 12-15 గంటలుగా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక కోడ్స్, ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా మే 20న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రంలోనూ అన్ని కార్మిక సంఘాలు కలిసి చేసే సమ్మెలో అంగన్‌వాడీలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర నాయకులు సిహెచ్ సుప్రజ, లక్ష్మీదేవి, కృష్ణవేణి, చంద్రావతి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కదిరి ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం

- 25 ఓట్లతో అవిశ్వాసానికి మద్దతు

ప్రజాశక్తి-కదిరి టౌన్ (శ్రీసత్యసాయి జిల్లా)

శ్రీ సత్యసాయి జిల్లా కదిరి ఛైర్‌పర్సన్‌పై సొంత పార్టీలోని అసమ్మతి వైసిపి కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం అమోదం పొందింది. మైజార్టీ కౌన్సిలర్లు అవిశ్వాసానికి అనుకూలంగా ఓటేశారు. దీంతో ఛైర్‌పర్సన్ నజీమున్నీసా పదవి నుంచి దిగిపోవడం లాంఛనమే అయ్యింది. అవిశ్వాస తీర్మానం నేపథ్యంలో కదిరి మున్సిపల్ కార్యాలయంలో ఆర్‌డిఒ వివిఎస్.శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. మున్సిపాల్టీలో మొత్తం 36 వార్డులు ఉండగా.. వీటిలో 30 వార్డుల్లో వైసిపి గెలుపొందింది. ఐదు వార్డులు టిడిపికి దక్కాయి. ఒక్క వార్డులో ఇండిపెండెంట్ గెలుపొందారు. అవిశ్వాస తీర్మాణం ఓటింగ్‌లో 19 మంది వైసిపి కౌన్సిలర్లు, ఐదుగురు టిడిపి కౌన్సిలర్లు, కదిరి ఎమ్మెల్యే, ఎక్స్‌అఫిషియో సభ్యుడు కందికుంట వెంకటప్రసాద్ అవిశ్వాసానికి మద్దతుగా ఓటేశారు. ఎక్స్‌అఫిషియో సభ్యునితో కలిసి 25 మంది కౌన్సిలర్లు ఓటింగులో పాల్గొన్నారు. ఛైర్‌పర్సన్‌తో సహా 11 మంది కౌన్సిలర్లు సమావేశానికి గైర్హాజరయ్యారు. అవిశ్వాస తీర్మానం అంకం పూర్తికావడంతో నూతన చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక జరగనుంది. ఉన్నతాధికారుల ఆదేశాల అనంతరం ఈ ఎన్నికను నిర్వహించనున్నారు. అవిశ్వాస తీర్మానం ఓటింగ్ జరగకుండా వైసిపి అధిష్టానం ఆ పార్టీ కౌన్సిలర్లకు విప్ జారీ చేసినా ఫలితం లేకుండాపోయింది. విప్‌ను లెక్కజేయకుండా సొంత పార్టీ కౌన్సిలర్లే అవిశ్వాసానికి మద్దతుగా ఓటేశారు.

'ఉక్కు' కార్మికుల కుదింపు తగదు : ఐఎన్‌టియుసి

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)



విఆర్‌ఎస్ పేరుతో ఉక్కు కార్మికుల కుదింపు తగదని ఐఎన్‌టియుసి నాయకులు నీరుకొండ రామచంద్రరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 1532వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్‌లోని పలు విభాగాల కార్మికులు, ఐఎన్‌టియుసి కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ విఆర్‌ఎస్ వల్ల అనుభవం కలిగిన ఎంతోమంది ఉద్యోగులను స్టీల్‌ప్లాంట్ కోల్పోయిందని, ఆ పని భారం యువ కార్మికులపై పడుతోందని తెలిపారు. కాంట్రాక్టు కార్మికులను కూడా తగ్గించేస్తున్నారని అన్నారు. ఈ చర్యలను మానుకోకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలని డిమాండ్ చేశారు.

రాయనపాడు రైల్వేస్టేషన్ ఆధునీకరణ

- రూ.12.13 కోట్లతో అభివృద్ధి
- 58 శాతం పనులు పూర్తి

ప్రజాశక్తి- ఇబ్రహీంపట్నం



రాయనపాడు రైల్వేస్టేషన్ ముఖ ద్వారం

ఎన్‌టిఆర్ జిల్లా ఇబ్రహింపట్నం మండలంలోని రాయనపాడు రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. దక్షిణ మధ్య రైల్వే విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని ఈ రైల్వేస్టేషన్ 1899లో ప్రారంభమైంది. దీనిని 1980-81 మధ్య కాలంలో పూర్తి స్థాయిలో విద్యుద్దీకరించారు. అప్పటి నుండి ప్రయాణికులకు విస్తృత సేవలందిస్తోంది. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 53 రైల్వేస్టేషన్లను రూ.20,061 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేస్తున్నారు. దీనిలో భాగంగా రాయనపాడు రైల్వే స్టేషన్లో రూ.12.13 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

విజయవాడ రైల్వేస్టేషన్‌కు శాటిలైట్ స్టేషన్లుగా రాయనపాడు, మధురా నగర్, గుణదల, రామవరప్పాడు, కృష్ణా కెనాల్ రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేసేందుకు గతంలో నిర్ణయం తీసుకున్నారు. విజయవాడ బైపాస్ స్టేషన్‌గా రాయనపాడు స్టేషన్‌కు పేరుంది. దీంతో, విజయవాడకు తొమ్మిది కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ స్టేషన్లో మొత్తం 22 రైళ్లు ఆగేలా చర్యలు చేపట్టనున్నారు. స్టేషన్ ఆధునీకరణలు భాగంగా మూడు ప్లాట్ ఫారాలతో ఎన్ఎస్‌జి 5 కేటగిరి రైల్వేస్టేషన్‌గా అభివృద్ధి చేస్తున్నారు. ముఖ్యంగా ట్రాఫిక్ రద్దీ (రైళ్ల రాకపోకలు)ని మెరుగుపర్చడం, స్టేషన్‌ను సుందరీకరించడం, ప్రదేశ ద్వారం వద్ద వరండా ఏర్పాటు, వికలాంగులకు అనుకూలమైన టాయిలెట్ల ఏర్పాటు, స్టేషన్ భవనంలో మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించడం, ఎసి వెయిటింగ్ హాలు, పార్కింగ్ స్థలం ఏర్పాటు, ప్లాట్ ఫారాలను మెరుగుపర్చడం, షెల్టర్ ఏర్పాటు వంటి అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే సంప్రదాయ కొండపల్లి బొమ్మలతో కూడిన ఛాయాచిత్రాలతో స్టేషన్‌కు అద్భుతంగా తీర్చిదిద్దారు. కవర్ ఓవర్ (సిఒపి) నిర్మాణంతో సహా ఒక ప్లాట్ ఫారాన్ని పూర్తి స్థాయిలో ఇప్పటికే అభివృద్ధి చేశారు. షెల్టర్లు, ప్లాట్ ఫామ్ ఉపరితలం, వెయిటింగ్ హాలు, మాడ్యులర్ టాయిలెట్ ముఖ భాగం, సర్క్యులేటింగ్ ఏరియా, లిఫ్ట్ ఏర్పాటు తదితర పనులు 58 శాతం పూర్తయ్యాయి. ఈ ఏడాది చివరి నాటికి మొత్తం ప్రాజెక్టును పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

మే 2న ప్రారంభోత్సవం?

2017-18, 2022-23 లలో భారతీయ రైల్వేస్టేషన్ల పునర్విభజన ఆధారంగా ఆదాయం, బాహ్య ప్రయాణికుల నిర్వహణపరంగా రాయనపాడును నాన్ సబర్బన్ గ్రేడ్ (ఎన్ఎస్‌జీ)-6 రైల్వేస్టేషన్‌గా గుర్తించారు. సుమారు కోటి రూపాయలు ఆదాయం గడిస్తూ ఒక మిలియన్ ప్రయాణికులకు సేవలందిస్తోంది. మే 2న రాజధాని అమరావతి పునఃర్నిర్మాణ పనులను ప్రారంభించేందుకు వస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ రాయనపాడు రైల్వేస్టేషన్‌ను కూడా ప్రారంభించే అవకాశం ఉందని సమాచారం.

స్టేషన్ మాస్టర్, లోకో పైలెట్లు, గార్డులకు క్యాబిన్లు లేవు

అభివృద్ధి పనులు ఇంకా పూర్తి స్థాయిలో జరగలేదు. స్టేషన్ మాస్టర్ క్యాబిన్, లోకో పైలెట్, గార్డులకు గదులు కేటాయించలేదు. దీంతో, విధుల నిర్వహణలో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో వారి విధుల నిర్వహణకు ఇబ్బందులు తలెత్తకుండా ఉన్నతాధికారులు తగిన ఏర్పాట్లు చేయాల్సి ఉంది. పనులు పూర్తయ్యే క్రమంలో స్టేషన్ మాస్టర్ క్యాబిన్, లోకో పైలట్, ఇతర సిబ్బందికి ప్రత్యేక క్యాబిన్లు నూతనంగా నిర్మిస్తారా? లేక పాత క్యాబిన్లలో ఏర్పాట్లు చేస్తారా? అనేది రైల్వే అధికారులు స్పష్టం చేయడం లేదు. నిత్యం ప్రజలకు సేవలందించే తమకు సరైన వసతులు, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కల్పించాలని ఉద్యోగులు, సిబ్బంది కోరుతున్నారు.

2027కు పోలవరం పూర్తి

- మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)



మాట్లాడుతున్న మంత్రి రామానాయుడు

పోలవరం ప్రాజెక్టును 2027 డిసెంబర్‌కు పూర్తి చేస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. బుధవారం ఆయన విశాఖలోని టిడిపి జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు బహుళ ప్రయోజనాలు, నదుల అనుసంధానం నెరవేరాలంటే 45.72 మీటర్ల దగ్గర ప్రాజెక్టు నిర్మాణం జరగాల్సి ఉందన్నారు. అయితే, నిర్వాసితుల పరిహారం పూర్తిగా చెల్లించే వరకూ 41.72 మీటర్ల వరకే పనులు పూర్తి చేస్తామని చెప్పారు. వైసిపి ప్రభుత్వం పోలవరాన్ని గాలికి వదిలేసినందున డయాఫ్రమ్ వాల్ దెబ్బతిందన్నారు. ఇప్పుడు రూ.900 కోట్లతో దానిని తిరిగి నిర్మించాల్సి వస్తోందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పోలవరం నిర్వాసితులకు ఒక్క రూపాయి కూడా అందలేదన్నారు. ఉత్తరాంధ్ర ప్రయోజనాల కోసం పోలవరం ఎడమ కాలువ నిర్మిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వంలో నీటిపారుదలకు రూ.30 వేల కోట్లు కేటాయించి రూ.20 వేల కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లో రూ.35 వేల కోట్లు కేయించామని తెలిపారు. విశాఖలోని రుషికొండ భవనాల వినియోగంపై ఆలోచన చేస్తున్నామని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ ఛైర్మన్ గండి బాబ్జి, ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవిరావు, రాష్ట్ర ఎన్‌టిఆర్ వైద్య సేవ ఛైర్మన్ సీతంరాజు సుధాకర్, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

7 వరకు పిఎస్‌ఆర్‌కు రిమాండ్

- విజయవాడ జైలుకు తరలింపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ముంబయి సినీ నటి జెత్వానీ కేసులో ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్, సీనియర్ ఐపిఎస్ అధికారి పిఎస్‌ఆర్ ఆంజనేయులుకు విజయవాడ ఎడిజె కోర్టు మే 7 వరకు రిమాండ్ విధించింది. అనంతరం ఆయనను విజయవాడ జిల్లా జైలుకు బుధవారం తరలించారు. ఈ కేసులో పిఎస్‌ఆర్ ఆంజనేయులు స్వయంగా కోర్టులో వాదనలు వినిపించారు. జెత్వానీ కేసుతో తనకెలాంటి సంబంధం లేదని, తన పాత్ర లేకపోయినా తనపై కేసు పెట్టారని కోర్టుకు తెలిపారు. మాజీ డిఐజి విశాల్ గున్నీని అప్రూవర్‌గా మార్చి సంబంధం లేని విషయాలను చెప్పించారని ఆయన ఆరోపించారు. ఈ కేసుకు సంబంధించి రిమాండ్ రిపోర్టులో జెత్వానీపై కేసు నమోదు చేయాలని ఐపిఎస్‌లు కాంతిరాణా టాటా, విశాల్ గున్నీలకు పిఎస్‌ఆర్ చెప్పినట్లు పేర్కొంది. మహిళపై అక్రమ కేసు నమోదుకు అధికారులను ప్రభావితం చేశారని పోలీసులు వెల్లడించారు. పిఎస్‌ఆర్ ఆదేశాలతో పోలీసులు ఫోర్జరీ డాక్యుమెంట్లతో నకిలీ ఆధారాలు సృష్టించినట్లు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. పిఎస్‌ఆర్ అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు రిపోర్టులో వెల్లడించారు.



వీరయ్యచౌదరి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు

సమర్థ నాయకత్వాన్ని ఎదుర్కోలేకే హత్యలు

- వీరయ్య చౌదరి హత్యను జీర్ణించుకోలేకపోతున్నా : ముఖ్యమంత్రి చంద్రబాబు
- మాజీ ఎంపిపి, టిడిపి నాయకుడి భౌతిక కాయానికి నివాళి

ప్రజాశక్తి- నాగులుప్పలపాడు (ప్రకాశం జిల్లా)

మాజీ ఎంపిపి, టిడిపి బాపట్ల పార్లమెంట్ అధికార ప్రతినిధి ముప్పవరపు వీరయ్య చౌదరి హత్యను జీర్ణించుకోలేకపోతున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. వీరయ్య చౌదరి సమర్థవంతమైన నాయకుడని, పార్టీ కోసం ఎంతో శ్రమిస్తూ నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండేవారని గుర్తుచేసుకున్నారు. సమర్థ నాయకత్వాన్ని ఎదుర్కోలేక హత్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. వీరయ్య చౌదరిని దారుణంగా హత్య చేశారని, నిందితులను పట్టుకునేందుకు పోలీసులు 12 బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు. ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం, అమ్మనబ్రోలులో వీరయ్య చౌదరి మృతదేహానికి చంద్రబాబు బుధవారం నివాళు లర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు. వీరయ్య చౌదరి భార్య సుచరిత, కుమారుడు చంద్ర సిద్ధార్థలను ఓదార్చి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని వారికి ధైర్యం చెప్పారు. హత్యపై రాజకీయ, వ్యాపార కోణాల్లోనూ విచారణ చేస్తున్నారని, సీసీ ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నారని తెలిపారు. హత్యా రాజకీయాలు, హత్యలు చేసే వారు కాలగర్భంలో కలిసిపోతారన్నారు.

టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారమివ్వండి

రాష్ట్రం నేరస్తులకు అడ్డా కాకూడదని చంద్రబాబు అన్నారు. ప్రజలు, కార్యకర్తలు, మీడియా సహా ఎవరైనా ఈ ఘటనపై ఎటువంటి సమాచారం తెలిసినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. బయటకు వచ్చి చెప్పేందుకు వెనకాడేవారు 9121104784 నెంబర్‌కు సమాచారం ఇవ్వొచ్చని తెలిపారు. వీరయ్య చౌదరికి నివాళులర్పించిన వారిలో మంత్రులు, ఎమ్మెల్యేలు, టిడిపి నేతలు ఉన్నారు.ఆయనను గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం హత్య చేసిన సంగతి తెలిసిందే.

రూ.3 వేలు తగ్గిన బంగారం

న్యూఢిల్లీ : రాకెట్‌లా దూసుకెళ్తోన్న బంగారం ధరలు ఎట్టకేలకు స్వల్ప ఉపశమనం కలిగించాయి. బుధవారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.3,000 తగ్గి రూ.98,500గా పలికింది. 22 క్యారెట్ల పసిడిపై రూ.2,750 దిగివచ్చి రూ.90,300గా నమోదయ్యింది. కిలో వెండి ధర యథాతథంగా రూ.1,01,000గా పలికింది. చైనాపై సుంకాలను తగ్గిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన సానుకూల ప్రకటన పసిడి ధర తగ్గుదలకు దోహదం చేసింది. వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడం, అంతర్జాతీయ మార్కెట్లు పసిడి ధర తగ్గుదలకు దోహదం చేస్తున్నాయని కేడియా అడ్వైజరీ డైరెక్టర్ అజయ్ కేడియా పేర్కొన్నారు. రానున్న రోజుల్లో బంగారం మరింత దిగి రావొచ్చన్నారు.

3 రోజులు సంతాప దినాలు

- జనసేన అధినేత పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పహల్గాం ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాప సూచకంగా రాష్ట్రంలో మూడు రోజులు సంతాప దినాలను పాటిస్తున్నట్లు జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ప్రకటించారు. పహల్గాం ఉగ్రదాడి తనను తీవ్రంగా కలిచి వేసిందన్నారు. ఉగ్రవాద దుశ్చర్యలతో ప్రాణాలు కోల్పోయిన రెండు కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం భరోసాగా నిలుస్తుందన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ మూడు రోజులు రాష్ట్ర వ్యాప్తంగా కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టాలని, మృతుల కుటుంబాలకు సంఘీభావంగా మానవహారం నిర్వహించాలని కోరారు.

రూ.లక్ష కోట్ల పనులు ప్రారంభం

- ప్రధాని పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి
- కిలోమీటరు దూరం మోడీ రోడ్‌షో

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతిలో రూ.లక్ష కోట్ల విలువైన పనులకు ప్రధాని మోడీ శంకుస్థాపన చేస్తారని, దీనికి అవసరమైన ఏర్పాట్లను శరవేగంగా పూర్తి చేస్తున్నామని మంత్రి నారాయణ తెలిపారు. బుధవారం ఉదయం గుంటూరు రేంజ్ ఐజి సర్వశ్రేష్టి త్రిపాఠి, ఎస్‌పి సతీష్‌కుమార్‌తో కలిసి రాజధాని పరిధిలో మంత్రి పర్యటించారు. వెలగపూడిలోని సభావేదిక వద్దకు వెళ్లేందుకు మొత్తం ఎనిమిది రోడ్లను గుర్తించారు. 11 పార్కింగు స్థలాలను ఏర్పాటు చేశారు. పర్యటన విజయవంతం చేసేందుకు అన్ని శాఖలూ సమన్వయంతో పనిచేస్తున్నాయని మంత్రి తెలిపారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో రూ.ఐదువేల కోట్ల వరకూ ఖర్చు చేశామని, పలు రోడ్లను కూడా నిర్మించామని తెలిపారు. వైసిపి ప్రభుత్వం రాజధాని విషయంలో మూడుముక్కలాట ఆడి అడవిలా మార్చిందన్నారు. మళ్లీ టిడిపి ప్రభుత్వం రాగానే పనులు ప్రారంభించామని చెప్పారు. రూ.64 వేల కోట్ల విలువైన పనులకు అథారిటీలో అనుమతి తీసుకున్నామని, రూ.41 వేలకోట్ల విలువైన పనులకు టెండర్లు పిలిచామని, వాటిని ప్రధాని చేతుల మీదుగా ప్రారంభిస్తామని తెలిపారు. ఐదు లక్షల మంది సభకు వస్తారని అంచనా వేసినట్లు పేర్కొన్నారు. మూడు గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకునే ప్రధాని అక్కడ నుండి వెలగపూడి చేరుకుని కిలోమీటరు దూరం రోడ్‌షో నిర్వహిస్తారని తెలిపారు. ఈ 11, 13, 15 రోడ్లతోపాటు సీడ్ యాక్సెస్ రోడ్డు నుండి కూడా రాకపోకలు జరుగుతాయని వివరించారు. ఇప్పటికే పోలీస్‌శాఖ రోడ్లను పరిశీలించి గుంతలు పూడ్చాలని కోరిందని తెలిపారు. ప్రధాని సభకు వచ్చే వాహనాల కోసం సరిపోయినంతగా పార్కింగు ఏర్పాటు చేశామని వివరించారు. మంగళగిరి నుండి రెండు, తాడేపల్లి నుండి ఒకటి, వెస్ట్‌బైపాస్ నుండి ఒకటి, ప్రకాశం బ్యారేజీ నుండి రెండు, తాడికొండ, హరిశ్చంద్రపురం నుండి ఒకరోడ్డు ద్వారా సభా వేదిక వద్దకు చేరుకోవచ్చని పేర్కొన్నారు. వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందీ ఉండదని, ట్రాఫిక్ జామ్‌కు అవకాశం లేకుండా అన్ని చర్యలూ తీసుకున్నామని పేర్కొన్నారు. పోలీస్‌శాఖ సూచనల మేరకు రోడ్లను బాగుచేయాలని సిఆర్‌డిఎ అధికారులను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు.

మున్సిపాల్టీల వారీ ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై అఫిడవిట్ దాఖలు చేయండి

- రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్‌జిటి ఆదేశం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ మున్సిపాల్టీల వారీ ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై అఫిడవిట్ దాఖలు చేయాలని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జిటి) ఆదేశించింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఎన్‌జిటి ఆదేశించింది. ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో అన్ని రాష్ట్రాల్లో పరిస్థితిని ఎన్‌జిటి పరిశీలిస్తోంది. అందులో భాగంగానే ఆంధ్రప్రదేశ్‌లో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై ట్రిబ్యునల్ ఛైర్మన్ జస్టిస్ ప్రకాష్ శ్రీవాస్తవ, జ్యుడీషియల్ మెంబర్ జస్టిస్ సుధీర్ అగర్వాల్, ఎక్స్‌పర్ట్ మెంబర్ ఎ సెంథిల్ వేల్‌తో కూడిన ట్రిబ్యునల్ విచారించింది. రాష్ట్ర స్థాయిలో ఘన వ్యర్థాల ఉత్పత్తి, ప్రాసెసింగ్ ప్రస్తుత స్థాయి, 123 అర్బన్ లోకల్ బాడీలను దాని నిర్మూలనకు సంబంధించి ఎటువంటి బహిర్గత సమాచారం లేదని పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణకు తీసుకున్న చర్యలతో కూడిన నివేదికను దాఖలు చేయాలని ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను అక్టోబర్ 6కు వాయిదా వేసింది. విచారణ తేదీకి కనీసం వారం రోజుల ముందు తాజా చర్యలతో కూడిన నివేదిక సమర్పించాలని ఆదేశించింది.

అఘోరి అరెస్టు

- చంచల్‌గూడ జైలుకు తరలింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చీటింగ్ కేసులో మోకిలా పోలీసులు అఘోరీని అరెస్ట్ చేశారు. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన ఓ మహిళ.. ప్రగతి రిసార్ట్స్‌లో పనిచేస్తూ అఘోరీకి పరిచయమైంది. పూజల పేరుతో ఆమె వద్ద రూ.9.50 లక్షలు తీసుకొని మోసం చేశారనే ఫిర్యాదు నేపథ్యంలో అఘోరిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ సరిహద్దుల్లో అఘోరీని అదుపులోకి తీసుకుని మంగళవారం సాయంత్రం నగరానికి తీసుకొచ్చినట్లు తెలిసింది. అఘోరీతో పాటు ఇటీవల తాను వివాహం చేసుకున్న వర్షిణిని సైతం నగరానికి తరలించినట్లు సమాచారం. ఇది ఇలా ఉండగా ఆంధ్రాకు చెందిన వర్షిణి ఇటీవల అఘోరీని పెండ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. వర్షిణి కుటుంబానికి ఇష్టం లేకున్నా బలవంతంగా కేదార్‌నాథ్ తీసుకువెళ్లి పెండ్లి చేసుకున్నాడన్న ఆరోపణలున్నాయి. తమను ఎవరైనా అరెస్టు చేయాలని చూస్తే.. ఆత్మహత్య చేసుకుంటామని ఈ జంట మొన్న ప్రకటించి ఓ సెల్ఫీ వీడియో సైతం విడుదల చేశారు. అరెస్ట్ చేసిన అఘోరిని బుధవారం నార్సింగి పోలీస్ స్టేషన్‌కు తరలించి రెండు గంటల పాటు విచారించారు. అనంతరం పోలీసు బందోబస్తు నడుమ చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి చేవెళ్ల కోర్టులో హాజరుపరిచారు. తన ఆర్థిక పరిస్థితి బాగాలేదని అఘోరీ విన్నవించడంతో లీగల్ ఎయిడ్ సర్వీసెస్ తరపున న్యాయవాది కుమార్‌ను జడ్జి నియమించారు. వాదనలు విన్న జడ్జి 14 రోజులు రిమాండ్ విధించారు. అనంతరం చంచల్ గూడ జైలుకు తరలించారు.

రూ.12,800 కోట్లతో రెండు అణు రియాక్టర్ల నిర్మాణం

- ఎన్‌పిసిఐఎల్ నుంచి ఎంఇఐఎల్‌కు ఆర్డర్

హైదరాబాద్ : కర్ణాటక రాష్ట్రంలోని కైగా వద్ద 700 మెగావాట్స్ ఎలక్ట్రిక్ సామర్థ్యం కలిగిన రెండు అణు రియాక్టర్ యూనిట్ల నిర్మాణానికి సంబంధించి పర్చేజ్ ఆర్డర్‌ను మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఇఐఎల్) దక్కించుకుంది. ముంబయిలో బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐఎల్) సీనియర్ అధికారుల నుండి పర్చేజ్ ఆర్డర్‌ను ఎంఇఐఎల్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) సిహెచ్ సుబ్బయ్య అందుకున్నారు. కైగా యూనిట్లు 5, 6 అణు రియాక్టర్లను ఎన్‌పిసిఐఎల్ కోసం ఎంఇఐఎల్ నిర్మించి ఇవ్వనుందని సుబ్బయ్య తెలిపారు. ఇంజనీరింగ్, ప్రొక్యూర్మెంట్, కన్‌స్ట్రక్షన్ (ఇపిసి) విధానంలో ఎంఇఐఎల్ ఈ అణు రియాక్టర్ల నిర్మాణాన్ని చేపట్టన్నామన్నారు. ఇప్పటి వరకు ఎన్‌పిసిఐఎల్ ఏకమొత్తంగా ఇచ్చిన అతిపెద్ద ఆర్డర్ ఇదేనన్నారు. తమ సంస్థ అత్యుత్తమ సాంకేతిక సామర్థ్యానికి, పోటీ తత్వానికి ఈ కాంట్రాక్టు సాధించటం ఓ నిదర్శనమన్నారు.



విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తున్న భాష్యం రామకృష్ణ

పది ఫలితాల్లో 'భాష్యం' స్టేట్ ఫస్ట్

- 600కు 600 మార్కులతో నేహాంజని రికార్డు

ప్రజాశక్తి-గుంటూరు

పదో తరగతి ఫలితాల్లో భాష్యం విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపారని భాష్యం విద్యాసంస్థ ఛైర్మన్ రామకృష్ణ తెలిపారు. గుంటూరు చంద్రమౌళి నగర్‌లోని మెయిన్ క్యాంపస్‌లో టాపర్లను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. భాష్యం విద్యార్థి వై.నేహాంజని 600కు 600 మార్కులు సాధించి స్టేట్ ఫస్ట్‌తో రికార్డు సాధించారన్నారు. కె.ప్రేమసత్య లిఖిత 599, కె.హర్షిత్ 599, ఎ.లిఖిత 599, పి.వి.ఎస్.ఎస్.శ్రీహాసిని 598, ఎస్. షాలిని సంహిత 598 మార్కులు, ఎం.ప్రియజోషిని 598 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారని తెలిపారు. 590 ఆ పైగా మార్కులను 206 మంది, 580 పైగా 953, 570 పైగా 1889, 550 పైగా 3585, 500 పైగా మార్కులను 6635 మంది విద్యార్థులు సాధించారని చెప్పారు. గణితంలో 100కు 100 సాధించిన విద్యార్థులు 1088, 95 పైగా 3223, 90 పైగా 4675 మంది, సైన్స్‌లో 100కు 100 సాధించిన విద్యార్థులు 724, 95పైగా 4331, 90 పైగా 6685 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. ఇంతటి ఘన విజయానికి తోడ్పడిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు రామకృష్ణ, వైస్ ఛైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్‌లు అభినందనలు తెలిపారు.

ఉర్సా కంపెనీ లోకేష్ బినామీ

- వైసిపి నేత కారుమూరి వెంకటరెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖలో మూడువేల కోట్ల విలువైన భూములను ఉర్సా కంపెనీకి కేటాయించడం వెనుక మంత్రి నారా లోకేష్, ఆయన బినామీలే సూత్రధారులని వైసిపి జాయింట్ సెక్రటరీ కారుమూరి వెంకటరెడ్డి ఆరోపించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. లోకేష్ స్నేహితుడు కిలారి రాజేష్ ద్వారా పెద్ద సంఖ్యలో డొల్ల కంపెనీలు సృష్టించి, వాటికి ప్రభుత్వం ద్వారా కారుచౌకగా విలువైన భూములు కట్టబెడుతున్నారని తెలిపారు. విలువైన భూములను ప్రైవేటు సంస్థలకు దోచిపెడుతున్నారని పేర్కొన్నారు. వారం రోజులుగా రాష్ట్ర ప్రజలు ఉర్సా క్లస్టర్స్ గురించి చర్చించుకుంటున్నారని, డొల్ల కంపెనీ హైదరాబాద్‌లో రెండు నెలల క్రితమే రిజిస్టరైందని వివరించారు. అటువంటి కంపెనీకి 56 ఎకరాలు కట్టబెట్టడంపై ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉండగానే టిసిఎస్‌తో చర్చలు జరిగాయని వివరించారు.

సంపాదకీయం

ఉగ్ర ఘాతుకం!

కాశ్మీర్ పర్యాటకులపై మంగళవారం నాడు ఉగ్రవాదులు విరుచుకుపడి, 28 మందిని కర్కశంగా కాల్చి చంపిన దుర్మార్గ చర్య దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. ఈ ఘాతుకాన్ని అన్ని పార్టీలూ ఏకకంఠంతో ఖండించాయి. జమ్మూ కాశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తిని కల్పించే 370 అధికరణం రద్దు తదితర చర్యల ద్వారా ఉగ్రవాదాన్ని అణచివేశామని, కాశ్మీర్‌లో ప్రశాంత వాతావరణం నెలకొల్పామని మోడీ ప్రభుత్వం ఘనంగా చెప్పుకుంటున్న నేపథ్యంలో ఈ ఉగ్రదాడి జరిగింది. ఈ దాడి తమ పనేనని ద రెసిస్టెన్స్ ఫ్రంట్ (టిఆర్‌ఎఫ్) అనే ఉగ్రవాద ముఠా ప్రకటించుకొంది. జమ్మూ కాశ్మీర్ స్వయంప్రతిపత్తిని రద్దు చేసిన తరువాత 2019లో ఈ సంస్థ ఏర్పడిందని, ఇది లష్కర్ తోయిబాకు అనుబంధంగా పనిచేస్తోందని మన నిఘా సంస్థలు ప్రకటించాయి. 2019లో 44 మంది సైనికులను పొట్టనబెట్టుకున్న పుల్వామా ఉగ్రదాడి తరువాత ... ఎక్కువమందిని బలిగొన్న ఈ దుశ్చర్య మోడీ ప్రభుత్వ భద్రతా వైఫల్యాన్ని ఎత్తి చూపుతోంది. మిలటరీ, జమ్మూ కాశ్మీర్ పోలీసులు కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోనే ఉన్నాయన్న విషయం మరువరాదు. ప్రచారార్భాటాలకు పరిమితం కాకుండా పటిష్టమైన భద్రతా చర్యలతో పౌరులకు, పర్యాటకులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యతను ఈ ఉగ్ర ఘాతుకం గుర్తు చేస్తోంది.

ఉగ్రదాడిలో రక్తమోడిన పహల్గాంలోని బైసరన్ ప్రాంతానికి మినీ స్విట్జర్లాండ్ అని పేరు. కనుచూపు మేరా అందమైన పచ్చిక బయళ్ళు, దట్టమైన పైన్ వృక్షాల సముదాయాలూ, వాటి నేపథ్యంలో ఎత్తయిన హిమనగాలూ ప్రకృతి ప్రేమికులకు అనంతమైన ఆనందానుభూతిని కలిగిస్తాయి. సముద్రమట్టానికి ఎనిమిది వేల అడుగుల ఎత్తులో ఉన్న ఆ ప్రాంతం నడి వేసవిలోనూ పది సెల్సియస్ డిగ్రీల లోపు ఉష్ణోగ్రతతో శీతల దేశాల్లో ఉన్న అనుభూతిని కలిగిస్తుంది. అందువల్లనే ఏటా ఈ సీజన్లో వేలాదిమంది పర్యాటకులు బైసరన్‌ని సందర్శిస్తారు. అలాంటి చోట ఆనందంగా విహరిస్తున్న సందర్శకులపై ఉన్మాద మూక విచక్షణారహితంగా చేసిన దాడి ... మిగిలిన కుటుంబ సభ్యులకు జీవిత కాలపు భయానక దృశ్యం. కళ్లముందే భర్తను కోల్పోయి, నిస్త్రాణగా మిగిలిన నవ వధువు; చూస్తుండగానే తండ్రిని కాల్చి చంపితే అమ్మ సందిట్లో బేలగా ఒదిగిన చిన్నారులు, భారత సైనికులు సాయుధులై రక్షణగా వచ్చినప్పుడు కూడా ఇంకా భయంలోనే ఉండి, 'చంపితే నన్ను చంపేయండి.. నా కూతురిని మాత్రం వదిలేయండి.' అని ప్రాధేయపడుతున్న తల్లి ... ఉన్మాదులు సృష్టించిన అమానుష కృత్యానికి ఆనవాళ్ళు.

కాశ్మీర్‌లో ఉగ్రవాదులు దాడులు చేయడం, సైనికులను, పౌరులను బలిగొనటం దశాబ్దాలుగా కొనసాగుతోంది. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదం సరిహద్దుకు ఆవల, ఈవల అప్పుడప్పుడు విధ్వంసక దుశ్చర్యలతో తన ఉనికిని చాటుకుంటోంది. దీనికి స్థానిక యువతలోని అసంతృప్తి, పరాయీకరణ, అనుమానిత నిఘా, నిరుద్యోగం వంటివి కారణమవుతున్నట్టు గతంలో అనేక అధ్యయనాలు వెల్లడి చేశాయి. దేశ సరిహద్దు ప్రాంతాల, పౌరుల అభివృద్ధికి పాలకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, అభివృద్ధి పథంలోకి మళ్లించటం ద్వారా ఉగ్రవాద సంస్థలకు ఊతం ఇవ్వని వాతావరణం నెలకొల్పాలి. ఏడు దశాబ్దాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న, ఉంటున్న పార్టీలు ఆ పనిని చిత్తశుద్ధితో చేయలేకపోయాయి. 370 అధికరణం రద్దు, ఆ తరువాత సాగించిన తీవ్ర నిర్బంధం కాశ్మీర్ ప్రజల మన్ననను పొందలేదని శాసనసభ ఎన్నికల ఫలితాలు చాటి చెప్పాయి. ఉగ్రవాద దాడులను మతకోణంలో చూడడం, విద్వేషాన్ని మరింత పెంచేలా ప్రచారం చేయడం దేశ భవిష్యత్తుకు మంచిది కాదు. ఉన్మత్తత ఆవహించిన ఉగ్రవాదానికి, మతోన్మాదానికి మతమూ, ప్రాంతమూ అన్న విచక్షణ ఉండదు. తమ ఉన్మాదానికి అడ్డొచ్చిన ప్రతి మనిషీ తమకు శత్రువుగానే భావిస్తాయి. పర్యాటకులను కాపాడే ప్రయత్నంలో ప్రాణాలు కోల్పోయిన హార్స్ రైడర్ సయ్యద్ అదిల్ హుస్సేన్ షా ఉదంతమే ఇందుకు ఉదాహరణ. ఇంకో రెండు నెలల్లో అమర్‌నాధ్ యాత్ర జరగనున్న నేపథ్యంలో మోడీ ప్రభుత్వం తగిన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలి. పర్యాటకుల రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో సరైన భద్రత లేకపోవడంతో సహా ఉగ్రదాడిపై సమగ్ర దర్యాప్తు జరిపి, ముష్కరులను కఠినంగా శిక్షించాలి. వైఫల్యం పునరావృతం కాకుండా తగు కట్టుదిట్ట చర్యలు తీసుకోవాలి.


మంచి మాట



మన లోపాలను
మనం తెలుసుకోవడం
అన్నింటికన్నా పెద్ద చదువు.
- మీర్జా గాలిబ్,
ప్రసిద్ధ కవి.

వాణిజ్య యుద్ధం అమెరికాకూ నష్టమే

విశ్లేషణ



ప్రబీర్ పుర్కాయస్థ


'విమోచన దినం' పేరిట అమెరికా అధ్యక్షుడు డోనాల్ట్ ట్రంప్ ఏప్రిల్ 2న మొదలు పెట్టిన వాణిజ్య యుద్ధానికి అనేక పార్శ్వాలు ఉన్నాయి. చైనా, ఐరోపా యూనియన్, జపాన్, ఇండియా వంటి అతి పెద్ద దేశాలతోపాటు ప్రపంచంలో అతి పేద దేశమైన లెసోతో పాటు అనేక చిన్న దేశాల మీద కూడా వాణిజ్య సుంకాలు విధించాడు. ఇప్పుడంటే అమెరికా-చైనాలు దెబ్బకు దెబ్బ అన్నట్లుగా ఒకదాని మీద ఒకటి 145 శాతం సుంకాలు విధించుకున్నాయి. కాని లెసోతో మీద 50 శాతం సుంకాలు విధించే నాటికి చైనా మీద విధించిన సుంకాలు 45 శాతమే. ట్రంప్, అమెరికాల సుంకాల దెబ్బ పడని 'మిత్ర దేశం' అంటూ ఏదీ మిగలలేదు.

స్వేచ్ఛా వాణిజ్యం పేరిట ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడులు ఎక్కడికైనా సంచరించడానికి కల్పించుకున్న వెసులుబాటు కూడా ధనిక దేశాల్లోని పెట్టుబడిదారీ సంక్షోభాన్ని అధిగమించడానికి అక్కరకు రాకుండా పోయింది. అందుకే ఇప్పుడు ప్రపంచాధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి అమెరికా కొత్త వ్యూహాన్ని అనుసరించాలని ట్రంప్ భావిస్తున్నాడు. సుంకాల యుద్ధం ద్వారా బలహీనపడుతున్న అమెరికన్ ఆధిపత్య ఆర్థిక వ్యవస్థను కొత్త మార్గం పట్టించవచ్చని ఊహిస్తున్నాడు.

అమెరికా ప్రస్తుతం అనేక దేశాలతో వాణిజ్య లోటు ఎదుర్కొంటున్నది. అంటే ఆ యా దేశాలకు అమెరికా చేసే ఎగుమతుల విలువ కన్నా ఆ యా దేశాల నుండి చేసుకుంటున్న దిగుమతుల విలువ ఎక్కువగా ఉంటుంది. దీనిని సరిదిద్దడానికే ట్రంప్ యంత్రాంగం సుంకాల పెంపును మార్గంగా ఎంచుకున్నది. అమెరికాతో వాణిజ్యం నెరపే ఏ దేశమైనా దానికి వాణిజ్య లోటు వున్నదా? మిగులు వున్నదా? అనే అంశంతో సంబంధం లేకుండా- కప్పం కట్టాల్సిందే. మాతో వ్యాపారం చేసే ఏ దేశమైనా మాకు లాభం చేకుర్చాల్సిందే అనేది ట్రంప్ వాదన. తద్వారా ప్రపంచ దేశాలతో అమెరికాకు ఉన్న భారీ వాణిజ్య లోటును పూడ్చుకోవాలని చూస్తున్నారు. వాస్తవానికి ఏ దేశానికైనా ఒక దేశంతో వాణిజ్య మిగులు ఉంటే ఇంకో దేశంతో వాణిజ్య లోటు ఉండనే ఉంటుంది. కానీ అమెరికా ప్రతి దేశంతో తనకు వాణిజ్య మిగులు ఉండాలని భావిస్తుంది. అందుకు సుంకాల విధింపును మార్గంగా ఎంచుకున్నది. అయితే ట్రంప్ వాణిజ్య వ్యూహం వికటించి అమెరికన్ స్టాక్ మార్కెట్, బాండ్ మార్కెట్ కుదేలైపోయాయి. ఈ అనూహ్య పరిణామాలతో ట్రంప్ సుంకాల అమలును 90 రోజుల పాటు వాయిదా వేశాడు. అయితే అమెరికాతో అతి పెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉన్న చైనాతో సుంకాల యుద్ధం మాత్రం తీవ్రతరంగా కొనసాగుతున్నది. మిగిలిన దేశాల మెడల మీద ఈ సుంకాల కత్తి ఇంకా వేలాడుతూనే ఉన్నది.

ట్రంప్ ఏకపక్షంగా విధించిన ఈ సుంకాల పర్యవసానంగా అమెరికన్ స్టాక్ మార్కెట్ పతనాన్ని చవిచూసింది. దీని ప్రభావం బాండ్ మార్కెట్ల (అమెరికా వివిధ దేశాల నుండి తెచ్చుకున్న అప్పులకుగానూ హామీగా జారీ చేసే సార్వభౌమ తాకట్టు పత్రాల అమ్మకాలు-కొనుగోళ్ల జరిగే మార్కెట్) మీద కూడా పడింది. ఇది స్టాక్ మార్కెట్ కన్నా అత్యంత కీలకమైనది. ఇది కూడా దెబ్బతినేసరికి ట్రంప్ వెనుకడుగు వేశాడు.

సుంకాల అమలును 90 రోజులపాటు వాయిదా వేస్తున్నా. ఈ 90 రోజుల్లోగా ప్రతి దేశం వచ్చి మాతో వాణిజ్య ఒప్పందాలు చేసుకోవాల్సిందే. అప్పటిదాకా ప్రతి దేశం పది శాతం ఫ్లాట్ రేటున సుంకాలు చెల్లించాల్సిందేనని ట్రంప్ ప్రకటించాడు. అంటే మన సినిమాల్లో చూపిస్తున్నట్లు మాఫియా డాన్ ఆధిపత్యాన్ని అంగీకరించడానికి అతని ముందు మోకరిల్లి చేతిని ముద్దాడినట్లు సంకాల తగ్గింపు కోరుకునే దేశాలన్నీ వచ్చి అమెరికన్ సామ్రాజ్య చక్రవర్తులుంగారుగా తనని తాను భావించుకుంటున్న ట్రంప్ ముందు సాగిలపడాలని కోరుకుంటున్నాడు. అయితే పది శాతం ఫ్లాట్ రేటు సుంకం మీద ఎలాంటి రాయితీ ఉండదని స్పష్టం చేశారు.



ట్రంప్ విధించిన ఈ సుంకాల మూలంగా 2024లో 2.5 శాతంగా ఉన్న సుంకాలు ఒక్కసారిగా 22 శాతానికి పెరిగాయని, 1910 తర్వాత అమెరికా విధించిన సుంకాల్లో ఇదే అత్యధికమని 'ఫిచ్' రేటింగ్ కంపెనీ పేర్కొన్నది.

చాలా దేశాలు అమెరికాతో వాణిజ్య చర్చలకు సిద్ధపడ్డాయి. కానీ చైనా మాత్రం ట్రంప్ ఆడమన్నట్లు ఆడడానికి సిద్ధపడకపోగా చైనా మీద అమెరికా ఎంత శాతం సుంకాలు విధిస్తే చైనా కూడా అమెరికా మీద అంతే సంకాలు విధిస్తూ వచ్చింది. చైనా అమెరికన్ దిగుమతుల మీద, అమెరికా చైనా ఎగుమతుల మీద 145 శాతం సుంకాలు విధించింది. అయితే ట్రంప్ తనదే పైచేయి అని చాటి చెప్పడానికి చైనా మీద సుంకాలు 245 శాతానికి పెంచినట్లు ప్రకటించాడు. కానీ చైనా మాత్రం ఈ పెంపు 'నామ్ కే వాస్తే' తప్పితే 145 శాతానికి మించి సుంకం విధించడం సాధ్యమయ్యే పని కాదని స్పష్టం చేసింది.

ఇప్పుడు నడుస్తున్న అంతర్జాతీయ వాణిజ్యం అంతా ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఓ) విధివిధానాలకు లోబడి ఉంది. ఇది రూపొందించింది కూడా సామ్రాజ్యవాద శక్తులే. సైన్స్, టెక్నాలజీ రంగాల్లో అగ్రగామిగా ఉన్నందున డబ్ల్యుటిఓ చట్రం ద్వారా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మొత్తాన్ని శాశ్వతంగా తాను శాసించగలనని అమెరికా భావించింది. అంతర్జాతీయంగా శ్రామికవర్గంలో ఉన్న విభజన కారణంగా పేద దేశాలు నాసిరకం సాంకేతికత కూడిన సరుకులు ఉత్పత్తి చేస్తే ఆధునిక సాంకేతికత ద్వారా తాను ఉత్పత్తి చేసే సరుకులకు మార్కెట్‌లో గిరాకీ ఏర్పడి మంచి లాభాలు సంపాదించుకోవచ్చని తలచింది. పేద దేశాలు ఎంత సాంకేతిక అభివృద్ధి సాధించినా తాము వాటికన్నా పదడుగులు ముందే ఉంటామని సామ్రాజ్యవాద దేశాలు ధీమాగా ఉండేవి. పరిశ్రమలు మాకు, వ్యవసాయం గనుల తవ్వకాలు మీకు అని వలస పాలనాకాలం నాటి విధానాన్ని మక్కీకి మక్కీగా కాదు గానీ దాదాపుగా అలాంటి నమూనానే డబ్ల్యుటిఓ ద్వారా బలహీన, పేద దేశాల మీద రుద్దారు. పనిలో పనిగా అమెరికా తన వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవడానికి సబ్సిడీలు ఇచ్చుకునే అవకాశాన్ని అట్టేపెట్టుకున్నది.

డబ్ల్యుటిఓ చట్రం పరిధిలో కూడా శాస్త్ర సాంకేతిక రంగాలను అభివృద్ధి చేసుకుని, వాటిని పారిశ్రామిక రంగంతో అనుసంధానించుకుని సామ్రాజ్యవాద దేశాలు ఊహించినదానికన్నా వేగంగా, శీఘ్రంగా అంతర్జాతీయ వాణిజ్యంలో పై మెట్టుకు ఎదగడానికి వీలుగా రాజ్యం జోక్యం చేసుకునేందుకు అవకాశం ఉన్నది. సాంకేతిక అభివృద్ధి సాధించడానికి మానవ వనరులు, విజ్ఞానాలను అభివృద్ధి చేయడానికి రాజ్యం ప్రయత్నపూర్వకంగా, ప్రణాళికాబద్ధంగా పెట్టుబడులు పెట్టడానికి, టెక్ రంగానికి రక్షణలు కల్పించడానికి, రాజ్యం ఏ మేరకు సిద్ధపడితే ఆ మేరకు సానుకూల ఫలితాలు సాధించేందుకు అవకాశం ఉంటుంది. డబ్ల్యుటిఓ లో ఉన్న సంక్లిష్టతలు, ముఖ్యంగా మేధో హక్కుల విషయంలో ఉన్న అవాంతరాలన్నింటినీ అధిగమించి భారతదేశం ఫార్మాస్యూటికల్ రంగంలో ప్రపంచ అగ్రగామిగా నిలిచిందన్న అంశాన్ని మనం ఇక్కడ గుర్తుచేసుకోవాలి. అయితే మన ప్రభుత్వం అనుసరిస్తున్న ఉదాశీన వైఖరి కారణంగా మన అగ్రగామి స్థానాన్ని చైనాకు వదులుకునే దశకు చేరుకున్నాం. మందుల తయారీకి కీలకంగా అవసరమైన ఎ.పి.ఐ (యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇన్‌గ్రేడియంట్)ల ఉత్పత్తి మీద మన దేశం శ్రద్ధ పెట్టకపోవడం మూలంగా చాలా వరకు మన ఫార్మా రంగం చైనా దిగుమతుల మీదే ఆధారపడి ఉన్నది. ఎలక్ట్రానిక్స్ రంగంలో కూడా మన దృష్టి మసకబారిపోయింది. అభివృద్ధి చెందుతున్న దేశాలు-దక్షిణ కొరియా, చైనాలు సహా- సి.డాట్ ద్వారా సాంకేతిక పరిజ్ఞానాన్ని మార్పిడి చేసుకుని సాంకేతిక రంగంలో శీఘ్రగతిన అభివృద్ధి చెందేందుకు అవకాశాలు ఏర్పడ్డాయి. కానీ మన పాలకులు సాఫ్ట్‌వేర్ రంగం మీద ఆధారపడితే చాలు, త్వరితగతిన అభివృద్ధి చెందుతాం అని సరిపెట్టుకున్నారు తప్పితే ఏకకాలంలో సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ రంగాలను అభివృద్ధి చేసుకోవచ్చన్న ఆలోచన చెయ్యలేదు. అందుకు కారణం పాలక వర్గాల బ్రాహ్మణవాద భావజాలమే. రెక్కల కష్టంకన్నా బుద్ధి బలమే గొప్పది అన్న శ్రమను గౌరవించలేని సంస్కృతే కారణం.

> సామ్రాజ్యవాద శక్తులు ఈ వాణిజ్య యుద్ధంలో గెలిచే అవకాశాలు లేవు కానీ...అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకు, ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థకు నష్టం వాటిల్లేలా చేస్తాయి. ఈ సాకుతోనే ప్రపంచ దేశాలను 'బ్లాక్ మెయిల్' చేసేందుకు ట్రంప్ ప్రయత్నిస్తున్నాడు. సైనిక పరంగా బలంగా ఉన్నాం కాబట్టి 'ఈ వాణిజ్య యుద్ధంలో నెగ్గకపోతే సైనిక యుద్ధం ద్వారా అయినా పై చెయ్యి సాధిస్తాం' అని పశ్చిమ దేశాలు భావిస్తున్నాయి. ఫ్రాన్స్‌ను పరిపాలించిన 15వ లూయిస్ చక్రవర్తి 'నేను పోతే, ఉత్పాతమే' అని బలంగా విశ్వసించేవాడు. ఆ విశ్వాసంతో చేసిన అడ్డగోలు పరిపాలన ఫ్రెంచి విప్లవానికి దారి తీసింది. రియల్ ఎస్టేట్ రంగ యజమానిగా ట్రంప్ ఆరుసార్లు దివాళా పిటిషన్లు వేసినా విజయవంతమైన వ్యాపారవేత్తగా కొనసాగాడు. కానీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థను దివాళా తీయిస్తే ఊరట కల్పించడానికి ఏ కోర్టులూ లేవు, రావు. కాబట్టి ట్రంప్ మొదలుపెట్టిన వాణిజ్య యుద్ధం అమెరికాతో పాటు మనందరికీ నష్టం వాటిల్లేలా చేస్తుంది. అందుకే ట్రంప్ సుంకాల యుద్ధాన్ని వ్యతిరేకించాలి.

ట్రంప్ సుంకాల ప్రకటన నేపథ్యంలో అంతర్జాతీయ వాణిజ్య, మీడియా రంగం మరీ ముఖ్యంగా ఫైనాన్షియల్ టైమ్స్, బ్లూమ్‌బర్గ్ తదితర పశ్చిమ దేశాల మీడియా చైనా మీద అమెరికా ప్రారంభించిన ఈ వాణిజ్య యుద్ధం అమెరికాకే ఎసరు తెస్తుందని ప్రచారం చెయ్యడం ఆసక్తికరంగా మారింది. 'ఎకనమిస్టు' పత్రిక అయితే 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' అన్న ట్రంప్ నినాదాన్ని వెక్కిరిస్తూ ఈ సుంకాల యుద్ధంలో అమెరికా విల్ మేక్ చైనా గ్రేట్ ఎగైన్ (అమెరికాయే చైనాను గొప్ప శక్తిగా తీర్చిదిద్దుతుంది.) అన్న పతాక శీర్షికతో వార్త ఇచ్చింది. వాస్తవానికి వాణిజ్య యుద్ధాలు అన్ని దేశాలకూ నష్టంగా పరిణమిస్తాయని గుర్తించడం ముఖ్యం. అయితే ఏ దేశం తీవ్రంగా నష్టపోయే అవకాశం వుందనేది కూడా అంతే ముఖ్యంగా గుర్తించాల్సిన అంశం. అన్ని పక్షాలా నష్టం వాటిల్లే ఈ యుద్ధంలో ప్రధానంగా చైనా ఎక్కువగా నష్టపోతుందని ట్రంప్ అంచనా.

ట్రంప్, అతని ఆర్థిక సలహాదారులు ఈ రకమైన అంచనాకు రావడానికి గల కారణం అమెరికా చైనాకు చేసే ఎగుమతుల కన్నా రెండింతలు దిగుమతులు చేసుకుంటున్నది. కాబట్టి చైనా సరుకులు అమెరికన్ మార్కెట్‌లో అమ్ముడు పోనంత సుంకాలు విధిస్తే చైనా ఎగుమతులు దెబ్బతిని అంతిమంగా నష్టపోతుందన్న సాదాసీదా సిద్ధాంతాన్ని నమ్మడమే. అమెరికన్ మేధో మండలిలో భాగంగా వున్న విదేశాంగ వ్యవహారాల మండలి తరపున ప్రచురించే పత్రిక 'ఫారిన్ ఎఫైర్స్'లో ఆడమ్ పోజెన్ రాసిన వ్యాసాలు కానీ, అమెరికన్ ప్రధాన స్రవంతి మీడియాలో గానీ ఈ విశ్లేషణలే కనబడతాయి. కానీ వాస్తవం ఇందుకు పూర్తి భిన్నంగా ఉంటుంది. చైనా తన ఎగుమతులను వివిధ ప్రపంచ దేశాలకు మళ్ళించుకోవచ్చు. అలాగే పెద్ద కష్టపడకుండా దేశవాళీ వినియోగాన్నే మరింత విస్తరించుకోవచ్చు. కానీ ప్రపంచంలోనే అగ్రగామి సరఫరాదారుగా ఉన్న చైనా స్థానాన్ని ప్రస్తుతం ఏ దేశమూ భర్తీ చేసే స్థితిలోగాని, స్థాయిలోగానీ లేవు. అమెరికా నుండి చైనా సోయా, నూనె విత్తనాలు తదితర వ్యవసాయ ఉత్పత్తులను భారీగా దిగుమతి చేసుకుంటున్నది. చైనా ఈ దిగుమతులను నిలిపివేస్తే ట్రంప్‌కు బలమైన మద్దతుగల ఫ్లోరిడా, నెబ్రాస్కా వంటి రాష్ట్రాలు దెబ్బతినిపోతాయి. ఈ వాణిజ్య యుద్ధంలో అమెరికా అనూహ్యంగా నష్టపోతుంది. ఇప్పటికే చైనా అమెరికా నుండి సోయా దిగుమతులను పూర్తిగా నిలిపివేసింది. ఇండోనేషియా నుండి కావాల్సిన సోయా దిగుమతులకు ఒప్పందం కుదుర్చుకున్నది. చైనా అధ్యక్షుడు ఇండోనేషియా, వియత్నాం తదితర దేశాల పర్యటనల వెనుక ఉన్న ఉద్దేశం ఇదే. వాణిజ్య యుద్ధాల్లో మనం ఎంతో నష్టపోతున్నా ఎదుటి వాళ్ళను అంతకంతా నష్టపరిచే 'సామర్థ్యం' ఏ దేశానికి ఎక్కువగా ఉంటుందో చివరికి ఆ దేశానిదే పైచెయ్యి అవుతుంది. అలాంటి 'సామర్థ్యం' ప్రస్తుతానికి చైనాకే ఉన్నదని ఆడమ్ పోజెన్ కూడా స్పష్టం చేశాడు.

ప్రస్తుతం చైనా మీద ఎక్కుపెట్టిన ఈ వాణిజ్య యుద్ధంలో యాపిల్ తదితర ఎలక్ట్రానిక్ వస్తూత్పత్తి పరిశ్రమలు దెబ్బతిని పోయే అవకాశం ఉందని గ్రహించాక ఐఫోన్లు, కంప్యూటర్లు ఉత్పత్తి చెయ్యడానికి అవసరమైన విడిభాగాల దిగుమతుల మీద 145 శాతం సుంకాలను ట్రంప్ ఉపసంహరించుకున్నాడు. చైనా-అమెరికాల మధ్య వాణిజ్య యుద్ధం కొనసాగినంత కాలం అమెరికన్ వస్తూత్పత్తి రంగం మీద వేటు కత్తి వేలాడుతూ ఉన్నట్లే.


తక్కువ సుంకాలతో అంతర్జాతీయ వాణిజ్యాభివృద్ధి సాధించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన డబ్ల్యుటిఓ శకం ముగిసిపోయిందనడానికి ట్రంప్ ప్రకటించిన సుంకాల యుద్ధమే ఒక సూచిక. చైనా, దక్షిణ కొరియా, భారత్ సహా మరిన్ని తూర్పు ఆసియా దేశాలు-ఇంకా సూక్ష్మంగా చెప్పుకోవాలంటే-ఒకప్పటి వలస దేశాలు అభివృద్ధి కావడం వలస పాలకులైన సామ్రాజ్యవాద దేశాలకు కంటగింపుగా మారింది. పతనాభిముఖంగా ఉన్నప్పటికీ ఇంకా ప్రధాన ఆర్థిక శక్తిగా ఉన్న దేశాలు అంతర్జాతీయ వాణిజ్య సరళిని పూర్తిగా తమ ప్రయోజనాలకు అనుగుణంగా మార్చుకోవాలని ప్రయత్నించే క్రమంలో 'బొమ్మాబొరుసు' ఆట మొదలుపెట్టాయి. 'బొమ్మ పడితే మేం గెలిచినట్లు, బొరుసు పడితే మీరు ఓడినట్లు' అన్న తొండాట ఆడడానికి పూనుకున్నాయి. సామ్రాజ్యవాద శక్తులు ఈ వాణిజ్య యుద్ధంలో గెలిచే అవకాశాలు లేవు కానీ అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకు, ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థకు నష్టం వాటిల్లేలా చేస్తాయి. ఈ సాకుతోనే ప్రపంచ దేశాలను 'బ్లాక్ మెయిల్' చేసేందుకు ట్రంప్ ప్రయత్నిస్తున్నాడు. సైనిక పరంగా బలంగా ఉన్నాం కాబట్టి 'ఈ వాణిజ్య యుద్ధంలో నెగ్గకపోతే సైనిక యుద్ధం ద్వారా అయినా పై చెయ్యి సాధిస్తాం' అని పశ్చిమ దేశాలు భావిస్తున్నాయి. ఫ్రాన్స్‌ను పరిపాలించిన 15వ లూయిస్ చక్రవర్తి 'నేను పోతే, ఉత్పాతమే' అని బలంగా విశ్వసించేవాడు. ఆ విశ్వాసంతో చేసిన అడ్డగోలు పరిపాలన ఫ్రెంచి విప్లవానికి దారి తీసింది.

రియల్ ఎస్టేట్ రంగ యజమానిగా ట్రంప్ ఆరుసార్లు దివాళా పిటిషన్లు వేసినా విజయవంతమైన వ్యాపారవేత్తగా కొనసాగాడు. కానీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థను దివాళా తీయిస్తే ఊరట కల్పించడానికి ఏ కోర్టులూ లేవు, రావు. కాబట్టి ట్రంప్ మొదలుపెట్టిన వాణిజ్య యుద్ధం అమెరికాతో పాటు మనందరికీ నష్టం వాటిల్లేలా చేస్తుంది. అందుకే ట్రంప్ సుంకాల యుద్ధాన్ని వ్యతిరేకించాలి.


/ స్వేచ్ఛానుసరణ /

మత వ్యాపార సంస్కృతి లౌకికవాదానికి ముప్పు

వ్యాఖ్య



డా॥ కత్తి పద్మారావు



దేశంలో ఈనాడు మత వ్యాపార సంస్కృతి పెరుగుతున్నది. గుడులు, మఠాలు, బాబాల ఆశ్రమాలకు పర్యాటకం విపరీతంగా పెరుగుతున్నది. సాధారణంగా ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి విజ్ఞానశాలలు, విశ్వ విద్యాలయాలు, విస్తృతమైన గ్రంథాలయాలు, సముద్ర తీరాలు, నదీ తీర ప్రాంతాలు, చారిత్రక కట్టడాలను చూడడానికి వెళ్ళాలి. కాని మత కేంద్రాలైన దేవాలయాలను సందర్శించడానికి లక్షలు లక్షలు ఖర్చు పెడుతున్నారు. మత క్షేత్రాల సందర్శనకు టూరిస్ట్ బస్‌లు, విమాన సర్వీసులు, ప్రత్యేక రైళ్ళు ప్రభుత్వాలు ఏర్పాటు చేస్తున్నాయి. అదే ఒక చారిత్రక కట్టడానికి ప్రభుత్వాలు ఇటువంటి ప్రయాణ సౌకర్యం కలిగించటం లేదు.

నిజానికి రెండు తెలుగు రాష్ట్రాల్లో అత్యున్నతమైన అంబేద్కర్ స్మృతి వనాల రూపకల్పన జరిగింది. విజయవాడ నడిబొడ్డులో 125 అడుగుల డా॥బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని గత ప్రభుత్వం ఏర్పరచింది. ఆ వనంలో అంబేద్కర్ జీవిత చరిత్రను చక్కగా రూపొందించారు. వివిధ స్కూళ్లు, కాలేజీల నుండి టూరిస్ట్ బస్సులు ఏర్పాటు చేసి ఆ స్మృతి సందర్శన ద్వారా విద్యార్థుల్లో విద్యాసక్తిని రూపొందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. పోయిన ప్రభుత్వం మీద ద్వేషంతో ఇప్పటి వరకు ఒక్కసారి కూడా వెళ్ళి ఆ విగ్రహాన్ని సందర్శించి పూలమాలాంకృతి చేయలేదు. అలాగే హైదరాబాద్‌లో డా॥బి.ఆర్.అంబేద్కర్ 126 అడుగుల విగ్రహాన్ని మాజీ ముఖ్యమంత్రి నిర్మించగా...ప్రస్తుత సి.ఎం ఆ గేట్లు కూడా తెరవలేదు. మొన్న జయంతికి నామమాత్రంగా తెరిచారు. దాని వలన విద్యార్థుల్లో అంబేద్కర్ స్ఫూర్తి రావటం లేదు.

దేశ స్థూల జాతీయోత్పత్తి (జిడిపి)లో పర్యాటక ఆదాయం వాటా 9.6 శాతం. ఇందులో దేశీయ పర్యాటకం 88 శాతం. గతేడాది ఇండియా సందర్శించిన విదేశీ పర్యాటకులు కేవలం 90 లక్షలు కాగా, స్థానిక యాత్రికుల సంఖ్య కళ్లు చెదిరేలా 14 కోట్లను దాటింది. కేంద్ర ప్రభుత్వాలు పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడానికి ఢిల్లీ-ఆగ్రా-జైపూర్ 'స్వర్ణ త్రిభుజం' మీద అధిక శ్రద్ధ పెడుతుంటాయి. వాస్తవానికి తమిళనాడు సందర్శించేవారు అత్యధికంగా 20 శాతం ఉన్నారు. ఢిల్లీ పర్యాటకులు వారిలో సగం ఉంటారు. దక్షిణాది రాష్ట్రాలు దేశవిదేశాల టూరిస్టులను ఆకర్షించడంలో ముందు వరుసలో నిలుస్తాయి. కారణం మతపరంగా ప్రముఖమైన తిరుపతి, మదురై వంటి ప్రదేశాలు వీటిలో ఎక్కువగా ఉండటమే. తిరుపతి వల్ల ఆంధ్రప్రదేశ్ ఇండియాలోనే అతి పెద్ద దేశీయ పర్యాటక ప్రదేశంగా రూపొందింది. రెలిజియస్ టూరిజం ఇప్పుడు అతి పెద్ద వ్యాపారం.

గడచిన నాలుగైదేళ్లలో గతంలో కంటే అధికంగా మతం మీద మమకారం పెంచుకున్న భారతీయులు 25 శాతం పైగానే ఉన్నారని 'ప్యూ' సంస్థ నిర్వహించిన 'గ్లోబల్ యాటిట్యూడ్ సర్వే' తేల్చింది. ఇది ఏ ఒక్క మతానికో పరిమితం కాదు. అన్ని మతాల్లోనూ ఈ ధోరణి కనబడుతున్నది. ఎన్‌ఎస్‌ఎస్‌ఓ (నేషనల్ శాంపుల్ సర్వే ఆఫీస్) నివేదిక ప్రకారం, మత ప్రదేశాల సందర్శనలపై చేసిన సగటు వ్యయం ఇదే కాలంలో రెట్టింపు కంటే ఎక్కువైంది. మత వ్యాపారానికి ఆకాశమే హద్దు (ఇందులో శ్లేష లేదు). ఇది ఉపాధి అవకాశాలు పెంచవచ్చు. సంతోషమే! మరి మత భావన పెరుగుతూ పోవడం వల్ల తలెత్తే ఇతర పరిణామాల మాటేమిటి? సమాజంలో మూఢనమ్మకాలు, అంధ భక్తి, మత పిచ్చి పెచ్చరిల్లుతాయి. ఒక ఆధునిక సమాజంగా ఇండియా ఆవిర్భవించకుండా ఇవి అడ్డుపడే ప్రమాదం ఉంది.

క్రైస్తవం, ఇస్లాంలో కూడా విపరీతమైన వ్యాపార సంస్కృతి వుంది. ముఖ్యంగా శాస్త్రీయ అధ్యయనానికి వ్యతిరేకంగా ప్రార్థనల ద్వారా జ్వరాలు పోతాయి అనటం, గృహ సందర్శనాల పేరుతో బలహీనులను దోచుకోవటం, రోజుల తరబడి ఉపవాసాలు వుంచి ఆరోగ్యాలు పాడుచేయడం వంటివన్నీ అశాస్త్రీయమైన కార్యక్రమాలు. ఇవి మూడు మతాల్లోను విపరీతంగా జరుగుతున్నాయి. వీటిని ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయి. మక్కా ప్రయాణాల తొక్కిళ్ళల్లో వందల మంది చనిపోతున్నారు. ఇటీవల తిరుపతిలో పదుల సంఖ్యలో చనిపోయారు. జిల్లా పరిషత్ స్కూళ్లలో కూడా విద్యార్థినులకు బురఖాలు తప్పనిసరి చేసి వారిలో లౌకికవాద దృక్పథాన్ని దెబ్బతీస్తున్నారు. క్రైస్తవ స్కూళ్లలో అయితే భారత రాజ్యాంగం ప్రకారం 40 శాతం రిజర్వేషన్ కల్పించకుండా ఫీజులు విపరీతంగా దండుకుంటున్నారు. పేద పిల్లలకు అక్కడ చోటు లేదు. భారత జాతీయ గీతాన్ని ఆలపించకుండా ప్రార్థనలతో అసెంబ్లీలు నడిపిస్తున్నారు. అన్ని రేడియోలలో, టీవీలలో మత ప్రచారం ముమ్మరం అయింది. ఉదయ కాలాన్నే రకరకాల దేవుళ్ళ స్తుతులు, కీర్తనలు పాడుతూ జ్ఞానబోధను తగ్గించారు. వ్యక్తిత్వ నిర్మాణ బోధలు బాగా తగ్గిపోయాయి. కవిత్వం, నవల, పాట, జానపదం బహుజనం స్త్రీ విముక్తి సంబంధించిన ఆశయాలు టీవీలలో మృగ్యమైనాయి.

ఇప్పుడు రోడ్డు మలుపుల్లో మత కేంద్రాలు, గుడులు నిర్మించడం పెద్ద వ్యాపారంగా మారింది. ముఖ్యంగా ప్రతి మలుపులోనూ ఒక దేవాలయం దర్శనమిస్తుంది. ఇక వాటిని కదిలించడానికి వీలులేదు. చివరికి రోడ్డు విశాలపరిచేటప్పుడు కూడా వాటిని తప్పించి రోడ్లు వేసుకోవాలి. నిజానికి నెహ్రూ, డా॥బి.ఆర్.అంబేద్కర్ వంటి వారు గుడులను సందర్శించలేదు. ఇప్పుడు ముఖ్యమంత్రులు లౌకిక దృక్పథాన్ని కాపాడాల్సిన వారు మత రాజకీయాలు నడుపుతున్నారు. కొందరైతే కాషాయ వస్త్రాలతో తిరుగుతున్నారు.

ఈ సందర్భంలో లౌకిక, ప్రజాస్వామ్య, ప్రగతిశీల వాదులందరూ కలిసి మతం పేరుతో జరుగుతున్న మూఢ భావజాల ఆర్థిక దోపిడీ విధానాలను అడ్డుకోవాలి. కారల్‌మార్క్స్, అంబేద్కర్ ఆలోచనా విధానాలతో నూతన సాంస్కృతిక విప్లవాన్ని విజయవంతం చేస్తారని ఆశిద్దాం.

/ వ్యాసకర్త సెల్: 9849741695/

జనవాక్యం

భూగృహం

అనేక రకాల వృక్ష జాతులు, వైవిధ్యభరితమైన జంతువులు సహజీవనం చేస్తున్న భూగోళంపై సమతుల జీవవైవిధ్యం వరంగా నెలకొని భూమి ఒక స్వర్గతుల్య క్షేత్రంగా, జీవకోటికి వరప్రసాదంగా అవతరించింది. మానవ సమాజం నేడు డిజిటల్ యుగపు మాయలో పడిపోయి పర్యావరణంతో పరాచికాలాడుతూ తమ మనుగడను తానే ప్రశ్నార్థకం చేసుకుంటున్నది. అడవుల నరికివేతను కట్టడి చేయడం, మొక్కలు పెంచడం, వన్యప్రాణులను రక్షించడం, తరగని ఇంధనాలను (సౌర, పవన, అలల, జల, జియో థర్మల్) వాడడం, ఎలక్ట్రానిక్ వాహనాల వాడకాన్ని పెంచడం, రసాయన ఎరువులు/క్రిమిసంహారక మందుల వాడకాన్ని తగ్గించడం, ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించడం, జీవవైవిధ్య పరిరక్షణ చర్యలు తీసుకోవడం, పరిశ్రమల కాలుష్యాన్ని అరికట్టడం లేదా నియంత్రించడం, వర్షపు నీటిని ఒడిసి పట్టడం, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు పెంచడం, ఆహార వ్యర్థాలను తగ్గించడం, పర్యావరణహిత రవాణా వ్యవస్థలను ప్రోత్సహించడం, విద్యుత్తు/నీటిని పొదుపు చేయడం లాంటి చర్యలు తీసుకోవాలి. అమ్మ ఒడిని పోలినది భూమాత సన్నిధి. మానవ ఆవాస కేంద్రమైన పుడమికి హాని తలపెట్టడం అంటే మన బొందను మన తవ్వుకోవడమే అని అర్థం చేసుకోవాలి. తాగే నీటిని, పీల్చే గాలిని, నడిచే నేల, పంచభూతాలను సహితం నవ్య నరుడు కలుషితం చేస్తూ తాను కూర్చున్న కొమ్మను తానే నరుక్కుంటూన్నాడు. కలుషిత ధరణి ప్రజారోగ్యానికి సవాలు విసురుతోంది. భూమాత నిశ్శబ్ద రోదనలు వినగలిగిన విజ్ఞులకు మాత్రమే వినిపిస్తాయి. నరుడు లేకుండా భూమి దర్జాగా ఉండగలదు, కాని భూగృహం లేకుండా మనిషి రెండు నిమిషాలు కూడా మనుగడ సాగించలేడని అర్థం చేసుకోవాలి. హరిత వస్త్రాలు కడుతూ భూమిని కాపాడుకోవాలి. మన ఆరోగ్యకర మనుగడను మనమే కాపాడుకోవాలి.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి

'దాడులు ఆపేందుకు ప్రయత్నించి...'

ప్రాణాలు కోల్పోయిన గుర్రం స్వారీ యువకుడు

- అంత్యక్రియల్లో పాల్గొన్న సిఎం ఒమర్ అబ్దుల్లా

శ్రీనగర్: ఉగ్రవాదులు తెగబడినప్పుడు ఆ ప్రాంతంలో ఉన్న వారెవరైనా తన, మన భేదం లేకుండా ఆ దాడులు ఆపేందుకు ప్రయత్నించారనడానికి ఈ ఘటనలే ఉదాహరణగా నిలుస్తున్నాయి. పర్యాటకులపై ముష్కరులు తూటాలు ఎక్కుపెట్టి కాల్పులు జరపటానికి సిద్ధమైనపుడు.. పాపం.. చంపొద్దు అంటూ ఓ గుర్రం స్వారీ యువకుడు ఆపడానికి ప్రయత్నించాడు. ఆ దుర్మార్గులు అతన్నీ వదల్లేదు. మరో చోట 11 మంది కుటుంబ సభ్యులను ఓ కాశ్మీరి వ్యాపారి సురక్షితంగా కాపాడారు. స్థానిక ఆటోడ్రైవర్లు, జనం పర్యాటకులకు అండగా నిలవటానికి ముందుకు రావటం గమనించదగ్గ విషయం. జమ్ముకాశ్మీర్‌లోని పహల్గాంలో మంగళవారం జరిగిన ఉగ్రదాడిని ఆపేందుకు ఓ గుర్రం స్వారీ యువకుడు సయ్యద్ ఆదిల్ హుస్సేన్ షా ప్రయత్నించాడని సిఎం ఒమర్ అబ్దుల్లా తెలిపారు. ఉగ్రవాదుల కాల్పుల్లో అతడు కూడా మరణించాడని చెప్పారు.

బుధవారం నిర్వహించిన సయ్యద్ ఆదిల్ హుస్సేన్ షా అంత్యక్రియల్లో ఒమర్ అబ్దుల్లా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో సిఎం మాట్లాడారు. 'ఏం చెప్పను? మా అతిథులు సెలవులకు వచ్చారు. దురదృష్టవశాత్తు వారిని శవపేటికల్లో పంపాల్సిన దుస్థితి. ఈ యువకుడు (షా) జీవనోపాధి కోసం చాలా కష్టపడ్డాడు. పని కోసం ఇంటి నుంచి వెళ్లాడు. దురదృష్టవశాత్తు అతడి మృతదేహాన్ని కూడా శవపేటికలో తిరిగి ఇచ్చారు' అని బాధపడుతూ తెలిపారు.

11 మంది కుటుంబ సభ్యులను కాపాడిన కాశ్మీరి వ్యాపారి

ఛత్తీస్‌గఢ్‌కు చెందిన మహేంద్ర గఢ్ చిర్‌మిరీ, భరత్‌పూర్ ప్రాంతానికి చెందిన నాలుగు కుటుంబాలు వేసవి సెలవుల నేపథ్యంలో ఏప్రిల్ 18న చిన్నారులతో సహ విహార యాత్రకు వెళ్లారు. 21న పహల్గాం పర్యటనకు వెళ్లినట్లు కుల్దీప్ బంధువు రాకేశ్ తెలిపారు.

కొండచరియలు విరిగిపడటంతో రోడ్డుపై ట్రాఫిక్ నిలిచి పోయిందని, ఎక్కడి వారు అక్కడే ఆగిపోయారని వివరించారు. ఈ సమయంలోనే ఉగ్రదాడి జరుగగా ఆ సమయంలో శివాన్ష్ జైన్, కుల్దీప్ స్థాపక్, అరవింద్ అగర్వాల్, హ్యాపీ బద్వాన్ కుటుంబాలకు చెందిన 11మంది అక్కడే ఉన్నారు. భయపడిన వారు పరుగులు తీసినట్లు వెల్లడించారు. వీరిని గమనించిన స్థానిక కాశ్మీరీ వ్యాపారి నజకత్ అలీ సమయస్ఫూర్తిని ప్రదర్శించి, పర్యాటకులు 11 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించి కాపాడినట్లు తెలిపారు. నజకత్ అలీ గత ఏడాది శీతాకాలంలో ఉన్ని దుస్తులు విక్రయించేందుకు చిర్‌మిరికి వస్తుంటాడని వారు పేర్కొన్నారు.



ఉగ్రవాది దాడిని ధైర్యంగా ఎదుర్కొని ప్రాణాలను త్యాగం చేసిన సయ్యద్ ఆదిల్ హుస్సేన్ షా తండ్రిని ఓదారుస్తున్న ఒమర్ అబ్దుల్లా (ఇన్‌సెట్‌లో సయ్యద్ ఆదిల్ హుస్సేన్ షా)

కుల్గాంలో భారీ ఎన్‌కౌంటర్?

శ్రీనగర్: జమ్ముకాశ్మీర్‌లో కుల్గామ్‌లో బుధవారం భారీ ఎన్‌కౌంటర్ చోటుచేసుకున్నట్లు సమాచారం. 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' కీలక కమాండర్ భద్రతా బలగాలకు చిక్కినట్లు సమాచారం. ఈ ఎన్‌కౌంటర్‌కు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కుల్గామ్‌లోని తంగ్‌మర్గ్ ప్రాంతంలో బుధవారం మధ్యాహ్నం ప్రారంభమైన ఈ ఎన్‌కౌంటర్ రాత్రి తరువాత కూడా కొనసాగుతోందని అధికారులు తెలిపారు. భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య భీకరంగా ఎదురు కాల్పులు కొనసాగుతున్నట్లు చెప్పారు. మంగళవారం జరిగిన పహల్గాం ఘటనకు పాల్పడింది తామేనంటూ 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' ప్రకటించుకున్న సంగతి తెలిసిందే.

ఇద్దరు ఉగ్రవాదుల కాల్చివేత

బుధవారం తెల్లవారుజామున భారత్‌లోకి చొరబడేందుకు యత్నిస్తుండగా ఇద్దరు ఉగ్రవాదుల్ని భారత సైన్యం కాల్చి చంపింది. జమ్ముకాశ్మీర్ బారాముల్లా జిల్లా నియంత్రణ రేఖ వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రాంతం నుంచి మందుగుండు సామగ్రి, ఆయుధాలు, పాకిస్తాన్ కరెన్సీని భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ముష్కరుల ముఖ చిత్రాలను అధికారులు విడుదల చేశారు.

మృతుల్లో ఆరుగురు మహారాష్ట్ర వాసులు

పహల్గాంలో ఉగ్రవాదులు జరిపిన నరమేధంలో ప్రాణాలు కోల్పోయిన వారి జాబితాను అధికారులు తయారు చేశారు. ఇందులో ఐఎఎఫ్ కార్పోరల్, నేవీ, ఎక్సైజ్ అధికారితోపాటు కర్ణాటకకు చెందిన ఓ వ్యాపారవేత్త ఉన్నారు. మహారాష్ట్రకు చెందిన పర్యాటకులు ఆరుగురు ఉన్నారు. గుజరాత్, పశ్చిమ బెంగాల్‌కు చెందిన ముగ్గురేసి ఉన్నారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ నుంచి ఇద్దరేసి, కేరళ, ఒడిశా, ఉత్తరప్రదేశ్, హర్యానా, ఉత్తరాఖండ్, అరుణాచల్‌ప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్ నుంచి ఒక్కొక్కరు ఉన్నారు. ఉగ్రవాదుల కాల్పుల్లో ఒక నేపాలీ, స్థానికుడు కూడా మరణించారు.

ఉగ్రదాడిలో మరణించిన వారి వివరాలు

దిలీప్ దేసాలే – మహారాష్ట్ర, ముంబయి
హేమంత్ జోషి సుహాస్ – మహారాష్ట్ర, ముంబయి
అతుల్ శ్రీకాంత్ మోని – మహారాష్ట్ర, థానే
సంజయ్ లక్ష్మణ్ లేలే – మహారాష్ట్ర, థానే
సంతోష్ జగ్దాలే – మహారాష్ట్ర, పుణె
కస్తోబె గనోవోటే – మహారాష్ట్ర, పుణె
బిటన్ అధికారి – పశ్చిమ బెంగాల్, కోల్‌కతా
సమీర్ గుహ – పశ్చిమ బెంగాల్, కోల్‌కతా
మనీశ్ రంజన్ (ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ – పశ్చిమ బెంగాల్, పురులియాలోని ఝల్దా
మధుసూదన్ సోమిశెట్టిరావు – బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న తెలుగువారు
భరత్ భూషణ్ – కర్ణాటక, బెంగళూరు
మంజునాథరావు – కర్ణాటక, శివమొగ్గ
యతీశ్ పర్మార్ – గుజరాత్, భావ్‌నగర్
సుమిత్ పర్మార్ (యతీశ్ కుమారుడు) – గుజరాత్, భావ్‌నగర్
సైలేష్ భాయ్ కలథియా – గుజరాత్, సూరత్
వినయ్ నర్వాల్ (నేవీ అధికారి) – హర్యానా, కర్నాల్
ఎన్. రామచంద్రన్ – కేరళ, కొచ్చి
దినేశ్ అగర్వాల్ – చండీగఢ్
సయ్యద్ ఆదిల్ హుస్సేన్ షా – జమ్ముకశ్మీర్, పహల్గామ్
నీరజ్ ఉద్వానీ – ఉత్తరాఖండ్
జెఎస్ చంద్రమౌళి – ఆంధ్రప్రదేశ్, విశాఖపట్నం
సుశీల్ నాథ్యాల్ – మధ్యప్రదేశ్, ఇండోర్
ప్రశాంత్ సతపతి – ఒడిశా, బాలేశ్వర్
టేజ్ హాల్యింగ్ (ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ కార్పొరల్) – అరుణాచల్‌ప్రదేశ్, జిరో
శుభం ద్వివేదీ – ఉత్తరప్రదేశ్, కాన్పూర్
సుదీప్ సోయిపాని – నేపాల్, రూపందేహి

మంగళగిరిలో నేడు పంచాయతీరాజ్ దినోత్సవం

- పలు విభాగాల్లో అధికారులకు అవార్డులు
- పిఆర్‌అండ్ ఆర్‌డి కమిషనర్ కృష్ణతేజ

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యాన పంచాయతీరాజ్ దినోత్సవాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు ఆశాఖ కమిషనర్ కృష్ణతేజ తెలిపారు. గుంటూరు జిల్లా, మంగళగిరిలోని సికె కన్వెన్షన్‌లో జరిగే ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పాల్గొంటారని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా 994 మంది పంచాయతీరాజ్ సంస్థల ప్రజా ప్రతినిధులు, అధికారులను ఆహ్వానించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా స్వచ్ఛాంధ్ర ఉత్తమ పనితీరు కనబరిచిన అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల కలెక్టర్లకు అవార్డులు ఇవ్వనున్నారు. అదేవిధంగా ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ, క్లీన్ విలేజ్ విభాగంలో గుంటూరు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల డిపిఒలకు, అధికంగా పన్నుల వసూళ్లు చేసిన విభాగంలో చిత్తూరు, పశ్చిమ గోదావరి, తిరుపతి జిల్లాల డిపిఒలకు, 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల, వినియోగం విభాగంలో తూర్పు గోదావరి, విజయనగరం, కృష్ణా జిల్లాల జడ్‌పి సిఇఒలకు అవార్డులు అందజేస్తారు. ఐవి విభాగంలో స్టేట్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్, ప్రోగ్రాం అధికారికి, వార్షిక యాక్షన్ ప్లాన్ అమలులో స్టేట్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ ఆర్‌జిఎస్‌ఎ, స్టేట్ ప్రోగ్రాం మేనేజర్, సాలిడ్ వెల్త్ ప్రాసెసింగ్ సెంటర్‌ల నిర్వహణలో స్టేట్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ ఎస్‌డబ్ల్యుపిసి, డిప్యూటీ ఎంపిడిఒలకు అవార్డులు అందజేయనున్నారు. ఉపాధి పథకం, వాటర్ షెడ్, జల్ జీవన్ మిషన్, పల్లె పండగ (ఎన్‌ఆర్‌ఇజిఎస్), అడవితల్లి బాట, సామాజిక తనిఖీలు, ఆర్‌జిఎస్‌ఎ యాక్షన్ ప్లాన్ శిక్షణ పూర్తి తదితర అంశాల్లో పురోగతి కనబరిచిన అధికారులకు అవార్డులు అందజేయనున్నారు.

క్రీడా హబ్‌గా తిరుపతిని తీర్చిదిద్దుతాం : మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి – ఎస్‌వియు క్యాంపస్

తిరుపతిలో అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో శాప్ ఆధ్వర్యంలో క్రీడాసదుపాయాలను ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఇంటిగ్రేటెడ్ మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. తిరుపతి ఎస్‌వి ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలోని శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో చేపట్టిన ఆధునీకరణ పనులను తిరుపతి ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, శాప్ ఛైర్మన్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో అత్యాధునికరించిన ఎన్‌టిఆర్ క్రీడావికాస కేంద్రం, రైఫిల్ షూటింగ్ రేంజ్, మేజర్ ధ్యాన్‌చంద్ విగ్రహావిష్కరణ, స్విమ్మింగ్ పూల్, మల్టీపర్పస్ స్పోర్ట్స్ ఎరీనా, పికిల్‌బాల్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, విద్యుత్ లైటింగ్ అధునికీకరణ పనులను ప్రారంభించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... రూ. నాలుగు కోట్లతో శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. గత వైసిపి హయాంలో ఆడుదాం ఆంధ్ర పేరుతో రూ.120 కోట్లు కాజేశారని ఆరోపించారు. స్పోర్ట్స్ కోటా మూడు శాతాన్ని అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి మాజీ శాసనసభ్యులు సుగుణమ్మ, తిరుపతి పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు జి.నర్సింహ యాదవ్, తిరుపతి డిప్యూటీ మేయర్లు ఆర్‌సి మునికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బజాజ్ ఫిన్‌సర్వ్ ఎఎంసి నుంచి రెండు కొత్త ఫండ్స్

ముంబయి : ఆధునిక మదుపరుల కోసం నెక్స్ట్–జెన్ పాసివ్ ఫండ్‌లను ఆవిష్కరించినట్లు బజాజ్ ఫిన్‌సర్వ్ ఎఎంసి వెల్లడించింది. బజాజ్ ఫిన్‌సర్వ్ నిఫ్టీ నెక్స్ట్ 50 ఇండెక్స్ ఫండ్ మే 06వరకు తెరిచి ఉంటుందని తెలిపింది. నిఫ్టీ 50 ఇండెక్స్ ఫండ్ ఏప్రిల్ 25న తెరువబడుతుందని.. మే 9న ముగుస్తుందని పేర్కొంది. ఈ రెండు ఫండ్స్‌ల్లోనూ కనీసం రూ.500 నుంచి పెట్టుబడులకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. వీటిలో నిష్క్రమణ ఛార్జీలు ఉండవని వెల్లడించింది.

మెహుల్ చోక్సీ బెయిల్ తిరస్కరణ

న్యూఢిల్లీ : పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను వేల కోట్ల రూపాయలకు మోసం చేసిన వజ్రాల వ్యాపారి మెహుల్ చోక్సీ బెయిల్ పిటిషన్‌ను బెల్జియం కోర్టు తిరస్కరించింది. మంగళవారం కోర్టు విచారణలో తన క్లయింట్ బెయిల్ పిటిషన్ తిరస్కరణకు గురైందని ఆయన తరఫు న్యాయవాది విజయ్ అగర్వాల్ తెలిపారు. స్విట్జర్లాండ్‌కు పారిపోయేందుకు యత్నిస్తున్న చోక్సీని ఏప్రిల్ 12న బెల్జియం పోలీసులు అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను రూ.13,500 కోట్ల మేర కుంభకోణానికి పాల్పడిన చోక్సీ.. మోసం బయటపడటానికి ముందు 2018లో భారత్ విడిచి పారిపోయారు. అనంతరం 2023 నవంబర్‌లో వైద్య చికిత్స కోసం బెల్జియం చేరుకున్నారు. చోక్సీని పట్టుకునేందుకు ఏడేళ్లుగా భారత దర్యాప్తు ఏజెన్సీలు యత్నిస్తున్నాయి.

బెంగాల్‌లో ఉపాధ్యాయుల ఆందోళన తీవ్రతరం

హామీలు నెరవేర్చని డబ్ల్యూబిఎస్‌ఎస్‌సి



ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

కోల్‌కతా : సుప్రీంకోర్టు తీర్పుతో తొలగించబడిన ఉద్యోగుల్లో అర్హత, అనర్హత అభ్యర్థులతో జాబితాను ప్రకటిస్తామని హామీ ఇచ్చిన పశ్చిమ బెంగాల్ స్కూల్ సర్వీస్ కమిషన్ (డబ్ల్యూబిఎస్‌ఎస్‌సి) నేటికీ ఆ హామీ నెరవేర్చలేదు. దీంతో రాష్ట్రంలో తొలగించబడిన బోధన, బోధనేతర సిబ్బంది ఆందోళనను తీవ్రతరం చేశారు. నియామక ప్రక్రియలో అవినీతి, అక్రమాలు జరిగాయని పేర్కొంటూ 26 వేలకు పైగా ఉద్యోగులను ఈ నెల 3న సుప్రీంకోర్టు తొలగించింది. వీరిలో అర్హత కలిగిన ఉద్యోగులు డిసెంబరు 31న వరకూ తమ ఉద్యోగాల్లో కొనసాగవచ్చునని తెలిపింది.

సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఈ నెల 11న రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బ్రత్య బసు, డబ్ల్యూబిఎస్‌ఎస్‌సి ఛైర్మన్ సిద్ధార్థ మజుందార్, పశ్చిమ బెంగాల్ సెకండరీ విద్యాశాఖ బోర్డు అధ్యక్షులు రమానొజ్ గంగోపాధ్యాయ కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం తరువాత ఈ నెల 21న అర్హుల, అనర్హుల జాబితాను ప్రకటిస్తామని డబ్ల్యూబిఎస్‌ఎస్‌సి హామీ ఇచ్చింది. 21వ తేదీ దాటి రెండు రోజులైనా ఇంకా జాబితాను విడుదల చేయకపోవడంపై ఉద్యోగుల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతోంది. డబ్ల్యూబిఎస్‌ఎస్‌సి, సెకండరీ విద్యాశాఖ బోర్డు కార్యాలయాల ముందు ఆందోళనలు చేస్తున్నారు. రాత్రి కూడా వీధుల్లోనే నిద్రపోతున్నారు. దీంతో భారీస్థాయిలో పోలీసు బందోస్తును ఏర్పాటు చేశారు. ఉద్యోగులు వెనక్కితగ్గడం లేదు. 'మమ్మల్ని కాల్చి చంపండి. ఈ అవమానం, బాధతో మేం జీవించలేం' అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాబితాను వెల్లడించే వరకూ ఆందోళనను విరమించబోమని చెబుతున్నారు. ఉద్యోగులు సుజోయ్ సర్కార్, ప్రలయ్ జమాదార్, కౌసిక్ రంజన్ మండల్, మౌమిత బిశ్వాస్, శ్యాంసుందర్ ఆచార్య, అసిత్ కుమార్ ఆరి, రాజశ్రీ బసక్, అసిత్ బోయర్ నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్నారు. వీరి ఆరోగ్యం క్షీణిస్తున్నట్లు సహచరులు చెబుతున్నారు.

సుప్రీంకోర్టు తీర్పుపై బెంగాల్ ప్రభుత్వ సందిగ్ధతను తొలగించబడిన ఉద్యోగులతో పాటు, పలువురు తీవ్రంగా విమర్శిస్తున్నారు. సుప్రీంకోర్టు తీర్పును అంగీకరించిన ప్రభుత్వం ఉద్యోగుల్లో విభజనలు తేవడానికి ప్రయత్నం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

దూసుకొస్తున్న ముంబయి

వరుసగా నాల్గో గెలుపుతో మూడో స్థానంలోకి

సన్‌రైజర్స్‌పై ఏడు వికెట్ల తేడాతో విజయం



ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ బౌల్ట్ (4/26)

హైదరాబాద్: సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్ల ఆటతీరు మారలేదు. ఈ సీజన్‌లో ఆశించిన స్థాయిలో రాణించ లేకపోతున్న హైదరాబాద్ బ్యాటర్లు.. ఉప్పల్ వేదికగా ముంబయి ఇండియన్స్‌తో జరిగిన లీగ్ మ్యాచ్‌లోనూ నిరాశపరి చారు. దీంతో ముంబయి చేతిలో ఏడు వికెట్ల తేడాతో చిత్తుగా ఓడారు. తొలుత ముంబయి బౌలర్లు సమిష్టిగా రాణించడంతో 143పరుగులకే పరిమితమైన సన్‌రైజర్స్ జట్టు.. ఆ లక్ష్యాన్ని కాపాడుకోలేక 15.4ఓవర్లలో ముంబయి చేతిలో చిత్తుగా ఓడింది. ఓపెనర్ రోహిత్ శర్మ(70), సూర్యకుమార్ యాదవ్(40నాటౌట్) ముంబయి గెలుపులో కీలకపాత్ర పోషించారు. ఈ గెలుపుతో ముంబయి జట్టు వరుసగా నాల్గో విజయాన్ని సొంతం చేసుకొని పాయింట్ల పట్టికలో మూడోస్థానానికి ఎగబాకింది. తొలుత హైదరాబాద్ జట్టు 13పరుగులకే 4వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. విధ్వంసక ఓపెనర్ ట్రావిస్ హెడ్(0)ను బౌల్ట్ డకౌట్‌గా వెనక్కి పంపాడు. ఆ తర్వాత వచ్చిన ఇషాన్ కిషన్(1) సైతం దీపక్ చాహర్ బౌలింగ్‌లో వికెట్ కీపర్ రికెల్టన్ చేతికి చిక్కాడు. ఆ షాక్ నుంచి తేరుకునే లోపే.. అభిషేక్ శర్మ(8), నితీశ్ కుమార్ రెడ్డి(2)లు పేలవ షాట్లతో పెవిలియన్‌కు క్యూ కట్టారు. దాంతో, 14 పరుగులకే కమిన్స్ సేన నలుగురు ప్రధాన ఆటగాళ్ల వికెట్లు కోల్పోయింది. ఆ దశలో క్లాసెన్(71) అర్ధసెంచరీకి తోడు.. అభినవ్ మనోహర్(43) ఆదుకునే ఆడారు. దీంతో సన్‌రైజర్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8వికెట్లు కోల్పోయి 143పరుగుల నామమాత్రపు స్కోర్‌కే పరిమితమైంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ బౌల్ట్‌కు లభించింది. ఈ ఓటమితో సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్లే-ఆఫ్ ఆశలు సంక్లిష్టంగా మారాయి.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
గుజరాత్	8	6	2	12	+1.10
ఢిల్లీ	8	6	2	12	+0.65
ముంబయి	9	5	4	10	+0.67
బెంగళూరు	8	5	3	10	+0.47
పంజాబ్	8	5	3	10	+0.17
లక్నో	9	5	4	8	-0.05
కోల్‌కతా	8	3	5	6	+0.21
రాజస్తాన్	8	2	6	4	-0.63
సన్‌రైజర్స్	8	2	6	4	-1.36
చెన్నై	8	2	6	4	-1.39

ఆ:ఆడినవి; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర.:నెట్ రన్‌రేట్

స్కోర్‌బోర్డు...

సన్‌రైజర్స్ ఇన్నింగ్స్: హెడ్ (సి)నమన్ ధీర్ (బి)బౌల్ట్ 0, అభిషేక్ శర్మ (సి)విగ్నేష్ (బి)బౌల్ట్ 8, ఇషాన్ కిషన్ (సి)రికెల్టన్ (బి)చాహర్ 1, నితీశ్ కుమార్ రెడ్డి (సి)సాంట్నర్ (బి)చాహర్ 2, క్లాసెన్ (సి)తిలక్ వర్మ (బి)బుమ్రా 71, అంకిత్ వర్మ (సి)రికెల్టన్ (బి)హార్దిక్ 12, అభినవ్ మనోహర్ (హిట్‌వికెట్) (బి)బౌల్ట్ 43, కమిన్స్ (బి)బౌల్ట్ 1, హర్షల్ పటేల్ (నాటౌట్) 1, అదనం 4. (20ఓవర్లలో 8వికెట్ల నష్టానికి) 143పరుగులు. **వికెట్ల పతనం:** 1/2, 2/9, 3/13, 4/13, 5/35, 6/134, 7/142, 8/143 **బౌలింగ్:** దీపక్ చాహర్ 4-0-12-2, బౌల్ట్ 4-0-26-4, బుమ్రా 4-0-39-1, సాంట్నర్ 4-0-19-0, హార్దిక్ పాండ్యా 3-0-31-1, విగ్నేష్ 1-0-15-0.

ముంబయి ఇన్నింగ్స్: రికెల్టన్ (సి) అండ్ (బి)ఉనాద్కట్ 11, రోహిత్ శర్మ (సి)అభిషేక్ శర్మ (బి)ఈషన్ మలింగ 70, విల్ జాక్స్ (సి)మనోహర్ (బి)జీషన్ 22, సూర్యకుమార్ యాదవ్ (నాటౌట్) 40, తిలక్ వర్మ (నాటౌట్) 2, అదనం 1. (15.4ఓవర్లలో 3వికెట్ల నష్టానికి) 146పరుగులు. **వికెట్ల పతనం:** 1/13, 2/77, 3/130 **బౌలింగ్:** కమిన్స్3-0-31-0, ఉనాద్కట్ 3-0-25-1, హర్షల్ పటేల్ 3-0-21-0, ఈషన్ మలింగ 3-0-33-1, జీషన్ అన్సారి 3.4-0-36-1.

ఐపిఎల్‌లో నేడు

బెంగళూరు X రాజస్థాన్

వేదిక: బెంగళూరు; రాత్రి 7.30గంటలకు

ఇంటెల్‌లో 20వేల మందిపై వేటు..!

న్యూయార్క్ : దిగ్గజ టెక్ కంపెనీ ఇంటెల్ వేలాది మంది ఉద్యోగులకు ఉద్వాసన పలకనుందని రిపోర్టులు వస్తోన్నాయి. తమ సిబ్బందిలో దాదాపు 20 శాతానికి పైగా కోత పెట్టాలని యోచిస్తోందని బ్లూమ్‌బర్గ్ రిపోర్ట్ చేసింది. గత మార్చిలో నూతన సిఇఒగా నియమితులైన లిప్ బు తాన్ నేతృత్వంలో 20,000 కంటే ఎక్కువ మంది ఉద్యోగులను తొలగించే ప్రణాళికను ప్రకటించనుందని వెల్లడించింది. 2024లో 19 బిలియన్ డాలర్ల నష్టాలను ఎదుర్కొన్న నేపథ్యంలో పొదుపు చర్యలపై దృష్టి పెడుతోందని సమాచారం. ఇంతక్రితం 2024 ఆగస్టులో 15,000 మంది ఉద్యోగులపై వేటు వేసింది. దీంతో కంపెనీ మొత్తం సంఖ్య 1,08,900కు చేరింది. ఇంతక్రితం 2023లో ఇంటెల్ మొత్తం ఉద్యోగుల సంఖ్య 124,800 ఉండేది.

వచ్చే రెండేళ్లలో రూ.1500 కోట్ల టర్నోవర్ లక్ష్యం

- తెలుగు రాష్ట్రాల్లో 85 శాతం మార్కెట్ వాటా
- గోద్రేజ్ సెక్యూరిటీ సొల్యూషన్స్ వెల్లడి

హైదరాబాద్ : వచ్చే రెండేళ్లలో రూ.1500 కోట్ల టర్నోవర్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని గోద్రేజ్ ఎంటర్‌ప్రైజెస్ గ్రూపులో భాగమైన సెక్యూరిటీ సొల్యూషన్స్ బిజినెస్ హెడ్ పుష్కర్ గోఖలే తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో ఆయన నూతన స్మార్ట్ సెక్యూరిటీ లాకర్ల శ్రేణిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుష్కర్ మీడియాతో మాట్లాడుతూ.. గత ఆర్థిక సంవత్సరంలో రూ.1100 కోట్ల రెవెన్యూ సాధించామని.. ఈ ఏడాది రూ.1200 కోట్లు అంచనా వేస్తున్నామన్నారు. తెలుగు రాష్ట్రాల్లో రూ.130 కోట్ల టర్నోవర్‌ను నమోదు చేశామన్నారు. తమ సంస్థ దాదాపు 70 ఎస్‌కెయులను విక్రయిస్తోందన్నారు. హోమ్ లాకర్ సెగ్మెంట్‌కి సంబంధించి జాతీయ స్థాయిలో కంపెనీకి సుమారు 75 శాతం మార్కెట్ వాటా ఉందన్నారు. ఎపి, తెలంగాణలో 80 శాతానికి పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. నివాస లాకర్ల ధరలు రూ.8,000 నుంచి ప్రారంభమవుతాయన్నారు.

ఫిడే మహిళల గ్రాండ్‌ప్రి చెస్ టోర్నీ విజేత కోనేరు హంపి



పూణే: ఫిడే మహిళల గ్రాండ్ ప్రి చెస్ టోర్నీ 2024-25 టైటిల్‌ను తెలుగు తేజం, గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి గెలుచుకుంది. పుణె వేదికగా బుధవారం జరిగిన ఫైనల్ రౌండ్‌లో బల్గేరియాకు చెందిన నుర్గుయిల్ సలిమోవాపై తలపడిన హంపి విజయం సాధించింది. దీంతో హంపికి ఒక పాయింట్ లభించింది. మరోవైపు చివరి రౌండ్ గేమ్ జు జినర్ (చైనా) కూడా విజయం సాధించడంతో హంపి అగ్రస్థానంలో కొనసాగింది. జు జినర్ ఫైనల్ రౌండ్‌లో రష్యాకు చెందిన పొలినా షువలోవాపై గెలుపొందింది. దీంతో 9రౌండ్‌లు ముగిసేసరికి వీరిద్దరూ 7 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు. టై-బ్రేక్ ఆధారంగా హంపి టైటిల్ విజేతగా నిలిచింది. మరో తెలుగమ్మాయి ద్రోణవల్లి హారిక.. ముంగంతూల్ బతుయాగ్ (మంగోలియా)తోబీ వైశాలి.. సలోమ్ మెలియా (జార్జియా)తోబీ దివ్య దేశ్‌ముఖ్.. ఎలీనా కష్లిన్‌స్కాయా (రష్యా)తో తమ తమ చివరి గేమ్‌లను డ్రాగా ముగించారు.

బంగ్లాకు జింబాబ్వే ఝలక్

తొలిటెస్ట్‌లో మూడు వికెట్ల తేడాతో గెలుపు



సైహెట్(బంగ్లాదేశ్) : టెస్టు క్రికెట్‌లో పసికూన జింబాబ్వే జట్టు బంగ్లాదేశ్‌కు ఝలక్ ఇచ్చింది. తొలిటెస్ట్‌లో బంగ్లాదేశ్‌పై 3 వికెట్ల తేడాతో జింబాబ్వే జట్టు విజయం సాధించింది. ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్ అర్ధసెంచరీకి తోడు జింబాబ్వే పేసర్ బ్లెస్సింగ్ ముజరబ్బాని 9 వికెట్లతో రాణించాడు. 147 పరుగుల లక్ష్యాన్ని జింబాబ్వే జట్టు ఏడు వికెట్లు కోల్పోయి ఛేదించింది. దీంతో రెండు టెస్టుల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ముజరబ్బాని 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికయ్యాడు. తొలి ఇన్నింగ్స్‌లో మొమినుల్ హక్(50), కెప్టెన్ నజ్ముల్ హుసేన్ శాంటో(40)ల పోరాటంతో బంగ్లాదేశ్ 191కే ఆలౌటయ్యింది. అనంతరం జింబాబ్వే. ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్(57), సియాన్ విలియమ్స్(59) అర్ధ సెంచరీలతో చెలరేగారు. దీంతో జింబాబ్వే తొలి ఇన్నింగ్స్‌లో 273 పరుగులు కొట్టి 82 పరుగుల ఆధిక్యం సాధించింది. ఇక రెండో ఇన్నింగ్స్‌లో బంగ్లా బ్యాటర్లు రాణించడంతో 255పరుగులకు ఆలౌటైంది. దీంతో జింబాబ్వే జట్టు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత పోను 147పరుగులు చేయాల్సి వచ్చింది. ఛేదనలో జింబాబ్వే బ్యాటర్లు అద్భుతంగా ఆడారు. ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్(54), బెన్ కరాన్ (44)లు తొలి వికెట్‌కు 95 పరుగులు జోడించి పటిష్ట స్థితిలో నిలిపారు. ఓవైపు వికెట్లు పడుతున్నావెస్లీ మధీవెరె(19 నాటౌట్), రిచర్డ్ గరవ(4 నాటౌట్)లు జట్టును విజయ తీరాలకు చేర్చారు. రెండో టెస్టు ఏప్రిల్ 28న చిట్టోగ్రామ్ వేదికగా జరగనుంది.



జులై 4న 'తమ్ముడు' విడుదల


నితిన్ కథానాయకుడిగా దిల్‌రాజ్ నిర్మిస్తున్న చిత్రం 'తమ్ముడు'. ఈ సినిమా జులై 4న విడుదల కానుంది. మార్చి 28న వచ్చిన 'రాబిన్‌హుడ్' సినిమా నిరాశకు గురిచేసింది. గతంలో నితిన్, దర్శకుడు వెంకీ కుడుముల కాంబోలో వచ్చిన 'భీష్మ' విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ క్రమంలో 'తమ్ముడు' సినిమాపైనే నితిన్ ఆశలు పెట్టుకున్నారు. గతంలో రాజు నిర్మించిన 'దిల్' అప్పట్లో ఘన విజయాన్ని సాధించింది. ఆ తర్వాత వీరిద్దరి కాంబోలో 'శ్రీనివాస కళ్యాణం' మెప్పించలేకపోయింది. దీంతో 'తమ్ముడు' సినిమాను సక్సెస్ చేయటానికి అవసరమైన కసరత్తులను దిల్‌రాజ్ బృందం చేస్తోంది. ఈ సినిమాను దిల్‌రాజ్ బ్యానర్‌లోనే ఎంసిఎ, వకీల్‌సాబ్ చిత్రాలను రూపొందించిన శ్రీరామ్ వేణు తెరకెక్కిస్తున్నారు. బలగం ఫేమ్ వేణు, నితిన్ కాంబోలోనే దిల్‌రాజు 'ఎల్లమ్మ' చిత్రాన్ని నిర్మించబోతున్నారు.

మానవాళికి మేలు కలిగించే రీతిలో ఎఐ వినియోగం : మంత్రి పార్థసారధి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) సాంకేతికతను మానవాళికి మేలు కలిగించే రీతిలో మీడియా వినియోగించుకోవాలని సమాచార, పౌర సంబంధాలశాఖ మంత్రి కె పార్థసారధి తెలిపారు. పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా 38వ పిఆర్‌డే వేడుకలు విజయవాడలోని పిబి సిద్ధార్థ కళాశాలలో బుధవారం జరిగాయి. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి పార్థసారధి మాట్లాడుతూ.. సోషల్ మీడియా మితిమీరిన వినియోగం కూడా సరైంది కాదని అభిప్రాయపడ్డారు. సోషల్ మీడియా ధోరణులు చాలా దారుణంగా ఉన్నాయని, దీనిని అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సాంకేతికతను వినియోగించుకోవడంలో ఎంతో ముందంజలో ఉన్నారని తెలిపారు. విజన్ పేరుతో దేశ, రాష్ట్రం బాగు కోసం ఆలోచించే వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రకేసరి యూనివర్సిటీ విసి డివిఆర్ మూర్తి, విజయవాడ డివిజన్ సౌత్ సెంట్రల్ పిఆర్‌ఒ నస్రత్ ఎం మండ్రూప్కర్, పిఆర్‌ఎస్‌ఐ అమరావతి చాప్టర్ ఛైర్మన్ అనిత్, సమాచార, పౌరసంబంధాలశాఖ జాయింట్ డైరెక్టర్ కిరణ్, పిఆర్‌ఎస్‌ఐ అమరావతి చాప్టర్ వైస్ ఛైర్మన్ జె రాజేంద్రకుమార్, కార్యదర్శి ఎమ్‌డి కె పార్థసారధి, జాయింట్ సెక్రటరీ పి బషీర్, ట్రెజరర్ ఓలివా ఎరమల తదితరులు పాల్గొన్నారు.

కథే ప్రధాన హీరో..



త్రినాథరావు నక్కిన నిర్మాణంలో 'చౌర్య పాఠం' చిత్రం తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో ఇంద్ర రామ్‌ను హీరోగా పరిచయం చేస్తున్నారు. నిఖిల్ గొల్లమారి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఏప్రిల్ 25న ఈ సినిమా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో ఇంద్ర రామ్ సినిమా విశేషాలను పంచుకున్నారు. ' ఈ సినిమాలో కథే ప్రధాన హీరో. ఇది సాధారణ చిత్రం కాదు. కథా రచయిత కార్తిక్ తండ్రి ఐజీగా పనిచేశారు. ఆయన ఒక వాస్తవ సంఘటనను ఆధారంగా చేసుకుని ఈ కథను రూపొందించారు. ఒక వీధిలో బ్యాంక్ ఉంటే, మరో వీధిలో గదిని అద్దెకు తీసుకొని, అక్కడ నుంచి టన్నెల్ తవ్వి బ్యాంక్‌లోకి చొరబడిన ఘటన జరిగింది. ఇలాంటి సినిమాకు సరిపడే రిఫరెన్స్‌లు సులభంగా దొరకవు. ఆర్ట్ డైరెక్టర్ నాగేంద్ర ఈ చిత్రంలో టన్నెల్స్‌ను సృష్టించడానికి చాలా శ్రద్ధ తీసుకున్నారు. సెన్సార్ సభ్యులు సినిమాను ప్రశంసించడం చాలా సంతోషాన్ని ఇచ్చింది' అని చెప్పారు.



ఉగ్రవాదానికి మతం లేదు

జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలోని పహల్గాంలో జరిగిన భీకర ఉగ్రదాడిలో 28 మంది పర్యటకులు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ దాడిని సినీ ప్రముఖులు తీవ్రంగా ఖండిస్తున్నారు. తాజాగా ఈ ఘటనపై విరాటపర్వం దర్శకుడు వేణు వుడుగుల ఎక్స్ వేదికగా స్పందించారు. 'పహల్గాములో విహారయాత్రకు వెళ్లినవారు తిరిగి రాలేదు. ఇది కేవలం రాజకీయ సమస్య కాదు, ఇది మానవతా సంక్షోభం. ప్రశాంతంగా జీవించాలనుకున్న వారి హృదయాలను తుపాకులు ధ్వంసం చేశాయి. తీవ్రవాదానికి మతం లేదు, భౌగోళిక సరిహద్దులు లేవు. ఎక్కడ మనిషి ప్రాణం గణాంకంగా మారిపోతుందో, అక్కడ మన మౌనం కూడా నిశ్శబ్దమైన నేరంగా మారుతుంది. జాతి గౌరవం తుపాకీ ద్వారా కాదు. దయతో, మానవత్వంతో, బాధితుల పట్ల కలిగిన స్పందనతో నిలబడుతుంది. ఇది కన్నీటిని మాటలుగా, మౌనాన్ని పోరాటంగా మార్చే కాలం' అంటూ వేణు వుడుగుల సోషల్ మీడియాలో పోస్టు రాశారు.

పర్యాటకులపై దాడికి సినీ ప్రముఖుల ఖండన



జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన దాడిని సినీరంగ ప్రముఖులు తీవ్రంగా ఖండించారు. తనికెళ్ల భరణి, అనుపమ్‌ఖేర్ పర్యాటక ప్రాంతంలో ఇలాంటి ఘటన జరగటం బాధాకరమని పేర్కొన్నారు. హిట్ 3 సినిమా షూటింగ్ 200 మందితో ఇక్కడే చేశామని కథానాయకుడు నాని పేర్కొన్నారు. మినీ స్విట్జర్లాండ్‌గా పేర్గాంచిన బైసరమ్ ప్రాంతంలో ఇది చోటుచేసుకోవటం బాధాకరమని చిరంజీవి, మోహన్‌బాబు, కమల్‌హాసన్, మోహన్‌లాల్, అక్షయ్‌కుమార్, సోనూసూద్, నాగబాబు, రాధికా శరత్‌కుమార్, సంయుక్త, అనన్య నాగళ్ల, సుమ కనకాల, రామ్‌చరణ్; అల్లు అర్జున్, జూనియర్ ఎన్టీఆర్, సాయిధరమ్‌తేజ్, మంచు విష్ణు, మంచు మనోజ్, నిఖిల్ సిద్ధార్థ్, బెల్లంకొండ సాయి శ్రీనివాస్, నాగశౌర్య, దర్శకుడు బాబీ, నిర్మాత ప్రసాద్ వి పొట్లూరు, సురేష్‌గోపి తదితరులు పేర్కొన్నారు.

మేధాపాట్కర్‌పై నాన్‌బెయిల్‌బుల్ వారెంట్

న్యూఢిల్లీ : ప్రస్తుత ఢిల్లీ ఎల్‌జి వికె సక్సేనా 24 ఏళ్ల కింద నమోదు చేసిన ఒక పరువునష్టం కేసులో ప్రముఖ పర్యావరణ ఉద్యమవేత్త మేధా పాట్కర్‌పై ఢిల్లీ కోర్టు బుధవారం నాన్‌బెయిల్‌బుల్ వారెంట్ జారీ చేసింది. అదనపు సెషన్స్ జడ్జి విశాల్ సింగ్ ఈ వారెంట్ జారీ చేశారు. ఈ నెల 8న జరిగిన ఈ కేసు గత విచారణలో మేధాపాట్కర్ ఏప్రిల్ 23న (బుధవారం) కోర్టుకు హాజరుకావాలని, ప్రొబేషన్ బాండ్స్, రూ.లక్ష జరిమానా చెల్లించాలని ఆదేశించారు. బుధవారం 70 ఏళ్ల మేధాపాట్కర్ కోర్టుకు హాజరుకాలేకపోయారు. దీంతో జడ్జి 'ఢిల్లీ పోలీస్ కమిషనర్ ద్వారా పాట్కర్‌పై నాన్‌బెయిల్‌బుల్ వారెంట్ జారీ చేస్తు' ఆదేశాలు ఇచ్చారు. తదుపరి విచారణ మే 3 నాటికి మేధాపాట్కర్ తమ ఆదేశాలను పాటించాలని జడ్జి స్పష్టం చేశారు. నర్మదా బచావో ఉద్యమం సమయంలో గుజరాజ్‌లో ఒక ఎన్‌జిఒకు సక్సేనా చీఫ్‌గా ఉన్నారు. ఆ సమయంలో తన పరువునకు నష్టం కలిగించే విధంగా మేధాపాట్కర్ వ్యాఖ్యలు చేశారని సక్సేనా ఈ పరువు నష్టం కేసు దాఖలు చేశారు.

సింధు జలాల ఒప్పందం నిలిపివేత

- పాక్‌పౌరులు 48గంటల్లోగా దేశాన్ని వీడాలి
- అత్తారి చెక్‌పోస్టు మూసివేస్తాం
- పహల్గాం దాడి నేపథ్యంలో భారత్ సంచలన నిర్ణయాలు
- ప్రధాని నేతృత్వంలో భద్రతా కేబినెట్ కమిటీ భేటీ


ప్రధాని అధ్యక్షతన జరిగిన భద్రతా కేబినెట్ కమిటీ భేటీ దృశ్యం

న్యూఢిల్లీ : పహల్గాం దాడి నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన భద్రతా కేబినెట్ కమిటీ భేటీ (సిసిఎస్) బుధవారం సమావేశమై భద్రతా పరిస్థితులను సమీక్షించింది. ఢిల్లీలోని ప్రధాని నివాసంలో జరిగిన ఈ ఉన్నత స్థాయి సమావేశానికి హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, విదేశాంగ మంత్రి జై శంకర్ ప్రభృతులు హాజరయ్యారు. దాడి అనంతరం నెలకొన్న పరిస్థితులు, ఇతర పరిణామాలను సుదీర్ఘంగా ప్రధాని వారితో చర్చించారు. అనంతరం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

తక్షణమే అమల్లోకి వచ్చేలా సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయాలని భారత్ నిర్ణయించింది. అలాగే అత్తారి చెక్‌పోస్టును కూడా వెంటనే మూసివేయాలని నిర్ణయించారు. పాక్ జాతీయులెవరూ కూడా భారత్‌లో పర్యటించడానికి అనుమతించరాదని, భారత్‌లోని పాక్ జాతీయులు 48గంటల్లోగా దేశం వీడి వెళ్లాలని పేర్కొంది. అలాగే పాకిస్తాన్ హై కమిషన్‌లోని సైనిక, నావికాదళ, ఆర్మీ సలహాదారులను అవాంఛనీయ వ్యక్తులుగా ప్రకటించింది.

ఇస్లామాబాద్‌లోని భారత హై కమిషన్ కార్యాలయం నుండి త్రివిధ దళాలకు చెందిన ముగ్గురు సలహాదారులను, ఐదుగురు సపోర్ట్ సిబ్బందిని ఉపసంహరించుకుంది. ఎంబసీల్లోని సపోర్ట్ సిబ్బందిని 30కి తగ్గించనుంది. ప్రస్తుతం ఈ సంఖ్య 55గా వుంది. ఇది మే 1నుండి అమల్లోకి వస్తుంది. కీలకమైన ప్రాంతాలు సహా అన్ని చోట్ల అప్రమత్తత పాటించాల్సిందిగా బలగాలను ఆదేశించింది. ఈ ఉగ్ర దాడికి బాధ్యులైన వారిని తక్షణమే పట్టుకుని, శిక్షించాలని, దీని వెనుక సూత్రధారులను కూడా అదుపులోకి తీసుకోవాలని తీర్మానించింది. అన్ని బలగాలు అప్రమత్తంగా వుండాలని ఆదేశించింది.

అనంతరం సిసిఎస్ సమావేశం నిర్ణయాలను విదేశాంగ శాఖ వర్గాలు మీడియాకు తెలిపాయి. కేంద్ర పాలిత ప్రాంతంలో విజయవంతంగా ఎన్నికలను నిర్వహించిన నేపథ్యంలో ఈ దాడి జరిగిందని విదేశాంగ కార్యదర్శి వ్యాఖ్యానించారు. అంతకుముందు దాడి వార్త తెలియగానే ప్రధాని మోడీ సౌదీ అరేబియా పర్యటనను కుదించుకుని వచ్చిన వెంటనే విమానాశ్రయంలోనే సమావేశమై భద్రతా పరిస్థితులను సమీక్షించారు. ఈ సమావేశానికి విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ కూడా హాజరయ్యారు. పహల్గాంలో దాడి గురించి వారు ప్రధానికి వివరించారు. మరోవైపు హోం మంత్రి అమిత్ షా మంగళవారం సాయంత్రమే శ్రీనగర్ చేరుకొని అక్కడ భద్రతా చర్యలను సమీక్షిస్తున్నారు.

పహల్గాం ఘటన వెనుక ఏడుగురు ఉగ్రవాదులు

- వారిలో ఇద్దరు స్థానికులే
- ముగ్గురి ఊహాచిత్రాలు విడుదల
- సమాచారం అందిస్తే రూ.20లక్షల బహుమతి
- బాధితులను పరామర్శించిన హోం మంత్రి


మృతదేహాల వద్ద నివాళులర్పిస్తున్న అమిత్ షా

న్యూఢిల్లీ : పహల్గాంలోని బైసరన్‌లో ప్రకృతి అందాలు వీక్షిస్తున్న పర్యాటకులపై జరిపిన దాడిలో ఏడుగురు ఉగ్రవాదులు పాల్గొన్నారని, వీరిలో నలుగురైదుగురు పాకిస్తానీయులేనని అధికారులు తేల్చారు. దాడికి పాల్పడిన వారిలో ఇద్దరు స్థానిక ఉగ్రవాదులు వున్నట్లుగా ప్రత్యక్షసాక్షులు, ఇంటెలిజెన్స్ నివేదికలు సూచిస్తున్నాయని అధికార వర్గాలు తెలిపాయి. వారి వివరాలు ఇంకా తెలియరాలేదు. 2018లో ఇద్దరు కాశ్మీరీలు పాక్ వెళ్లి అక్కడ శిక్షణ తీసుకుని ఈ దాడికి పాల్పడినట్లుగా భావిస్తున్నారు. 'ఉగ్రవాదులు మాట్లాడిన ఉర్దూ భాషను పాకిస్తాన్‌లోని కొన్ని ప్రాంతాలలో వాడతారు. వారు కాశ్మీర్‌లోని ఏ ప్రాంతానికి చెందిన వారో ఇంకా తెలియలేదు' అని భద్రతా సంస్థకు చెందిన ఓ అధికారి చెప్పారు. ఉగ్రవాదులు కాశ్మీర్‌లోకి ఎలా ప్రవేశించారో, వారు అక్కడ ఎంతకాలం నుండి ఉంటున్నారో అన్న విషయాలు ఇంకా తెలియరాలేదు.

దాడికి పాల్పడిన ఉగ్రవాదులలో ముగ్గురి ఊహా చిత్రాలను అధికారులు విడుదల చేశారు. వారికి సంబంధించిన సమాచారం అందిస్తే రూ.20 లక్షల చొప్పున రివార్డు అందజేస్తామని ప్రకటించారు. దాడికి పాల్పడిన ఉగ్రవాదులందరూ పిర్ పంజాల్ పర్వత శ్రేణుల ఎగువ ప్రాంతాలకు తప్పించుకుని వెళ్ళిపోయి వుంటారని అనుమానిస్తున్నారు.

దీంతో సైన్యం, పారామిలటరీ దళాలు, జమ్మూ కాశ్మీర్ పోలీసులు తీవ్రంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. ఇదిలావుండగా మంగళవారం సాయంత్రమే శ్రీనగర్ చేరుకున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా బైసరన్‌లో పర్యటించి దాడి వివరాలు తెలుసుకున్నారు. భద్రతా సమీక్షా సమావేశాలు కూడా నిర్వహిస్తున్నారు. దాడిలో గాయపడిన బాధితులను బుధవారం పరామర్శించారు.

ఉగ్రదాడిలో ఇద్దరు ఎపి వాసులు మృతి

ప్రజాశక్తి- యంత్రాంగం

జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారిలో మన రాష్ట్రానికి చెందిన ఇద్దరు ఉన్నారు. వారిలో ఒకరిది శ్రీకాకుళం జిల్లా కాగా, రిటైర్‌మెంట్ అనంతరం విశాఖలో నివసిస్తున్నారు. మరొకరు నెల్లూరు జిల్లాకు చెందిన వారు. వీరి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. మృతుల కుటుంబభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... శ్రీకాకుళం జిల్లాకు చెందిన జరజాపు సత్య చంద్రమౌళి ప్రస్తుతం విశాఖలోని బీచ్ రోడ్డులో నివాసం ఉంటున్నారు. ఈ నెల 18న ఆయన పుట్టినరోజు కావడంతో విశాఖకు చెందిన మూడు కుటుంబాలతో కలిసి ఈ నెల 16న ట్రావెల్ ఏజెంట్స్ ద్వారా జమ్మూ కాశ్మీర్ విహారయాత్రకు వెళ్లారు. షెడ్యూల్ ప్రకారం 25న విశాఖకు వారు తిరిగి రావాల్సి ఉంది. టూర్‌కు వెళ్లిన వారిలో చంద్రమౌళితోపాటు అప్పన్న, శశిధర్ కుటుంబాలు ఉన్నాయి. మంగళవారం మధ్యాహ్నం 1:30 గంటల ప్రాంతంలో వారు పహల్గాం చేరుకున్నారు. ఆ సమయంలోనే ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డారు. కాల్పుల నుంచి తప్పించుకునేందుకు చంద్రమౌళి ప్రయత్నించినా ఆయనను వెంటాడి చంపినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. చంద్రమౌళి మృతి సమాచారం తెలుసుకున్న ఆయన కుటుంబసభ్యులు మంగళవారం రాత్రి శ్రీనగర్ బయలుదేరి వెళ్లారు.


మధుసూదనరావు


చంద్రమౌళి

ఆయనకు భార్య నాగమణి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలు అమెరికాలో ఉంటున్నారు. గురువారం సాయంత్రానికి వారు విశాఖ చేరుకునే అవకాశం ఉంది. శుక్రవారం చంద్రమౌళి అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

ఉగ్రదాడికి బలైన వారిలో నెల్లూరు జిల్లా కావలికి చెందిన సోమిశెట్టి మధుసూదనరావు(45) ఉన్నారు. ఆయన బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. భార్య, పిల్లలతో కలిసి జమ్మూకాశ్మీర్‌కు వెళ్లారు. ఉగ్రవాదుల దాడిలో చనిపోయారు.. ఆయన శరీరంలో 42 బుల్లెట్లు దిగబడినట్లు సమాచారం. మధుసూదనరావుకు భార్య కామాక్షి, కుమార్తె మేధు, కుమారుడు దత్తు ఉన్నారు. ఆయన భౌతికకాయం విమానంలో చెన్నయ్‌కి, అక్కడ నుంచి కావలికి రానుంది.

ఉగ్ర దాడి పట్ల గవర్నర్ విచారం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జమ్మూకాశ్మీర్ పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడుల పట్ల గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉగ్ర దాడిలో మరణించిన రాష్ట్రానికి చెందిన జెఎస్ చంద్రమౌళి, ముధుసూదన్ కుటుంబ సభ్యులకు గవర్నర్ తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. పర్యాటకులపై జరిగిన దాడిని గవర్నర్ ఖండించారు. సమాజంలో ఇటువంటి దుశ్చర్యలకు స్థానం లేదని, నేరస్తులకు కఠిన శిక్షలు విధించాలన్నారు.

పహల్గామ్ ఉగ్రదాడిని ఖండించిన ఐలు

పహల్గామ్ ఉగ్రదాడిని అఖిల భారత న్యాయవాదుల సంఘం (ఐలు) తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఐలు జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు సుంకర రాజేంద్రప్రసాద్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ ప్రాంత ప్రజలకు, పర్యాటకులకు భద్రత, రక్షణకు కేంద్ర, ఆ రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు.

దిగివస్తోన్న అమెరికా

- చైనాపై సుంకాలను తగ్గిస్తామన్న ట్రంప్
- బీజింగ్‌తో స్నేహపూర్వక సంబంధాలకు ఓకే
- త్వరలోనే రష్యా, ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు



వాషింగ్టన్ : ప్రపంచ దేశాలపై ఏకదాటిగా టారిఫ్‌లను పెంచిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ క్రమంగా దిగివస్తున్నారు. చైనాపై వేసిన అసంబద్ధ టారిఫ్‌లను వెనక్కి తీసుకోనున్నట్లు స్పష్టమైన సంకేతాలిచ్చారు. చైనా ఉత్పత్తులపై 145 శాతం సుంకాలను అమలు చేస్తున్నారు. వీటిని 245 శాతానికి పెంచుతున్నట్లు ఓ దశలో హెచ్చరించారు. దీనిపై చైనా ధీటుగా బదులివ్వడంతో రెండు అగ్రదేశాల మధ్య వాణిజ్య యుద్ధం తీవ్రతరమైంది. ట్రంప్ చర్యలపై అమెరికాలోనూ తీవ్ర ఆందోళనలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే టారిఫ్‌లపై తాజాగా ట్రంప్ కీలక ప్రకటన చేశారు. చైనా నుంచి దిగుమతి చేసుకొనే వస్తువులపై సుంకాలను భారీగా తగ్గిస్తామని చెప్పారు. అలాగని సున్నా మాత్రం కావని పేర్కొన్నారు.

భవిష్యత్తులో చైనాతో జరగనున్న చర్చల్లో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగించడానికి ప్రయత్నిస్తామని ట్రంప్ తెలిపారు. ఇందుకోసం బీజింగ్ తమతో ఓ అంగీకారానికి రావాల్సి ఉందని, ఒప్పందం జరగాల్సి ఉందని అన్నారు. ప్రస్తుతం తాము చైనాతో జరుపుతున్న వాణిజ్య చర్చలు సజావుగానే జరుగుతున్నాయని వెల్లడించారు. ఎందుకంటే ప్రతీ దేశం అమెరికా మార్కెట్‌లో ఉండాలని కోరుకుంటుందని చెప్పారు. చైనాతో తాము ఒప్పందాన్ని కుదుర్చుకోవడానికి ఎదురు చూస్తున్నామని తెలిపారు. చైనాపై విధించిన సుంకాల్లో తగ్గింపులు ఉండొచ్చని ట్రంప్ వ్యాఖ్యలకు ముందే ఆ దేశ ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ సంకేతాలు ఇచ్చారు.


ఈ వారంలోనే శాంతి ఒప్పందం

మరోవైపు రష్యా, ఉక్రెయిన్ అంశంలో ట్రంప్ సానుకూల ప్రకటన చేశారు. ఈ వారంలోనే రష్యా, ఉక్రెయిన్ శాంతి ఒప్పందానికి వస్తాయని ట్రంప్ తెలిపారు. దీంతో యుద్ధం ఆగిపోనుందన్నారు. దీనికి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సానుకూలంగా స్పందించారు. శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నామని ఆయన ప్రకటించారు. యుద్ధం ప్రారంభమైన తర్వాత పుతిన్ ఇలాంటి ప్రకటన చేయడం ఇదే తొలిసారి.

భారత్‌కు బాసటగా వుంటాం !

- తీవ్రవాదంపై పోరులో చేతులు కలుపుదాం
- పహల్గాం దాడిని ఖండించిన ట్రంప్, పుతిన్ సహా పలువురు నేతలు





వాషింగ్టన్, మాస్కో : జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు అమానుషంగా కాల్పులు జరుపుతూ 28మంది పర్యాటకులను పొట్టన బెట్టుకున్న ఉగ్ర దాడిని ప్రపంచ నేతలందరూ తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాద దాడులు ఎక్కడ జరిగినా, ఎవరు పాల్పడినా ఖండించాల్సిందేనని, దారుణమైన ఈ నేరాలను ఉపేక్షించరాదని, బాధ్యులకు తగిన శిక్ష పడాల్సిందేనని అమెరికా అధ్యక్షుడు ట్రంప్, రష్యా నేత పుతిన్ సహా పలువురు నేతలు పేర్కొన్నారు. తీవ్రవాదానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో తామంతా భారత్‌కు బాసటగా వుంటామని వారు హామీలిచ్చారు. భారత ప్రభుత్వానికి పూర్తి సంఘీభావాన్ని ప్రకటించారు.

మోడీకి ట్రంప్ ఫోన్

ప్రధాని మోడీకి ట్రంప్ ఫోన్ కాల్ చేసి వివరాలు కనుక్కొన్నారు. హేయమైన ఈ దాడి సూత్రధారులను పట్టుకునేందుకు భారత్‌కు పూర్తి స్థాయిలో మద్దతును అందిస్తామని హామీ ఇచ్చారు. మృతులకు సంతాపం తెలియజేస్తూ, వారి కుటుంబాలకు సానుభూతి తెలియచేశారని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. కాశ్మీర్‌లో జరిగిన దాడి వార్త మనసును తీవ్రంగా కలిచివేసిందని అంతకుముందు ట్రంప్ సోషల్‌మీడియాలో పేర్కొన్నారు. ప్రస్తుతం భారత్‌లో పర్యటనలో వున్న అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ దంపతులు కూడా ఈ దాడి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ విచారకర సమయంలో తమ ఆలోచనలన్నీ బాధితుల గురించేనని పేర్కొన్నారు.

భారత్‌తో కలిసి పోరాడతాం : పుతిన్

పహల్గాం దాడిని ఖండిస్తూ రష్యా నేత పుతిన్, ఇటువంటి దారుణమైన నేరాలకు పాల్పడిన వారికి కచ్చితంగా తగిన శిక్ష పడాల్సిందేనని అన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్మకు, ప్రధాని మోడీకి ఈ మేరకు సందేశాలు పంపారు. ఈ దాడిలో అమాయకులు మృతి చెందడం పట్ల తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేశారు. తీవ్రవాదం ఏ రూపంలో వున్నా దానిపై పోరు తప్పదని, ఆ పోరాటంలో భారత్‌తో కలిసి పనిచేయడానికి రష్యా నిబద్ధతతో వుందని పుతిన్ చెప్పారు. మృతులకు నివాళి అర్పిస్తూ, వారి కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

తీవ్రంగా ఖండిస్తున్నాం : చైనా

జమ్మూకశ్మీర్‌లో పర్యాటకులపై దాడి వార్త దిగ్భ్రాంతి కలిగించిందని చైనా తెలిపింది. దాడిని ఖండిస్తున్నట్లు తెలిపింది. మంగళవారం జరిగిన దాడిపై చైనా విదేశీ వ్యవహారాల ప్రతినిధి గువో జియాకున్ బుధవారం బీజింగ్‌లో మాట్లాడారు. ఉగ్రదాడికి సంబంధించిన రిపోర్టులను చైనా గమనించిందని, ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. అన్ని రకాల ఉగ్రవాదాన్ని చైనా దృఢంగా వ్యతిరేకిస్తుందని చెప్పారు. మృతులకు నివాళి అర్పిస్తూ, వారి కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

భారత్‌కు ఎల్లప్పుడూ అండగా ఉంటాం : శ్రీలంక

ఉగ్రదాడి నేపథ్యంలో భారత్‌కు శ్రీలంక తన మద్దతును ప్రకటించింది. ఉగ్రవాదంపై పోరాటంలో భారత్‌కు శ్రీలంక ఎప్పుడూ తోడుగా ఉంటుందని శ్రీలంక విదేశాంగ మంత్రిత్వ శాఖ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది.బాధితుల కుటుంబాలకు సంతాపాన్ని తెలియజేసింది. గాయపడిన వారంతా త్వరగా కోలుకోవాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు తెలిపింది.

పలువురు ప్రముఖుల ఖండన

తీవ్రవాదులు పాల్పడిన ఈ హేయమైన దాడిని యురోపియన్ యూనియన్ విదేశీ వ్యవహారాల ప్రతినిధి కాజా కల్లాస్ కూడా తీవ్రంగా ఖండించారు. జర్మనీ విదేశాంగ కార్యాలయం స్పందిస్తూ అమాయకులను చంపడం అర్ధరహితమని వ్యాఖ్యానించింది. ఇటలీ ప్రధాని జార్జియా మెలొని ఈ దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ విషాద సమయంలో భారత ప్రజలకు పూర్తి సంఘీభావాన్ని ప్రకటించారు. ఇజ్రాయిల్ ప్రధాని బెంజామిన్ నెతన్యాహు కూడా తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టారు. యుఎఇ విదేశంగ శాఖ కూడా దాడిని తీవ్రంగా ఖండించింది. తీవ్రవాద చర్యలు ఏ రూపంలో వున్నా ఖండించాల్సిందేనని స్పష్టం చేసింది. ప్రాంతీయ శాంతి భద్రతల పట్ల నిబద్ధతను పునరుద్ఘాటించింది. ఫ్రాన్స్, జర్మనీ దేశాలు కూడా భారత్‌లో దాడిని ఖండించాయి. ఈ కష్ట సమయంలో భారత్ వెంట ఉంటామని తెలిపాయి.

గాజాలో డయాలసిస్ రోగుల అవస్థలు

- వైద్యం సరిగా అందక వందలాదిమంది రోగులు మృతి



దేర్ అల్ బాలాహ్ (గాజా) : గాజాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న దిగ్బంధనం కారణంగా ఆహార పదార్థాలు, ఔషధాలు, ఇతర నిత్యావసరాలు అందక ప్రజలు అల్లాడిపోతున్నారు. దీనికితోడు మందులు, ఇతర అత్యవసర వైద్య చికిత్సలు అందక రోగులు వందల సంఖ్యలో మృత్యువాత పడుతున్నారు. వారానికి నాలుగుసార్లు డయాలసిస్‌పై ఆధారపడి రోజులు వెళ్లదీసే రోగుల అవస్థలు చెప్పనక్కరలేదు. మార్చి ప్రారంభం నుండి ఇప్పటివరకు 11మంది రోగులు సకాలంలో వైద్యం అందక మరణించారు. కిడ్నీలు విఫలమై 417మంది మరణించారని అల్ షిఫా ఆస్పత్రిలో డయాలసిస్ విభాగ అధిపతి డాక్టర్ ఘజీ చెప్పారు. మొత్తంగా యుద్ధం ప్రారంభమైన తర్వాత 1100మందికి పైగా రోగులు మృత్యువాత పడ్డారు. గాజావ్యాప్తంగా ఆస్పత్రులన్నీ దాడుల్లో ధ్వంసం కావడంతో డయాలసిస్ కోసం వారంలో రెండుసార్లు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితులున్నాయి. లేనిపక్షంలో శరీరమంతా ఉబ్బిపోయి, విషపూరితమయ్యే దారుణ పరిస్థితులను ఎదుర్కొంటున్నామని, ఒకోసారి అవి మరణానికి దారి తీస్తున్నాయని డాక్టర్ ఘజీ చెప్పారు. నగరానికి పశ్చిమాన గల తాత్కాలిక శిబిరాల నుండి ఉత్తర ప్రాంతంలోని షిఫా అస్పత్రికి వెళ్లడమంటే వారికి అత్యంత ఇబ్బందికరంగా మారుతోంది. 54 ఏళ్ల మహ్మద్ అతియా దాదాపు 15ఏళ్ల నుండి కిడ్నీ వైఫల్యంతో బాధపడుతూ డయాలిసిస్‌పై జీవిస్తూ, వీల్ ఛైర్‌కే పరిమితమయ్యారు. రోగికి వారానికి కనీసం మూడుసార్లు డయాలసిస్ అవసరం, ప్రతీసారి నాలుగు గంటలు చొప్పున ఈ ప్రక్రియ వుంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో రెండు సార్లు మాత్రమే చేయడానికి సాధ్యమవుతోందని, అది కూడా రెండు నుండి మూడు గంటల్లోనే ముగించాల్సి వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా నెలకొన్న దుర్భర పరిస్థితుల్లో సరైన సరఫరాలు, సదుపాయాలు లోపించడంతో తన రక్తంలోని వ్యర్థాలను పూర్తిగా తొలగించుకోలేని పరిస్థితి నెలకొందని ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత దిగ్బంధన చర్యలపై వ్యాఖ్యానించడానికి ఇజ్రాయిల్ మిలటరీ సంస్థ ఇన్‌చార్జి సిఓజిఎటి (కోఆర్డినేషన్ ఆఫ్ గవర్నమెంట్ యాక్టివిటీస్ ఇన్ ది టెరిటరీస్) నిరాకరించారు. గాజా లోపలకు ప్రవేశించడానికి అనుమతులు లేక టన్నుల కొద్దీ మందులు, ఇతర వైద్య పరికరాలు, సామాగ్రి గాజా సరిహద్దుల్లో పడివున్నాయి. యుద్ధంతో గాజాలో మొత్తంగా ఆరోగ్య వ్యవస్థ చిన్నాభిన్నమైంది.


సుప్రీంకోర్టు ఆవరణలో నివాళులర్పిస్తున్న జడ్జిలు , న్యాయవాదులు, సిబ్బంది

ఉగ్రవాదుల పిరికి చర్య

- పహల్గాం మృతులకు నివాళులర్పిస్తూ సుప్రీం కోర్టు తీర్మానం

న్యూఢిల్లీ : పహల్గాం ఉగ్రదాడిని సుప్రీంకోర్టు తీవ్రంగా ఖండించింది. పర్యాటకులపై జరిగిన దాడిని 'ఉగ్రవాదుల పిరికి చర్య' గా పేర్కొంది. ఈ ఘటనపై తీవ్రంగా ఆవేదన వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టు ఫుల్ బెంచ్ (పూర్తి ధర్మాసనం) బుధవారం ఏకగ్రీవంగా ఒక తీర్మానాన్ని ఆమోదించింది. బాధితులకు, వారి కుటుంబాలకు సంఘీభావం తెలుపుతూ కోర్టు ఆవరణలో జడ్జీలు, న్యాయవాదులు, సిబ్బంది రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ దాడిలో అత్యంత దారుణంగా హత్యకు గురైన వారికి కోర్టు నివాళులర్పించింది. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించింది.

"ఈ బుద్ధిహీనమైన హింసాత్మక చర్య అందరి మనసులను కదలించింది. ఉగ్రవాదపు క్రూరత్వానికి, అమానుషానికి ఇదొక గుర్తుగా మిగిలింది" అని ఆ తీర్మానం పేర్కొంది. "మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాం. బాధిత కుటుంబాలకు దేశం అండగా నిలుస్తుంది. భారతదేశానికి మకుటాయమానంగా నిలిచే కాశ్మీర్‌లోని సహజ సౌందర్యాన్ని ఆస్వాదిస్తున్న పర్యాటకులపై జరిగిన ఈ దాడి నిస్సందేహంగా మానవత్వ విలువలకు అవమానకరం. ఈ దాడిని కోర్టు తీవ్రంగా ఖండిస్తోంది" అని ఆ తీర్మానం పేర్కొంది.

సుప్రీంలో పిల్

ఇదిలా వుండగా, ఇటువంటి ప్రకృతి రమణీయతకు ఆలవాలంగా నిలిచే కొండ ప్రాంతాలు, మారుమూల ప్రాంతాలను సందర్శించే పర్యాటకుల భద్రత కోసం తక్షణమే చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని, జమ్మూ కాశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతాన్ని ఆదేశించాలని కోరుతూ న్యాయవాది విశాల్ తివారీ సుప్రీం కోర్టులో పిల్ దాఖలు చేశారు.

పర్యాటకులు బిక్కుబిక్కు

- ఉగ్రదాడి నేపథ్యంలో కాశ్మీరీల ఉదారత
- టూరిస్టులకు ఫ్రీగా ఆటో, ట్యాక్సీ రైడ్లు

పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి అనంతరం.. అక్కడున్న పర్యాటకులు భయంతో బిక్కుబిక్కుమంటున్నారు. వారికి అక్కడి వ్యాపారులు, స్థానికులు తమ తోచిన సాయం చేస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్నారు. ఆటో రిక్షాలు, ట్యాక్సీ డ్రైవర్లు ఎలాంటి చార్జీలు లేకుండా ఉచితంగానే వారి గమ్య స్థానాలకు చేరుస్తున్నారు. అధిక ధరల నేపథ్యంలో ఉచితంగా ఆవాసం కల్పిస్తున్నారు

వారు మాకు అతిథులు... అందుకే సురక్షితంగా ఎయిర్‌పోర్టు వద్ద దింపా : బిలాల్ అహ్మద్, ఆటో డ్రైవర్

"ఇది కేవలం పర్యాటకుల మీద జరిగిన దాడి మాత్రమే కాదు. కాశ్మీర్ ఆత్మపై జరిగిన దాడిగా భావించాలి. వారంతా మాకు అతిథులుగా వచ్చారు. కానీ ఇప్పుడు వారంతా భయంతో వెళ్తున్నారు. ఇది మాకు చాలా బాధగా అనిపిస్తుంది. నవ దంపతులు భయంతో వణుకుతూ వచ్చి ఎయిర్‌పోర్ట్‌కు ఎలా వెళ్లాలి అని అడిగారు. వారికి ఎవరిని నమ్మాలో కూడా అర్థం కావట్లేదు. దీంతో మీరు భద్రంగా ఉన్నారు...భయపడకండి అని చెప్పా. వారిని సురక్షితంగా ఎయిర్‌పోర్ట్ వద్ద వదిలా. వారు డబ్బులు ఇచ్చేందుకు ప్రయత్నించారు. కానీ అలాంటి పరిస్థితుల్లో వారి నుంచి నేను డబ్బులు ఎలా తీసుకోగలను?"

పర్యాటకులకు ఓపెన్ హోమ్స్

శ్రీనగర్‌కు చెందిన డాక్టర్ కూడా తన మంచి మనసును చాటుకుంటున్నారు. తన ఇంటినే హెూటల్‌గా మార్చి పర్యాటకులకు ఉచితంగా ఆవాసాన్ని కల్పిస్తున్నారు. అధిక ధరలు, హైవే మూసివేత కారణంగా ఇబ్బంది పడుతున్న పర్యాటకులు తమ ఇంటిని ఉపయోగించుకోవచ్చని డాక్టర్ ఇరాన్ తెలిపారు.

హోటల్ బుకింగ్స్ రద్దు

ఉగ్రదాడితో పహల్గాంలో ఉన్న పర్యాటకులు హెూటళ్లను ఖాళీ చేశారు. దాదాపు 95శాతం మంది హెూటళ్లు ఖాళీ చేసి వెళ్లినట్టు నిర్వాహకులు చెబుతున్నారు. సుమారు నెల వరకు హెూటల్స్ బుకింగ్స్ అయ్యాయని, కానీ ఇప్పుడు వారంతా రద్దు చేసుకున్నట్టు చెబుతున్నారు. పహల్గాంలో దాదాపు 400 హెూటళ్లు ఉంటాయని ఆ సంఘం అధ్యక్షుడు ముస్తాక్ తెలిపారు.

ప్రత్యేక విమానాలకు చర్యలు

ఇటీవల కొండచరియలు విరిగిపడడం వల్ల 44వ నంబర్ జాతీయ రహదారిని మూసివేశారు. ఫలితంగా పర్యాటకులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. చాలా మంది శ్రీనగర్ ఎయిర్‌పోర్టుకు వెళ్తున్నారు. దీంతో శ్రీనగర్ విమానాశ్రయం పర్యాటకులతో రద్దీగా మారింది. ఈ నేపథ్యంలోనే పర్యాటకుల భద్రత కోసం శ్రీనగర్ నుంచి ప్రత్యేక విమాన సర్వీసులు ఏర్పాటు చేస్తున్నట్టు కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడు వెల్లడించారు. నాలుగు ప్రత్యేక విమానాలు శ్రీనగర్ నుంచి ముంబయి, ఢిల్లీకి చేరుకుంటాయని, దీనిపై మంగళవారం హెూంమంత్రి అమిత్ షాతో మాట్లాడినట్టు రామ్మోహన్‌నాయుడు చెప్పారు. అవసరమైతే మరిన్ని విమానాలు నడపడానికి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఇందులో భాగంగా అన్ని విమానయాన ఆపరేటర్లతో ఆయన అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ కష్ట సమయంలో ప్రయాణికులపై భారం పడకుండా, సాధారణ స్థాయి ఛార్జీలను వసూలు చేయాలని విమానయాన సంస్థలను మంత్రి ఆదేశించారు. మరణించిన వ్యక్తుల మృతదేహాలను వారి స్వస్థలాలకు తరలించడానికి రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం చేసుకుంటూ పూర్తి సహకారాన్ని అందించాలని కోరారు.

పిల్ ఉపసంహరణపై హైకోర్టు ఆగ్రహం

ప్రజాశక్తి-అమరావతి : గత ప్రభుత్వ హయాంలో సమీకృత బిఎస్‌ఎం ప్రాజెక్ట్ ప్లానింగ్, ఇంజినీరింగ్, ఫైనాన్సింగ్, నిర్మాణం, నిర్వహణకు ఎపి ఖనిజాభివృద్ధి సంస్థ (ఎపిఎండిసి) బిడ్లను ఆహ్వానించడాన్ని తప్పుపడుతూ దాఖలైన పిల్‌ను ఉపసంహరించుకుంటామని పిటిషనర్ చెప్పడంపై హైకోర్టు ఆగ్రహించింది. రూ.లక్ష హైకోర్టులో డిపాజిట్ చేయాలని పిటిషనర్‌ను ఆదేశించింది. ఆ తర్వాతే కేసు వివరాల్లోకి వెళతామని తేల్చి చెప్పింది. పిల్ వెనక్కి తీసుకోవడంపై వాస్తవాలు రాబట్టేందుకు అమికస్ క్యూరీగా (కోర్టుకు సహాయకారి) న్యాయవాదిని నియమిస్తామని చెప్పింది. పిల్ పేరుతో కోర్టును ఇతర అవసరాలకు వాడుకుంటామంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించింది. పిల్ దాఖలు చేసే వరకే పిటిషనర్ పరిధి అని, ఆ తర్వాత పిల్ బాధ్యత పూర్తిగా కోర్టుదేనని చెప్పింది. విచారణను వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. అదేవిధంగా గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలం, గ్రామంలో గ్రీన్ జోన్‌గా నిర్ణయించిన కృష్ణానది ఒడ్డున అక్రమ నిర్మాణాలు ఉన్నాయని, వాటిని కూల్చేయాలని దాఖలు చేసిన పిటిషనర్ రూ.లక్ష జమ చేయాలని సిజె ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మొత్తాన్ని డిపాజిట్ చేశాకే పిటిషన్‌పై విచారణ చేస్తామని ప్రకటించింది.

'ఉండి' కూల్చివేతలపై చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

సిబిఐ కూడా విచారణ జరుపుతోందని పేర్కొన్నారు. రాఘురామ అక్రమాలు, అన్యాయాలపైనా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు కోర్టు స్టేలో ఉన్న ఇళ్లనూ కూల్చివేశారని, ఇటీవల సుప్రీంకోర్టు న్యాయమూర్తి కూడా ఇలాంటి ఇళ్ల కూల్చివేతలపై తీవ్రంగా స్పందించిన విషయాన్ని శ్రీనివాసరావు గుర్తుచేశారు. ఎమ్మెల్యే చెప్పారని ఇళ్లు కూల్చిన అధికారులు తరువాత బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. నియోజకవర్గంలో ఆర్‌ఆర్‌ఆర్ ఇన్ని దుర్మార్గాలు చేస్తుంటే ప్రభుత్వం ఏమి చేస్తుందని ప్రశ్నించారు. గతంలో విధ్వంసపాలనపై పోరాడతానని చెప్పిన రఘురామ ఇప్పుడు రావణాసురిడిలా విధ్వంసాలు చేస్తుంటే చూస్తూ ఊరుకోవడం సరికాదని అన్నారు. అడవిలో మృగం మాదిరి ఆయన ప్రజలను వేటాడుతున్నారని, దీనిపై సిఎం చంద్రబాబు చర్యలు తీసుకోవాలని కోరారు. మరీ ముఖ్యంగా ఇళ్ల కూల్చివేతల సమయంలో మగ పోలీసులు ఆడవారిపై దౌర్జన్యం చేశారని, ఓ మహిళను గోడకేసి కొట్టడంతో తలపగిలి తీవ్ర గాయాలపాలయ్యారని తెలిపారు. చనిపోయిన మహిళకు నోటీసులిచ్చి ప్రభుత్వ అమానుషత్వాన్ని చాటుకున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి పేదలకు న్యాయం చేయాలని, కూల్చివేసిన చోటే పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇదే పద్ధతిలో వ్యవహరిస్తే పేదలను కూడగట్టి పెద్దయెత్తున పోరాటం చేస్తామని, ఇది రాష్ట్రవ్యాపిత రూపం తీసుకుంటుందని హెచ్చరించారు.

ఉండి కూల్చివేతలపై ఎగ్జిబిషన్

ఉండి నియోజకవర్గ కూల్చివేతలను కళ్లకు కట్టే చిత్రాలతో కూడిన ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పోలీసులు ఎంత దౌర్జన్యంగా వ్యవహరించారో ఫొటోల ద్వారా అర్థమవుతుందని తెలిపారు. దాడులు, దౌర్జన్యాలకు ఆర్‌ఆర్‌ఆర్ అడ్రస్‌గా మారారని, దానికి ఈ చిత్రాలే నిదర్శమని పేర్కొన్నారు.



మీకోసం

పచ్చిమిర్చి, అల్లం, జీలకర్ర కలిపి గ్రైండ్ చేసి ఫ్రిజ్‌లో పెట్టుకుంటే ఏ కూరలోనైనా వాడుకోవొచ్చు.

జీవన సౌరభం

జీవితంలో చాలామంది గురువులు తారసపడతారు. కొందరు పాఠం నేర్పుతారు. మరికొందరు గుణపాఠం నేర్పుతారు.

సామాజిక సేవ ధ్యేయంగా...

పరిపాలనలో పేరుకుపోయిన అవినీతిని ఎండగట్టడం, ప్రజలని చైతన్యం చేయడం, సమాజాన్ని ముందుకు నడిపించడం ఐఎఎస్‌ల బృహత్తర బాధ్యతల్లో కొన్ని. ఉన్నతశ్రేణి అధికారులుగా ఈ కొలువులు సాధించడం అంత ఆషామాషీ కాదు, ఎంతో కఠోరదీక్ష చేయాలి. అంతకుమించి నేర్పు కావాలి. ఆ రెండిటినీ మించి అకుంఠిత పట్టుదల కావాలి. ప్రతి ఏడాది ఈ పరీక్షల్లో విజయపరంపర కొనసాగిస్తున్న ఎంతోమంది అభ్యర్థులను చూస్తున్నాం. ఈసారి విడుదలైన యుపిఎస్‌సి పరీక్షా ఫలితాల్లో మరోసారి ఈ విషయం రుజువైంది. అమ్మాయిలు, అబ్బాయిలు 'నువ్వా, నేనా' అన్నట్లు పోటీ పడి మరీ ర్యాంకులు సాధించారు. నియామకాలు పొందిన మొత్తం 1009 మంది అభ్యర్థుల్లో 725 మంది పురుషులు, 284 మంది మహిళలు ఉన్నారు. ఇక్కడ విశేషమేమంటే మొదటి పది ర్యాంకుల్లో ఐదుగురు మహిళలు సాధించారు. ఫస్ట్ ర్యాంకు కూడా మహిళకే దక్కింది.



మొదటి ర్యాంకు సాధించిన శక్తి దూబె చదువులో ఎప్పుడూ టాపర్‌గా నిలిచేవారు. ప్రయాగ్‌రాజ్‌కి చెందిన శక్తి గతేడాది ఇంటర్వ్యూ వరకు వెళ్లి వెనక్కివచ్చారు. ఈ ప్రయాణంలో మూడుసార్లు ఆమెకి విజయం దక్కలేదు. అయినా నిరుత్సాహపడకుండా ఈసారి మళ్లీ ప్రయత్నించి దేశంలోనే ఫస్ట్ ర్యాంకు సాధించారు. 'సివిల్స్ కోసం ప్రయత్నించే వాళ్లు ఎప్పటికప్పుడు లోపాలను సరిదిద్దుకుంటూ ఉండాలి. అలా కృషి చేస్తేనే లక్ష్యం సాధిస్తారు అని ఆమె చెబుతున్నారు. బెనారస్ హిందూ యూనివర్శిటీలో బయోకెమిస్ట్రీలో పీజీ చేసిన శక్తి టీచర్‌గా కూడా విధులు నిర్వర్తించారు. అప్పుడు జరిగిన ఓ సంఘటన ఆమె దిశని మార్చింది. టీచర్ నుండి ఐఎఎస్ అధికారిగా మారేలా చేసింది. ఆ అనుభవాన్ని ఆమె ఓ సారి ఇలా చెప్పారు. 'పీజీ చదువుతున్న రోజుల్లో ఓసారి బాగా ఆలస్యమైంది. ఇంటికి వెళ్లేందుకు బస్టాప్‌లో వేచి చూస్తున్నా. చాలా భయమేసింది. అప్పుడే అటుగా ఓ పోలీసు జీపు వచ్చింది. అది చూసి నాకు చాలా ధైర్యమొచ్చింది. మా నాన్న పోలీసు. అయినా అన్ని ఉద్యోగాల్లో అదొకటని భావించేదాన్ని. కానీ ఆ రోజు నా ఆలోచన తప్పనిపించింది. పౌర సేవల్లో ఉంటే ప్రజల జీవితాలను ఎంతలా ప్రభావితం చేయొచ్చో అర్థమైంది. అప్పుడే నేను పబ్లిక్ సర్వీస్ వైపు అడుగుపెట్టాలని నిర్ణయించుకున్నాను' అని శక్తి తన ఐఎఎస్ కల గురించి వివరించారు.

శక్తి తరువాత హర్యానాకి చెందిన హర్షిత గోయల్ 2వ ర్యాంకు సాధించారు. 'ఎక్కువ సేపు చదవడం కాదు, ఎంత శ్రద్ధగా చదివామన్నదే సివిల్స్ సాధించడం వెనుక రహస్యం' అని ఆమె చెబుతున్నారు. గుజరాత్‌కి చెందిన షా మార్గి చిరాగ్ (4), కంప్యూటర్ ఇంజినీరింగ్ పూర్తిచేశారు. 2023 యుపిఎస్‌సి పరీక్షల్లో ఇంటర్వ్యూ వరకు వెళ్లి వెనక్కి తిరిగారు. ఈసారి మరింత పట్టుదలగా శ్రమించి లక్ష్యం సాధించారు. ఉత్తరప్రదేశ్‌కి చెందిన కోమల్ పునియా (6), ఫిజిక్స్‌లో బీటెక్ పూర్తవ్వడంతోనే ఐఎఎస్ లక్ష్యం పెట్టుకున్నారు. 2023లో తొలి ప్రయత్నంలోనే ఐపిఎస్‌గా సెలక్ట్ అయ్యారు. ఈసారి ఐఎఎస్ కలని నెరవేర్చుకున్నారు.

అమ్మ కల నెరవేర్చాలని

మధ్యప్రదేశ్ గ్వాలియర్‌లో మధ్య తరగతి కుటుంబంలో పుట్టిన ఆయుషి (7), పదేళ్ల వయసప్పుడే తండ్రి చనిపోయారు. ఒంటరి తల్లి పెంపకంలో పెరిగిన ఆయుషి, 'అమ్మ కలని నెరవేర్చడం కోసం, ఐఎఎస్ సాధించాన'ని చెబుతున్నారు. సమాజంలో ఎక్కడ చూసినా లింగవివక్షత, లైంగిక వేధింపులు, కులం, మతం ఘర్షణలే కనిపిస్తున్నాయి. వీటిని నిర్మూలించే స్థానంలో ఉండాలనుకున్నా. అమ్మ ఎప్పుడూ ఐఎఎస్ అయి, అణగారిన వర్గాలకు సేవ చేయాలని చెప్పేది' అంటున్న ఆయుషి, 2021 నుండే ఐఎఎస్ లక్ష్యం పెట్టుకున్నారు. మొదటి ప్రయత్నంలోనే 188వ ర్యాంకుతో ఐపిఎస్‌కి సెలక్ట్ అయ్యారు. 2023లో 97వ ర్యాంకుతో మెరిశారు. ప్రస్తుతం కర్ణాటకలో ఐపీఎస్ అధికారిగా పనిచేస్తున్నారు. ఇప్పుడు 7వ ర్యాంకుతో లక్ష్యం చేరుకున్నారు.

పరీక్ష మధ్యలో బిడ్డకి పాలిచ్చి..

కేరళకి చెందిన మాళవిక జి నాయర్ ఈ పరీక్షల్లో 45వ ర్యాంకు సాధించారు. అంతకుముందే 2020లో ఆమె సివిల్స్ ర్యాంకు సాధించి ఐఆర్ఎస్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. అప్పటి నుండి ప్రతి ఏడాది సివిల్స్‌కి సిద్ధమయ్యారు. ఈ ఏడాది పరీక్ష ఆమెకి 6వది, చివరి పరీక్ష. ప్రిలిమ్స్ పరీక్ష సమయానికి గర్భవతిగా ఉండి హాజరయ్యారు. మెయిన్స్ పరీక్ష రాసేటప్పటికి కొడుకు పుట్టి రెండు వారాలే అయ్యింది. అయినా ఆమె పరీక్ష రాశారు. బిడ్డకి పాలిచ్చేందుకు పరీక్ష హాలు బయట బిడ్డని తీసుకుని మాళవిక తల్లి ఎదురుచూసేవారు. పరీక్ష విరామ సమయంలో పసికందుకు పాలిచ్చి ఆమె పరీక్ష రాశారు. అంత పట్టుదలతో ప్రయత్నించి చివరి ప్రయత్నంలో 45వ ర్యాంకు సాధించి ఐఎఎస్ కలని సాకారం చేసుకున్నారు.

తెలుగు రాష్ట్రాల్లో..



మొత్తం ర్యాంకుల్లో 50 మందికి పైగా తెలుగువారు ఉన్నారు. 11వ ర్యాంకుతో సత్తా చాటిన సాయి శివాని తెలంగాణకి చెందిన వారు. వరంగల్ జిల్లా వాసి అయిన శివాని తొలిసారి సివిల్స్ ప్రయత్నంలో ప్రిలిమ్స్ పరీక్షకి కూడా అర్హత సాధించలేదు. అయినా పట్టువదలకుండా పరీక్షలకి సిద్ధమవుతూనే ఉన్నారు. సొంతంగా నోట్సు సిద్ధం చేసుకోవడం శివాని ప్రత్యేకత. ఆన్‌లైన్ గైడెన్స్ కూడా ఆమె సాధనకి తోడైంది. ఇప్పటివరకు ఫోను కూడా వాడలేదని ఆమె స్వయంగా ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. సోషల్ మీడియాకి దూరంగా ఉంటూ, టీవీలు, పత్రికల ద్వారా ట్రెండింగ్ విషయాలు తెలుసుకునేదాన్నని ఆమె చెప్పారు. తాజాగా తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన గ్రూప్-1 పరీక్షల్లోనూ ఆమె సత్తా చాటారు. 21వ ర్యాంకు సాధించారు.

రైతు బిడ్డ వెంకటేష్



శ్రీకాకుళం జలుమూరు మండలం అల్లాడపేటకి చెందిన బాన్న వెంకటేష్ తండ్రి రైతు, తల్లి గృహిణి. వెంకటేష్ ఈ పరీక్షల్లో 15వ ర్యాంకుతో సత్తా చాటారు. గతేడాది సివిల్స్‌లో 467 ర్యాంకుతో ఐపిఎస్‌కి సెలక్ట్ అయి ప్రస్తుతం హైదరాబాద్‌లో శిక్షణ తీసుకుంటున్నారు. ఐపిఎస్ శిక్షణ తీసుకుంటూనే ఐఎఎస్‌కి మరోసారి ప్రయత్నించి సఫలం అయ్యారు. కోటబొమ్మాళి మండలం చలమయ్యపేటకి చెందిన లింగూడు జోషిబాబు సివిల్స్ రెండో ప్రయత్నంలో 790వ ర్యాంకు సాధించారు.

చిట్టితల్లి కోరిక



సాయంత్రం అయ్యిందో లేదో
బడి గంట మోగింది రయ్ అంటూ
ఇంటికి పరుగు తీసింది చిట్టి తల్లి
వచ్చి రాంగానే స్కూల్ బ్యాగ్
వరండాలో విసిరేసి
అమ్మ ఇచ్చిన ఫలహారం
మింగేసి గబగబా ...

తోటి బాలలను పిలిచింది
ఆడుకుందాం రమ్మని
వీధిలోకి పరుగు తీసింది హుషారుగా
ఆడుతూ పాడుతూ గంతులు వేస్తూ
కబుర్లన్నీ చెప్పుకుంటూ
సంతోషంగా గడిపారు
చిన్నారులంతా జాలీగా ...

చీకటి పడగానే ఎవరింటికి వారు
జారుకున్నారు మెల్లిగా
అది చూసి చిట్టితల్లి ఏడ్చింది బిగ్గరగా
తాతయ్యను పిలిచి తన గోడు చెప్పింది గారంగా
చిట్టితల్లి బుంగమూతిని చూడంగానే
జాలేసి తాతయ్య అడిగాడు మురిపెంగా

ఎత్తుకొని లాలించి బుజ్జగించి
ఆకాశంలో మెరుస్తున్న
అందమైన జాబిలమ్మను చూపించాడు
చక్కగా అదిగదిగో జాబిలమ్మ నిన్ను
విడిచిపెట్టి
ఎక్కడికి పోనే పోదంట
నువ్వు ఎక్కడికెళ్ళినా నీ కూడానే
వచ్చునంట అనగానే

ఏడుపాపి ఆ నెలవంకని
చూసింది ఆశ్చర్యంగా
కాసేపు ఆగాక జాబిలమ్మతో
ఆటలాడుతానని మారాం చేస్తూ
ఓ చిన్న కోరిక కోరింది చిలిపిగా

అద్దంలో జాబిలమ్మని చూపించి
నింగిలోన జాబిలమ్మ
నేల మీద జాబిలమ్మ అద్దంలో అందంగా
కనిపిస్తున్నారిక్కడ
చూడు చూడు అంటూ
చిట్టితల్లి మోమును
అద్దంలో చూపిస్తూ
తన పక్కన ఉన్న చందమామను కూడా
చూపించి ముద్దులాడేడు మురిపెంగా
అది చూసి చిట్టితల్లి
పగలబడి నవ్వింది సంతోషంగా

- నేదూరి భాను సాయి శ్రేయ,
93924 67155, నరసాపురం.

నేను గీసిన బొమ్మ





భన్విజ చౌదరి కొట్టూరు,
3వ తరగతి,
సంస్కృతి విద్యామందిర్,
కంచికచర్ల,
ఎన్‌టిఆర్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68